www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

కొద్ది రోజులు నిదానంగా ఉండు.. **13**

అన్నీ సర్దుకుంటాయి

ఎమ్మెల్సీ కవితకు తల్లి శోభ సూచన

కూతురి ఇంటికి వెళ్లిన కేసీఆర్ సతీమణి

అల్లుడి పుట్టినరోజు వేడుకకు హాజరు

శుక్రవారం | 12-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 165 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: పంచమి ఉ.9.59 తదుపరి షష్ఠి; నక్షత్రం: భరణి ఉ.11.59 తదుపరి కృత్తిక; వర్జ్యం: రా.11.05-12.33, దుర్ముహూర్తం: ఉ.8.32-9.21, మ.12.35-1.24, అమృతఘడియలు: ఉ.7.34-9.02, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.06, సూర్యాస్తమయం: 6.16 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆర్‌ఆర్ రైలుకు

362 కిలోమీటర్లు..

19 స్టేషన్లు..

6 వేల ఎకరాలు



దక్షిణ మధ్య రైల్వే అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం. చిత్రంలో ఎంపీ కావ్య, సీఎస్, ఇతర అధికారులు

రీజినల్ రింగు రోడ్డు పక్కనే రీజినల్ రింగు రైలు

45 మీటర్ల వెడల్పుతో రైలు మార్గం.. రూ.25 వేల కోట్ల వ్యయం

రాష్ట్ర ప్రభుత్వానికి వివరాలు తెలిపిన రైల్వే అధికారులు

తొలుత ఆర్‌ఆర్‌ఆర్‌కు 10 కి.మీ. దూరంలో నిర్మాణానికి యోచన

తాజాగా ట్రిపుల్ ఆర్ పక్కనే నిర్మించాలని కేంద్రం, రాష్ట్రం నిర్ణయం

రింగు రైలు అలైన్‌మెంట్ మారిందని ముందేచెప్పిన 'ఆంధ్రజ్యోతి'

350 కి.మీ వేగంతో హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరుకు రైళ్లు

భారీ వ్యయంతో రెండు కారిడార్లను నిర్మించనున్న కేంద్రం

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు కేంద్రం మంజూరు చేసిన రీజినల్ రింగు రైలు అలైన్‌మెంట్ మారింది. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు 10 కిలోమీటర్ల దూరంలో నిర్మించాలని తొలుత అనుకున్నప్పటికీ.. ఈ రైలు మార్గాన్ని రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)కు పక్కనే నిర్మించాలనే నిర్ణయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చాయి. ఈమేరకు.. మార్చిన రైలు మార్గం అలైన్‌మెంట్‌పై గురువారం సీఎం రేవంత్ కేంద్ర రైల్వే శాఖ ఉన్నతాధికారులతో కలిసి సమీక్షించారు. రాష్ట్రానికి రింగు రైలు మంజూరైనప్పుడు అనుకున్న అలైన్‌మెంట్.. ఇప్పుడు రింగు రోడ్డు పక్కనే రైలును నిర్మించేందుకు రూపొందించిన ప్రాథమిక అలైన్‌మెంట్ల వివరాలను రైల్వే అధికారులు సీఎంకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో తెలియజేశారు. తాజాగా రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం రీజినల్ రింగు రోడ్డు పక్కనే రైలు మార్గాన్ని నిర్మించేందు కు 45 మీటర్ల వెడల్పుతో భూమి కావాలని తెలిపారు. అలాగే 362 కిలోమీటర్ల మేర రైలు మార్గం ఉంటుందని, ఈ మధ్యలో దాదాపు 19 స్టేషన్లు వస్తాయని వివరించారు. రైలు మార్గం, స్టేషన్ల నిర్మాణం, భూసేకరణ పరిహారం.. వీటన్నింటికీ కలిపి దాదాపు రూ.25,550 కోట్ల వరకూ ఖర్చవుతుందని వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణ, హైదరాబాద్ మీదుగా వెళ్తున్న రైలు మార్గాల్లో సుమారు 6 మార్గాలకు సంబంధించిన స్టేషన్లు కూడా దీంతో అనుసంధానమవుతాయని పేర్కొన్నారు. రింగు రైలు మార్గం కోసం 4030 ఎకరాలు, రైల్వే స్టేషన్ల నిర్మాణం కోసం 1090 ఎకరాలు, ఇతర రైలు మార్గాల కనెక్టివిటీల

మిగతా 13వ పేజీలో...

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా **13**

కొత్త ప్రాజెక్టుల అలైన్‌మెంట్లు

విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్టుల అనుసంధానం

పెండింగ్ ప్రాజెక్టులు, రైల్వే లైన్ల పూర్తికి సహకరిస్తాం

రీజినల్ రింగ్ రైలు హైదరాబాద్ స్వరూపాన్నే మార్చనుంది

దక్షిణ మధ్య రైల్వే అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్



నేను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేనే..!

నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎంను కలిశా

నేను కప్పుకొన్నది కాంగ్రెస్ పార్టీ కండువా కాదు..

జాతీయ జెండాలోని 3 రంగులతో కూడిన కండువా

స్పీకర్‌కు వేర్వేరుగా వివరణ ఇచ్చిన 8 మంది ఎమ్మెల్యేలు

మరింత సమయం కావాలంటూ మిగతా ఇద్దరి విజ్ఞప్తి

వివరణల ఆధారంగా బీఆర్‌ఎస్‌కు నోటీసులిచ్చిన స్పీకర్!

విచారణకు హాజరై వాదనలు వినిపించాలని సూచన

హైదరాబాద్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): "నేను పార్టీ మారలేదు! ఇప్పటికీ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగానే సభలో కొనసాగుతున్నాను. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలిసినట్లుగానే.. నేనూ నా నియోజకవర్గ అభివృద్ధి పనులపైనే రేవంత్‌రెడ్డిని కలిశాను. నేను కలిసినప్పుడు.. సీఎం రేవంత్ నా మెడలో వేసింది కాంగ్రెస్ కండువా కాదు. జాతీయ జెండాలోని మూడు రంగులతో కూడిన కండువా!" - బీఆర్‌ఎస్ ఇచ్చిన అనర్హత పిటిషన్‌కు సంబంధించి స్పీకర్ ప్రసాద్‌కుమార్

మిగతా 12వ పేజీలో...

జూబ్లీహిల్స్‌లో నేను

పోటీ చేయట్లేదు

కాంగ్రెస్ అధిష్ఠానం ఎవరికి టికెటిచ్చినా వారి గెలుపే లక్ష్యంగా పనిచేస్తా

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ **12**

ఇదేం ద్వంద్వనీతి?

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్‌ను ఎందుకు ప్రశ్నించడం లేదు?

కాంగ్రెస్‌పై టీబీజేపీ చీఫ్ రాంచందర్‌రావు విమర్శలు



4.2 ఎకరాలు..

3,472 కోట్లు

ముంబయిలోని నారిమన్ పాయింట్‌లో ఆర్బీఐ కొనుగోలు

ముంబై మెట్రో సంస్థ నుంచి..

కొత్త భవన సముదాయం కోసం

ముంబై, సెప్టెంబరు 11: నూతన కార్యాలయ భవన సముదాయం కోసం భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) రూ.3,472 కోట్లతో ముంబైలో స్థలం కొనుగోలు చేసింది. నగరానికి గుండెకాయ లాంటి నారిమన్ పాయింట్‌లో 4.2 ఎకరాల (16,832 చదరపు మీటర్లు) ప్లాటును ముంబై మెట్రో రైల్ కార్పొరేషన్ (ఎంఎంఆర్‌సీఎల్) నుంచి కొనుగోలు చేసింది. ఈ నెల అయిదో తేదీన

మిగతా 2వ పేజీలో...

జగన్ పీఏకూ 'కిక్కు!'

సునీల్ రెడ్డి పేరుతో పదికిపైగా కంపెనీలు.. విశాఖపట్నం, హైదరాబాద్‌లలో సిట్ సోదాలు

వైసీపీ హయాంలో రెండు జే బ్రాండ్లు సునీల్‌రెడ్డివే **3**

నేడు ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం

మహారాష్ట్ర గవర్నర్ పదవికి రాజీనామా **2**

ముంచెత్తిన వాన!

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో దంచి కొట్టిన వర్షాలు

ములుగు జిల్లా జేడీ మల్లంపల్లిలో 19.4 సెం.మీ.

మెదక్‌లో 3 గంటల్లో 17 సెం.మీ.ల వాన

హుజూరాబాద్‌లో 2 గంటల్లోనే 16 సెం.మీ.

లోతట్టు ప్రాంతాల మునక.. నిలిచిన రాకపోకలు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: సీఎం



హైదరాబాద్-విజయవాడ హైవేపై హయత్‌నగర్ వద్ద భారీగా నిలిచిన నీరు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచి కొట్టాయి.. గురువారం కొన్ని జిల్లాల్లో కొద్ది గంటల్లోనే కుండపోత వర్షాలు కురవగా.. మరికొన్ని జిల్లాల్లో పొద్దంతా ఎడతెరిపి లేకుండా ముసురు పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాకపోకలు స్తంభించాయి. పలుచోట్ల వాగులు, చెరువులు పొంగిపొర్లగా.. పంటపొలాలు మునిగిపోయాయి. గురువారం (ఉదయం 8.30 నుంచి రాత్రి 9 వరకు) అత్యధికంగా ములుగు జిల్లా జేడీ మల్లంపల్లిలో 19.40 సెంటీమీటర్ల వర్షం కురవగా.. రంగారెడ్డి జిల్లా గున్‌గల్‌లో 18 సెం.మీ., యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాకలో 17.5, అదే జిల్లా మోటకొండూర్‌లో 16.5 సెం.మీ. వాన పడింది. ఇక మెదక్‌లో 3 గంటల్లోనే 17 సెం.మీ. కురవగా.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని బోర్నపల్లిలో 2 గంటల్లోనే 16 సెం.మీ. వర్షం పడింది. మెదక్‌లో ఉదయం తొమ్మిదిన్నర గంటలకు సన్నగా ప్రారంభమైన వర్షం కాస్తా కాసేపటికి కుంభవృష్టిలా మారింది. ప్రధాన కూడలి రాందాస్ చౌరస్తా వద్ద

మిగతా 3వ పేజీలో...

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

పది మంది మావోయిస్టుల మృతి **2**

మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు బాలకృష్ణ?

ఆయన స్వస్థలం భూపాలపల్లి జిల్లాలోని గణపురం

మృతుల సంఖ్యపై స్పష్టత ఇవ్వని పోలీసులు

మరింత మంది మరణించి ఉంటారని అనుమానం



ఎన్‌కౌంటర్ ప్రాంతంలో బాలకృష్ణ మృతదేహం(పోలీసులు ఇంకా నిర్ధారించలేదు)

కుప్పకూలిన ఆదిలాబాద్ కలెక్టరేట్ పైకప్పు

ఇటీవలి వర్షాలకు తడిసిన నిజాం కాలం నాటి భవనం

ఘటనా సమయంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంత్రి జూపల్లి సమీక్ష.. సురక్షితంగా బయటపడ్డ మంత్రి, అధికారులు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అది నిత్యం అధికార యంత్రాంగం బిజీబిజీగా గడిపే కలెక్టరేట్. నిజాం కాలం నాటి భవనం కావడంతో శిథిలావస్థకు చేరుకున్నది. దీనికి తోడు ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తడిసిన భవనంపై అంతస్తు (ఏట చాంబర్ నుంచి మూత్రశాలల వరకూ).. బాల్కనీ స్లాబ్ గురువారం సాయంత్రం

మిగతా 13వ పేజీలో...



కలెక్టరేట్‌లో కూలిన పైకప్పు



డొనాల్డ్ ట్రంప్‌తో చార్లీ కిర్క్ (ఫైల్)

ట్రంప్ సన్నిహితుడు చార్లీ కిర్క్ హత్య

యూటాలోని ఓ కాలేజీలో మాట్లాడుతుండగా కాల్పులు

తుపాకీ హింసపై ప్రశ్నకు జవాబిస్తుండగా ఘటన

అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రాజకీయ హత్యగా అభివర్ణించిన యూటా గవర్నర్

చార్లీ కిర్క్ గొప్ప వ్యక్తి: డొనాల్డ్ ట్రంప్ **2**

ఇండియా కూటమిలో క్రాస్ ఓటింగ్ చిచ్చు

ఆప్‌తోపాటు కొన్ని పార్టీల ఎంపీలు ఎన్డీయే అభ్యర్థికి ఓటు వేశారు

20 కోట్ల చొప్పున ఆఫర్: అభిషేక్ బెనర్జీ

మావైపు నుంచి జరగలేదు: తేజస్వీ యాదవ్

మహారాష్ట్రను బద్నాం చేసే కుట్ర: సుప్రియాసూలే

క్రాస్ ఓటింగ్‌పై దర్యాప్తు చేయాలి: మనీశ్ తివారీ

సోనియాతో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి భేటీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికల ఫలితాలు వెలువడి రెండురోజులు అయినప్పటికీ.. ఆ ఎన్నికల్లో ఇండియా కూటమికి చెందిన కొందరు ఎంపీలు క్రాస్ ఓటింగ్ చేశారన్న అనుమానాలు కూటమిలో చిచ్చు రేపుతున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీతో సహా కొన్ని పార్టీలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డాయని తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. ఆప్‌లో బీజేపీకి అనుకూలంగా

మిగతా 2వ పేజీలో...

ట్రంప్ సన్నిహితుడు చార్లీ కిర్క్ హత్య



ఓరెం, సెప్టెంబరు 11: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు చార్లీ కిర్క్(31) దారుణ హత్యకు గురయ్యారు. బుధవారం యూటా రాష్ట్రంలోని ఓ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతుండగా దుండగుడు ఆయనను కాల్చి చంపాడు. దీంతో కార్యక్రమానికి హాజరైన జనం భయంతో పరుగులు తీశారు. కిర్క్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ప్రాణం పోయినట్టు వైద్యులు తెలిపారు. ఒక అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు యూటా గవర్నర్ స్పెన్సర్ కాక్స్ ప్రకటించారు. రాష్ట్రానికి ఇదో చీకటి రోజని ఆయన పేర్కొన్నారు. దీనిని రాజకీయ హత్యగా అభివర్ణించారు. నిందితుడు నల్లటి దుస్తులు ధరించి, క్యాంపస్‌లోని దూరంగా ఉన్న ఓ భవనం పైకప్పు నుంచి కాల్పులు జరిపాడని అధికారులు తెలిపారు. కాగా, 'టర్నింగ్ పాయింట్ యూఎస్‌ఏ' అనే యువజన సంస్థకు కిర్క్ సహ-వ్యవస్థాపకుడు. ఆ సంఘం సీఈవో కూడా. కిర్క్ హత విషయాన్ని ట్రంప్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. అమెరికా యువత హృదయాలను కిర్క్ కంటే బాగా అర్థం చేసుకునేవారు లేరని ట్రూత్ సోషల్‌లో పెట్టిన పోస్టులో ట్రంప్ పేర్కొన్నారు. ఆయనో గొప్ప వ్యక్తి అని, లెజెండరీ కూడా అని కొనియాడారు. అలాగే, కిర్క్ హత్యను రిపబ్లికన్లు, డెమోక్రాట్లు తీవ్రంగా ఖండించారు.

తుపాకీ సంస్కృతిపై మాట్లాడుతుండగానే..

హత్యకు సంబంధించిన వీడియోలను యూటా వ్యాలీ యూనివర్సిటీకి చెందిన కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన తెల్లటి టెంట్‌లో కిర్క్ కూర్చొని మాట్లాడుతుండగా ఘటన జరిగింది. టెంట్‌లో ఆయన వెనుక 'ది అమెరికన్ కంబ్యాక్', 'ప్రూవ్ మీ రాంగ్' అని రాసిన నినాదాలు కనిపిస్తున్నాయి. తూటా శబ్దం వినపడగానే కిర్క్ మెడలో ఎడమవైపు నుంచి రక్తం బయటికి చిమ్ముతుండగా, కిర్క్ తన కుడి చేతిని పైకి చూపుతూ కనిపించారు. దీంతో కార్యక్రమంలో పాల్గొన్న జనం పరుగులు తీశారు. కిర్క్ స్థాపించిన 'టర్నింగ్ పాయింట్ యూఎస్‌ఏ' సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. తుపాకీ హింసపై ప్రేక్షకులు అడిగిన ప్రశ్నలకు కిర్క్ సమాధానాలు ఇస్తుండగానే ఆయనపై కాల్పులు జరగడం గమనార్హం. గతపదేళ్లలో ఎంతమంది ట్రాన్స్‌జెండర్ అమెరికన్లు మాస్ షూటర్లుగా ఉన్నా రో మీకు తెలుసా? అని ఒకరు ప్రశ్నించగా, 'చాలా మంది' అని కిర్క్ జవాబిచ్చారు. గత పదేళ్లలో అమెరికాలో ఎంతమంది మాస్ షూటర్లు ఉన్నారో మీకు తెలుసా? అని ప్రశ్నించగా, 'ముఠా హింసను లెక్కించాలా? వద్దా? అని కిర్క్ అడిగారు. ఇంతలోనే కాల్పుల ఘటన చోటుచేసుకుంది.

భారతీయులకు వ్యతిరేకంగా పోస్టు..

గతంలో భారతీయులకు వ్యతిరేకంగా కిర్క్ పెట్టిన పోస్టు ఇప్పుడు వైరల్‌గా మారింది. భారత్ నుంచి వచ్చేవారికి మరిన్ని వీసాలు అవసరం లేదని అప్పట్లో ఆయన వ్యాఖ్యానించారు. 'భారత్ నుంచి వచ్చే ప్రజలకు అమెరికా మరిన్ని వీసాలు మంజూరు చేయాల్సిన అవసరం లేదు. చట్టపరమైన వలసల కారణంగా అమెరికన్ వర్కర్ల స్థానంలో భారతీయులు చేరిపోయారు. ఇక చాలు. అమెరికా నిండిపోయింది. మన వాళ్లకు తొలి ప్రాధాన్యం ఇద్దాం' అని ఈనెల 2న 'ఎక్స్'లో కిర్క్ పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందం కొలిక్కి రావాలంటే భారత్‌కు మరిన్ని వీసాలు మంజూరు చేయాల్సి ఉంటుందని ఫ్యాక్స్ న్యూస్ వ్యాఖ్యాత పెట్టిన పోస్టుకు స్పందనగా కిర్క్ ఈ పోస్టు పెట్టారు.

లోకం తీరు



వార్తా పత్రికలకు ఆదరణ పెరిగింది

- ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ వెల్లడి
- గత ఏడాదితో పోలిస్తే 2.77% పెరిగిన అమ్మకాలు

ముంబై, సెప్టెంబరు 11: దేశంలో వార్తా దిన పత్రికలకు ఆదరణ పెరిగిందని ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్(ఏబీసీ) ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు నిర్వహించిన ఆడిటింగ్ వివరాల గణాంకాలను వెల్లడించింది. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో వార్తా దినపత్రికల అమ్మకాల్లో ఆరోగ్యకరమైన పురోగతి కనపడిందని తెలిపింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 29, 744, 148 కోట్ల కాపీల అమ్మకాలు జరిగాయని వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలానికి 28, 941, 876 కోట్ల కాపీల అమ్మకాలు జరిగాయి. గత ఏడాదితో పోల్చితే మొత్తం 2.77% అధికమని, 802, 272 కాపీలు అధికంగా అమ్ముడయ్యాయని ఏబీసీ తెలిపింది. ఈ పురోగతి వార్తా దినపత్రికలపై పాఠకులకున్న నమ్మకాన్ని తెలియజేస్తోందని అభిప్రాయపడింది. అంతేకాదు విశ్వసనీయ, ధ్రువీకరించిన, లోతైన సమాచారం కోసం పాఠకులు వార్తా దినపత్రికలను చదువుతున్నారని ఏబీసీ వెల్లడించింది. దినపత్రికలు శక్తిమంతమైన మాధ్యమంగా మారాయనడానికి సర్క్యులేషన్ పెరుగుదల నిదర్శనంగా నిలుస్తోందని ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ తెలిపింది.

నేడు ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ప్రమాణస్వీకారం చేయించనున్నారు. రాష్ట్రపతి భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి మొదలయ్యే ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సీపీ రాధాకృష్ణన్ గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ప్రకటించింది. ఉపరాష్ట్రపతిగా నూతన బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్రపతి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

'ఓట్ చోరీ' ఆరోపణల్లో విదేశీ హస్తం

- రాహుల్ డాక్యుమెంట్లు 'మేడిన్ ఇండియా' కాదు
- అన్నీ మయన్మార్ టైమ్ జోన్‌తో ఉన్నాయ్: బీజేపీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: ఎన్నికల్లో 'ఓట్ల చోరీ' జరిగిందంటున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ సంచలన ఆరోపణలు చేసింది. ఓట్ల చోరీ ఆరోపణలకు సంబంధించి ఆయన చూపుతున్న పత్రాలు భారత్‌లో కాకుండా విదేశాల్లో తయారయ్యాయని, ప్రతిపక్షాల ఆరోపణల్లో విదేశీ హస్తం ఉందని బీజేపీ నేత ప్రదీప్ భండారి అన్నారు. "రాహుల్ గాంధీ అంతర్జాతీయ 'ఓట్ల చోరీ టూల్‌కిట్ బహిర్గతమైంది" అని ఎక్స్‌లో పోస్టు చేశారు. రాహుల్ రిమోట్ కంట్రోల్‌ను నడుపుతున్న 'విదేశీ బాస్' ఎవరు? అని ప్రశ్నించారు. ఓట్ల చోరీ ఆరోపణలకు సంబంధించి రాహుల్ ఆగస్టు 7న తన అధికారిక వెబ్‌సైట్‌లో ఇంగ్లిష్, హిందీ, కన్నడ భాషల్లో అప్‌లోడ్ చేసిన పత్రాల మెటాడేటాను నిశితంగా పరిశీలించగా.. ఈ డాక్యుమెంట్లన్నీ మయన్మార్ టైమ్ జోన్‌తో (+6:30 MMT) ఉన్నట్లు వెల్లడైందన్నారు. సిస్టమ్ క్లాక్‌పై ఆధారపడే అడోబ్ ఇల్లస్ట్రేటర్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఈ ఫైళ్లను ఎక్స్‌పోర్టు చేశారని, వీపీఎన్ ఉపయోగించి దాన్ని మార్చలేరన్నారు. మూడు ఫైళ్ల సృష్టిలో సమయం అంతరాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. దీంతో రాహుల్ చూపిస్తున్న 'ఆధారాలు'.. భారత్‌లో తయారు కాలేదని స్పష్టమవుతోందని ప్రదీప్ భండారి పేర్కొన్నారు.

'హైడ్రోజన్ బాంబ్'తో అన్నీ స్పష్టం: రాహుల్

మరోవైపు తాను చేసిన 'హైడ్రోజన్ బాంబ్' వ్యాఖ్యలపై బీజేపీ చేస్తున్న విమర్శలకు రాహుల్ గాంధీ గురువారం స్పందించారు. "ఆందోళన చెందుతున్న బీజేపీ నేతలకు చెబుతున్నా.. ఆందోళన పడొద్దు. 'హైడ్రోజన్ బాంబ్' వచ్చినప్పుడు, ప్రతీది స్పష్టంగా వెల్లడవుతుంది" అని అన్నారు. అయితే ఎక్కడ విడుదల చేస్తామనేది ప్రస్తుతానికి రహస్యమన్నారు. మహారాష్ట్ర, హరియాణా, కర్ణాటకల్లో ఎన్నికలను చోరీచేశారని, బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గానికి సంబంధించి అన్ని రకాలుగా ఆధారాలు ఇచ్చామని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో మరో సంచలన, కీలక ఆధారాలను బయటపెడతామని ఆయన పేర్కొన్నారు.

చెప్పకుండా విదేశాలకు వెళ్లిపోతున్నారు!

- భద్రతా ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్న రాహుల్
- కాంగ్రెస్ చీఫ్ ఖర్గేకు సీఆర్‌పీఎఫ్ లేఖ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల సందర్భంగా భద్రతా ప్రొటోకాల్‌ను పలుమార్లు ఉల్లంఘించారని సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) ఆరోపించింది. ఆయన చేసే విదేశీ ప్రయాణాలపై తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వడం లేదని తెలిపింది. ఈ మేరకు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో పాటు రాహుల్‌కు వేర్వేరుగా లేఖలు రాసింది. రాహుల్ గతంలో ఇటలీ, వియత్నాం, ఖతార్, లండన్, మలేసియా తదితర దేశాల్లో పర్యటించిన వివరాలను అందులో ప్రస్తావించింది. భద్రతా కారణాల రీత్యా ఇది తీవ్ర ఆందోళనకరమైన అంశమని పేర్కొంది. కాగా, భద్రతా ప్రొటోకాల్‌ను రాహుల్ గాంధీ ఉల్లంఘించారంటూ సీఆర్‌పీఎఫ్ లేఖ రాయడంపై కాంగ్రెస్ గురువారం స్పందించింది. ఓట్ల చోరీ వ్యవహారంపై త్వరలో హైడ్రోజన్ బాంబు పేలుస్తామని రాహుల్ ప్రకటించిన రోజుల వ్యవధిలోనే ఈ లేఖ రాయడం ఆయన్ను బెదిరించడానికి తెర వెనుక నుంచి చేస్తున్న ప్రయత్నం కాదా అని పార్టీ నేత పవన్ ఖేరా ప్రశ్నించారు.

4.2 ఎకరాలు.. 3,472 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ జరిగినట్టు అధికార వర్గాలు తెలిపాయి. నారిమన్ పాయింట్‌లో ఉన్న మార్కెట్ రేటు కన్నా 50% ఎక్కువ ధర పలికినట్టు రియల్ ఎస్టేట్ రంగ నిపుణులు తెలిపారు. ఇందులో 16 లక్షల చదరపు అడుగుల స్థలంలో భవనాలు నిర్మించనున్నారు. 1.13 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని పునరావాసం కోసం కేటాయించారు. నారిమన్ పాయింట్లో లభ్యమయ్యే చిట్టచివరి అతి పెద్ద ప్లాటు ఇదే కావడం గమనార్హం. ఈ స్థలాన్ని దీర్ఘకాలిక లీజుకు ఇస్తామంటూ గత ఏడాది అక్టోబరు మూడున మెట్రోరైల్ కార్పొరేషన్ టెండరు పిలిచింది. దీని ద్వారా రూ.5,173 కోట్లు సమకూర్చుకోవాలని ఆశించింది. బ్లాక్‌స్టోన్ గ్రూప్, ఒబెరాయ్ రియాల్టీ, ఆర్ఎంజడ్ గ్రూపు, టాటా గ్రూపులు ఆసక్తి చూపాయి. నైట్ ఫ్రాంక్ ఇండియా సలహాదారుగా వ్యవహరించింది. అయితే స్థలం కొనుగోలు చేయడానికి రిజర్వు బ్యాంకు ముందుకు రావడంతో ఈ ఏడాది జనవరి 18న టెండరు నోటీసును ఉపసంహరించుకొంది. రిజర్వు బ్యాంకు ఇస్తామన్న సొమ్ము కూడా అంచనాలకు అనుగుణంగా ఉండడంతో సమ్మతి తెలిపింది. ఇది రెండు ప్రభుత్వ సంస్థల మధ్య జరిగే లావాదేవీ కావడంతో నిబంధనల పరంగా ఇబ్బందులు ఉండబోవని అధికార వర్గాలు తెలిపాయి.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

10 మంది మావోయిస్టుల మృతి.. మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు బాలకృష్ణ

- ఆయన స్వస్థలం భూపాలపల్లి జిల్లాలోని గణపురం
- మృతుల సంఖ్యపై స్పష్టత ఇవ్వని పోలీసులు
- మరికొందరు మరణించి ఉంటారని అనుమానం



మోడెం బాలకృష్ణ(ఫైల్)

చర్ల/హైదరాబాద్/చింతూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మారోసారి కాల్పుల మోతలతో దద్దరిల్లింది. గరియాబంద్ జిల్లా అడవుల్లో గురువారం మధ్యాహ్నం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఒడిసా రాష్ట్ర కార్యదర్శి, సెంట్రల్ రీజనల్ బ్యూరో కమిటీ సభ్యుడు మోడెం బాలకృష్ణ (58) అలియాస్ భాస్కర్ అలియాస్ మనోజ్‌తో పాటు ఒడిసా రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రమోద్ అలియాస్ పాండు, మరికొందరు కీలక నేతలు మృతి చెందినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. గరియాబంద్ జిల్లా మెయిన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలుడిగ్గి కొండల్లో మవోయిస్టులు ఉన్నట్లు అక్కడి పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ జిల్లాకు చెందిన ఈ30, ఎస్టీఎఫ్ కోబ్రా బలగాలు కూబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో బలగాలు, మావోయిస్టులకు మధ్య 3 గంటల పాటు ఎదురు కాల్పులు జరిగాయి. అనంతరం ఘటనా స్థలంలో 10 మంది మావోయిస్టుల మృతదేహాలు, ఏకే 47, ఆటోమేటిక్ తుపాకులు లభించినట్టు తెలుస్తోంది. చనిపోయిన వారిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, సెంట్రల్ రీజనల్ బ్యూరో సభ్యుడు మోడెం బాలకృష్ణ సైతం ఉన్నట్లు గుర్తించారు. ఒడిసా రాష్ట్ర కార్యదర్శిగానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్న బాలకృష్ణ స్వస్థలం తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా గణపురం. ఆయనపై కోటి రూపాయల రివార్డు ఉందని పోలీసు అధికారులు తెలిపారు. కంధనూల్, కలహండీ, బౌధ్, నయాగఢ్ డివిజన్లలో మంచి పట్టున్న బాలకృష్ణ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని సమాచారం. అయితే, ఇప్పటి వరకు ఎన్‌కౌంటర్‌లో ఎంత మంది చనిపోయారనేది పోలీసులు అధికారికంగా వెల్లడించలేదు. ఎదురుకాల్పులు జరిగిన ప్రాంతంలో పదుల సంఖ్యలో మావోయిస్టులు ఉన్నారని, కాల్పుల్లో చాలా మంది మృతి చెంది ఉంటారని ఓ జవాను అనధికారికంగా తెలిపారు. గత ఏడాది ఇదే గరియాబంద్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 26 మంది మావోయిస్టులను కేంద్ర బలగాలు అరెస్టు చేశాయి. అలాగే నారాయణపూర్ జిల్లా పోలీసుల ఎదుట 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు.

మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు గాయాలు

- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో ఘటన
- వీరిలో ఒకరిది ములుగు జిల్లా తాడ్వాయి మండలం



మునేష్ (ఫైల్)

చర్ల/తాడ్వాయి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు అమర్చిన ఐఈడీ మందుపాతర పేలి సీఆర్‌పీఎఫ్ 195 బెటాలియన్‌కు చెందిన ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. బార్సూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రావతి నది సమీపంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు 'ఏరియా డామినేషన్' చేస్తుండగా.. మావోయిస్టులు అమర్చిన భారీ మందుపాతరపై ఓ జవాను కాలు పెట్టారు. అది వెంటనే పేలిపోవడంతో జవాన్లు దివాన్ సింగ్, ఆలం మునేష్ తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి వారి కాళ్లు తెగిపడినట్లు తెలిసింది. వెంటనే వీరిని మెరుగైన వైద్యం కోసం దంతెవాడకు, అక్కడ నుంచి రాయ్‌పూర్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆలం మునేష్ స్వస్థలం ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని భూపతిపురం. మునేష్ గాయపడిన విషయం తెలియడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

డబ్బులిచ్చి నాపై దుష్ప్రచారం

- ఆ ప్రచారం వెనుక పెట్రోల్ లాబీ
- రాజకీయంగా లక్ష్యం చేసుకున్నారు
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పెట్రోల్‌లో 20% ఇథనాల్ (ఈ20)ను కలపాలని కేంద్రం తీసుకున్న నిర్ణయంపై డబ్బులిచ్చి సోషల్ మీడియాలో తనకు వ్యతిరేకంగా ప్రచారం చేయించారని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. తనను రాజకీయంగా లక్ష్యం చేసుకుని ఆ ప్రచారం జరిగిందన్నారు. ఇథనాల్‌తో కూడిన పెట్రోల్ వల్ల మైలేజీ తగ్గుతుందన్నది అవాస్తవమని తెలిపారు. గురువారం ఢిల్లీలో జరిగిన భారత ఆటోమొబైల్ తయారీదారుల సొసైటీ 65వ వార్షిక సమావేశంలో గడ్కరీ మాట్లాడారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం వెనుక పెట్రోల్ లాబీ, ఇతర శక్తులు ఉన్నాయని ఆరోపించారు. ప్రతి చోటా లాబీలు, ప్రయోజనాలు ఉంటాయన్నారు. అలాగే పెట్రోల్ లాబీ చాలా బలమైనదని, అందులో ధనవంతులు ఉన్నారని పేర్కొన్నారు. పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలపడానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిందని తెలిపారు. ఇథనాల్ మిశ్రమం వల్ల ఎటువంటి సమస్యలు రావని అన్ని పరీక్షా సంస్థలు నిర్ధారించాయన్నారు. భారత వాహన పరిశోధన సంఘం (ఏఆర్ఏఐ) ఈ20 వినియోగంపై స్పష్టతనిచ్చిందని చెప్పారు. భారత్ ఏటా రూ.22 లక్షల కోట్ల విలువైన ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోందని, ఆర్థికవ్యవస్థ, పర్యావరణానికి భారంగా మారిన శిలాజ ఇంధన వినియోగాన్ని తగ్గించవలసిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు సరి కాదు

- ఆర్టికల్ 200 ప్రకారం నిర్ణయం తీసుకునే సౌలభ్యం వారికే కల్పించాలి
- 50 ఏళ్లలో 90 శాతం బిల్లులకు నెలరోజుల్లోనే గవర్నర్ల ఆమోదం
- సుప్రీంలో కేంద్ర ప్రభుత్వ వాదనలు.. తీర్పు వాయిదా వేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన బిల్లులను ఆమోదించడానికి రాష్ట్రపతి, గవర్నర్లకు కాలపరిమితి విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా అనే అంశంపై అన్ని పక్షాల వాదనలూ విన్న సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పును గురువారం వాయిదా వేసింది. ఈ అంశంపై న్యాయసలహా కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టును 14 ప్రశ్నలు అడిగిన (ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్) సంగతి తెలిసిందే. దీనిపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌ల రాజ్యాంగ ధర్మాసనం ఆగస్టు 19న విచారణ చేపట్టింది. దశలవారీగా 10రోజులపాటు ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వాల వాదనలను విన్నది. అటార్నీ జనరల్ వెంకట రమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేంద్రం తరపున గురువారం తుదివాదనలు వినిపించారు. రాష్ట్ర మంత్రివర్గం పంపిన బిల్లులపై నిర్ణయం తీసుకోకుండా నిరవధికంగా పెండింగ్‌లో ఉంచడం సరైనది కాకపోవచ్చునని.. అయితే నిర్దిష్ట కాలంలో బిల్లులను ఆమోదించాలంటూ కాలపరిమితి మాత్రం విధించకూడదని అభిప్రాయపడ్డారు. ఆర్టికల్ 200ప్రకారం నిర్ణయం తీసుకునే సౌలభ్యాన్ని గవర్నర్‌కు కల్పించాలని తెలిపారు. గత యాభై ఏళ్లలో 90% బిల్లులను గవర్నర్లు కేవలం నెలరోజుల్లోపే ఆమోదించారని మరోసారి గుర్తు చేశారు.

మినహాయింపులు పొందిన రిజర్వుడు కేటగిరీ అభ్యర్థులు జనరల్ కోటాకు అర్హులు కాదు

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: వయసు, విద్య తదితర అంశాల్లో మినహాయింపు పొందిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు జనరల్ కోటా ఉద్యోగాలకు అర్హులు కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎక్కువ మార్కులు వచ్చాయన్న కారణంతో వారికి జనరల్ కోటా ఉద్యోగాలు ఇవ్వలేరని తెలిపింది. రిజర్వు కోటాలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసి, వయసు వంటి అర్హతల్లో మినహాయింపులు పొందినవారు అనంతరం తమకు జనరల్ కోటా కింద ఉద్యోగాలు ఇవ్వాలని అడగలేరని తెలిపింది. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) ఉద్యోగాలకు రిజర్వుడు కోటా కింద దరఖాస్తు చేసిన వారికి జనరల్ కోటాలో పోస్టులు ఇవ్వాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చీ ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది.

భారత్‌లోకి నేపాలీ ఖైదీలు

- సరిహద్దుల్లోనే అడ్డుకున్న బలగాలు
- రెండ్రోజుల్లో 60మంది అదుపులోకి..



కఠ్మాండూలో పారిపోతున్న ఖైదీని పట్టుకున్న పోలీసులు

కఠ్మాండూ, సెప్టెంబరు 11: నేపాల్ ఆందోళనలతో తలెత్తిన గందరగోళ పరిస్థితులను ఉపయోగించుకుని జైళ్ల నుంచి పారిపోతున్న ఖైదీల కట్టడి పెద్ద తలనొప్పిగా మారింది. భారత్ భూభాగంలోకి రావడానికి ప్రయత్నించిన 60మందిని సరిహద్దు భద్రతా బలగాలు (ఎస్ఎస్‌బీ) అదుపులోకి తీసుకున్నాయి. అంతర్జాతీయ సరిహద్దుల వెంట యూపీ, బిహార్, పశ్చిమ బెంగాల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పట్టుబడిన వీరిలో చాలామంది నేపాలీ ఖైదీలు ఉన్నట్టు గుర్తించాయి. నేపాల్ ఆందోళనల నేపథ్యంలో అంతర్జాతీయ సరిహద్దు వద్ద భారతీయ బలగాలు పూర్తిగా అప్రమత్తం అయ్యాయి. బిహార్, యూపీ, ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్, సిక్కిం పరిధిలోని భారతీయ భూభాగాలతో నేపాల్ సరిహద్దును పంచుకుంటోంది. కాగా, నేపాల్‌లోని పాతికపైగా జైళ్లనుంచి 15వేలమంది ఖైదీలు ఇప్పటివరకు పరారయ్యారు. వీరిలో 200మందిని పట్టుకుని తిరిగి జైళ్లకు తరలించారు. మదేశ్ ప్రావిన్స్‌లోని రామేఛాప్ జిల్లా జైలులో సైన్యం జరిపిన కాల్పుల్లో గురువారం ముగ్గురు ఖైదీలు మరణించారు. మరో 13మంది గాయపడ్డారు. గ్యాస్ సిలిండర్‌ను మండించి జైలు గేట్లు బద్దలుకొట్టడానికి ఖైదీలు ప్రయత్నించారు. వారిపై సైన్యం కాల్పులు జరిపి పరిస్థితిని అదుపులోకి తెచ్చింది. ఈ క్రమంలోనే ముగ్గురు మరణించారు.

నేపాల్ తదుపరి నేతపై గందరగోళం!

'జెన్ జెడ్' యువత ఆందోళనలతో అతాలకుతలమైన నేపాల్‌లో అదే గందరగోళం కొనసాగుతోంది. తాత్కాలిక ప్రభుత్వాధినేతగా ఎవరు ఉండాలన్నది ఎటూ తేలడం లేదు. ఆ దేశ సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కర్కిని ఆందోళనకారులు ఎంపిక చేసినా.. ఆందోళనకారుల్లోని కొన్ని గ్రూపులు అందుకు సానుకూలంగా లేనట్టు తెలిసింది. ఈ క్రమంలో ఆందోళనకారులతో నేపాల్ అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్, ఆర్మీ చీఫ్ అశోక్ రాజ్ సిగ్డెల్ చర్చలు జరుపుతున్నారు. ఆర్మీ ప్రధాన కార్యాలయం 'భద్రకాళి'లో ఈ చర్చలు జరుగుతున్నాయని.. సుశీల కర్కితోపాటు కఠ్మాండూ మేయర్ బాలేంద్ర షా, నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ మాజీ సీఈవో కుల్మన్ ఘిసింగ్, ధరణ్ పట్టణ మేయర్ హర్కా సంపంగ్ పేర్లను పరిశీలిస్తున్నారని ఆర్మీ వర్గాలు తెలిపాయి. తాత్కాలిక ప్రధానిగా ఎన్నుకునే వ్యక్తి నియమిత గడువులోగా దేశంలో ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. కాగా, గురువారం కొందరు జెన్ జెడ్ గ్రూపు ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. తమది పూర్తిగా పౌర ఉద్యమమని, ఇందులో జోక్యం చేసుకుని ప్రయోజనం పొందేందుకు రాజకీయ పార్టీలు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. ప్రస్తుత పార్లమెంటును రద్దు చేయాలని, రాజ్యాంగాన్ని మార్చాల్సిందేనని స్పష్టం చేశారు. కాగా, ఆందోళనల్లో మృతుల సంఖ్య 34కు చేరిందని.. 2,287 మంది గాయపడ్డారని నేపాల్ ఆరోగ్యశాఖ ప్రకటించింది.

కర్ఫ్యూ ఎత్తివేత..

నేపాల్‌లో సైన్యం విధించిన కర్ఫ్యూను గురువారం సాయంత్రం ఎత్తివేశారు. దీనితో జనం వివిధ అవసరాల కోసం బయటికి రావడం కనిపించింది. దుకాణాలు తెరుచుకున్నాయి. ఇక ఆందోళనకారులు విధ్వంసంలో దెబ్బతిన్న ప్రాంతాలను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా, అంతా ఏకమై నిరసనలు తెలిపిన జెన్ జెడ్ ఆందోళనకారుల్లో విభేదాలు నెలకొన్నట్టు సమాచారం. తాత్కాలిక ప్రభుత్వాధినేత, మంత్రివర్గంలో ఎవరెవరు ఉం డాలనే దానిపై గందరగోళం నెలకొన్నట్టు తెలిసింది. ఆర్మీ చీఫ్, అధ్యక్షుడు, 'జెన్ జెడ్' గ్రూపుల ప్రతినిధులు ఆర్మీ ప్రధాన కార్యాలయంలో చర్చలు జరుపుతున్న సమయంలోనే.. బయట పలు గ్రూపుల ప్రతినిధులు గొడవపడ్డారు.

'నేపాల్'పై ఎవరూ మాట్లాడొద్దు

- శ్రేణులకు బీజేపీ గట్టి ఆదేశాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: నేపాల్ పరిణామాలపై ఎవరూ మాట్లాడొద్దు అని, ఏదైనా చెప్పాలనుకుంటే ముందుగా అధ్యక్షుడు జేపీ నడ్డా అనుమతి పొందాలని తన శ్రేణులకు బీజేపీ అధిష్ఠానం గట్టి ఆదేశాలు జారీచేసింది. బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌధురీ నేపాల్‌పై చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీకి తలనొప్పిగా మారడంతో తాజా నిర్ణయం తీసుకున్నారు. "నేపాల్ పరిణామాలకు కాంగ్రెస్సే కారణం. ఈ దేశాలను విడగొట్టి కాంగ్రెస్ పెద్ద తప్పు చేసింది. అదేగనుక భారత్‌లో భాగంగా ఉన్నట్టయితే నేపాల్ శాంతి, సంతోషాలతో నిండి ఉండేది" అంటూ సామ్రాట్ చౌధురీ వ్యాఖ్యానించారు. ఆయన ప్రకటన రాజకీయ దుమారం రేపింది. దీంతో కేంద్ర మంత్రులు, ఎంపీలు, నాయకులు, కార్యనిర్వాహక వర్గ సభ్యులు, అధికార ప్రతినిధులు, సోషల్ మీడియా నిర్వాహకులు సహా ఎవరూ నేపాల్‌పై నోరెత్తవద్దని అధిష్ఠానం తేల్చిచెప్పినట్టు బీజేపీ వర్గాలను ఉటంకిస్తూ ఓ ఆన్‌లైన్ మీడియా కథనం ప్రసారం చేసింది. కాగా, నేపాల్ పరిణామాలను లోతుగా పరిశీలిస్తున్నట్టు కేంద్రప్రభుత్వం తెలిపింది. నేపాల్ ఆందోళనల్లో యువకుల మరణాలు బాధించాయని పేర్కొంది.

ఇండియా కూటమిలో క్రాస్ ఓటింగ్ చిచ్చు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న ఒక మహిళా ఎంపీతోపాటు కనీసం నలుగురు ఎన్డీఏ అభ్యర్థికి ఓటు వేశారని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల ఓట్లను కొనుగోలు చేసేందుకు ఒక్కొక్కరికీ రూ.20 కోట్లు ఇవ్వజూపారన్నారు. తమ పార్టీ మీద వస్తున్న ఆరోపణల మీద ఆప్ ఎంపీ సౌరభ్ భరద్వాజ్ స్పందిస్తూ.. ఏ ఎంపీ ఎవరికి ఓటు వేశారన్న విషయం ఎన్నికల సంఘానికే తెలుస్తుందని, ఎవరు క్రాస్ ఓటింగ్ పాల్పడ్డారో కమిషనే బయట పెట్టాలన్నారు. ఆప్‌తోపాటు శివసేన, ఆర్జేడీకి చెందిన కొందరు ఎంపీలపైనా ఇండియా కూటమిలో అనుమానాలు నెలకొన్నట్టు తెలుస్తోంది. క్రాస్ ఓటింగ్ తీవ్రమైన అంశమని, ఎవరు క్రాస్ ఓటింగ్ చేశారో తేల్చేందుకు దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ డిమాండ్ చేయటం గమనార్హం. తమవైపు నుంచి ఎలాంటి క్రాస్ ఓటింగ్ జరగలేదని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రకటించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలో 15 ఓట్లు చెల్లకపోవడంపై శివసేన ఎంపీ అర్వింద్ సావంత్ విస్మయం వ్యక్తం చేశారు. స్వయంగా ఎంపీలు చెల్లని ఓట్లు వేయటం ఏమిటని, వాళ్లు అసలు చదువుకున్న వారేనా? అని ఆయన ప్రశ్నించారు. క్రాస్‌ఓటింగ్ వివాదంపై ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే స్పందిస్తూ.. అనవసరంగా తమ రాష్ట్రాన్ని అప్రదిష్టపాలు చేస్తున్నారన్నారు. కాగా, విపక్ష కూటమిలోని ఈ లుకలుకలపై అధికార ఎన్డీఏ వ్యంగ్యబాణాలు విసురుతోంది. ఇండియా కూటమికి చెందిన కొందరు ఎంపీలు తమ అంతరాత్మ ప్రబోధానుసారం సీపీ రాధాకృష్ణన్‌కు అనుకూలంగా ఓటు వేశారని, వారికి కృతజ్ఞతలు అని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

సోనియాతో జస్టిస్ సుదర్శన్ రెడ్డి భేటీ

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీతో ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి భేటీ అయ్యారు. గురువారం ఢిల్లీలో సోనియాతో సమావేశం అనంతరం హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో నెలకొన్న ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, సామాజిక ఉద్రిక్తతలపై సోనియాగాంధీతో చర్చించినట్టు తెలిపారు. ఇండియా కూటమికి చెందిన మొత్తం ఓట్లు ఎందుకు పడలేదని ఆమె మథనపడ్డారన్నారు. క్రాస్ ఓటింగ్‌పై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని, అయితే, 15 మంది ఎంపీల ఓట్లు చెల్లకపోవడం ఆశ్చర్యకరమన్నారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి అభినందన లు తెలిపానని తెలిపారు. ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరి, పదవుల కోసం పాకులాడే అవసరం తనకు లేదన్నారు. లోహియా, కాళోజీ, గాంధీ, అంబేడ్కర్, నెహ్రూ, మార్టిన్ లూథర్ కింగ్ వంటి ఎంతో మంది మహనీయులు స్ఫూర్తిగా, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలకు అనుగుణంగా నడుచుకుంటానన్నారు.



ఎల్బీనగర్ నుంచి మన్సురాబాద్ ప్రధానరహదారిలో ప్రవహిస్తున్న వరదనీరు



మెదక్ పట్టణంలో నీట మునిగిన షాపింగ్ కాంప్లెక్స్

ముంచెత్తిన వాన!

వర్షాలతో జాగ్రత్తగా ఉండాలి
సీఎం రేవంత్

రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పాత ఇళ్లలో ఉండే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. హైదరాబాద్‌లో హైడ్రా, జీహెచ్ఎంసీ, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, ట్రాఫిక్, పోలీసు శాఖల సిబ్బంది సమన్వయంతో ముందుకెళ్లాలని, నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వాగులపై ఉన్న లోతట్టు కాజ్‌వేలు, కల్వర్టులపై నుంచి ప్రవహించే వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. చెరువులు, కుంటలకు గండి పడే ప్రమాదం ఉన్నచోట నీటిపారుదల శాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

(మొదటి పేజీ తరువాయి)

కార్లు, బస్సులు, బైక్‌లు నీట మునిగాయి. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ మహిళా కళాశాల ప్రాంగణం పూర్తిగా జలమయమవడంతో కలెక్టర్ రాహుల్‌రాజ్ సిబ్బందితో చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ భారీ వర్షాలు కురిశాయి. హనుమకొండ, వరంగల్ బస్‌స్టేషన్లలో వరద పెద్ద ఎత్తున నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. హనుమకొండలోని పలు కాలనీల్లో భారీగా వరద ప్రవహించి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ములుగు జిల్లాలోని జేడీ మల్లంపల్లి, తాడ్వాయి, వాజేడు, ఏటూరునాగారం, వెంకటాపురం మండలాల్లో వానలకు అక్కడక్కడ పంటపొలాలు నీట మునిగాయి. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలో భారీ వర్షం కురిసింది. జహీరాబాద్ రోడ్డులో బండపల్లి-తట్టేపల్లి మధ్య వాగు పొంగి ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ధారూరు బస్‌స్టేషన్ ప్రాంగణమంతా జలమయంగా మారింది. తాండూరు మండలం సంగెంకలాన్ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న దిడ్డి వాగులో స్థానికుడు బొక్తంపల్లి మొగులప్ప(38) గల్లంతయ్యాడు. ఆదిలాబాద్‌లో పలు కాలనీలు నీటమునిగి ఇళ్లలోకి వరద నీరు చేరింది. తర్నం వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాకలో భారీ వర్షానికి ఆలేరు-సిద్దిపేటకు వెళ్లే మార్గంలో పెద్దవాగు ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. ఆలేరులో పలు కాలనీలు జలమయమయ్యాయి. కుమ్మరివాడలోని 50 ఇళ్లలోకి నీరు చేరి వస్తువులు తడిసిపోయాయి. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నీరు చేరిన ఇళ్లను



మెదక్‌లో ఎలక్ట్రికల్ దుకాణంలోకి వరద నీరు

పరిశీలించి స్థానికులతో మాట్లాడి సహాయక చర్యలపై అధికారులతో మాట్లాడారు. భువనగిరి మండలం తుక్కాపూర్, అనంతారం గ్రామాల్లో పిడుగుపాటుకు రెండు గేదెలు మృత్యువాతపడ్డాయి. యాదగిరిగుట్టలో వర్షానికి రహదారులు, బస్టాండ్ జలమయమయ్యాయి. మోటకొండూరు ఊర చెరువు అలుగుపోస్తుండటంతో పత్తి చేలలో నీరు నిలవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లాలో మోస్తరు వర్షం కురవగా.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనూ విస్తారంగా వానలు పడ్డాయి.

హయత్‌నగర్‌లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్..

రంగారెడ్డి జిల్లా యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. హయత్‌నగర్‌లో ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. హయత్‌నగర్ నుంచి విజయవాడ జాతీయ రహదారిపై వరద నీరు నిలిచి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించి 2 గంటలకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హయత్‌నగర్ నుంచి పెద్ద అంబర్‌పేట వరకు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. ఇటు రామోజీఫిల్మ్ సిటిని కూడా వరద ముంచెత్తింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి ఫిల్మ్‌సిటీ లోపలున్న లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. ఇటు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లోనూ లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



భువనగిరి జిల్లా ఆలేరులోని కుమ్మరివాడలోని ఓ ఇంటిలోకి నీరు చేరటంతో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



వరంగల్ చౌరస్తా నుంచి అండర్ బ్రిడ్జి వరకు భారీగా రోడ్ల మీదికి చేరిన వర్షం నీరు

వీడియోకాల్‌లో ప్రియురాలితో వాగ్వాదం...
గొంతుకోసుకుని ప్రేమికుడి ఆత్మహత్య

చెన్నై, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రియురాలితో వీడియోకాల్ మాట్లాడుతుండగా జరిగిన వాగ్వాదం కారణంగా గొంతుకోసుకుని, మిద్దెపై నుంచి దూకి ప్రియుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెన్నైలో జరిగిన ఈఘటనలో మృతిచెందిన యువకుడు ఏపీలోని విశాఖ వాసికాగా, ప్రియురాలు హైదరాబాద్ వాసి. విశాఖపట్నానికి చెందిన నవీన్ (20) అక్కడే ప్రైవేటు కంపెనీలో పనిచేస్తుండగా, అతడి స్నేహితులు విఘ్నేష్, హరి చెన్నైలో చదువుకుంటూ స్థానిక కోయంబేడులో ఒక అపార్టుమెంట్‌లో ఉంటున్నారు. ఈ నెల 8న తన తల్లి, స్నేహితురాలుతో కలిసి తిరువణ్ణామలై ఆలయ దర్శనం కోసం నవీన్ చెన్నైకు వచ్చి, స్వామి దర్శనం పూర్తి చేసుకుని బుధవారం కోయంబేడులోని స్నేహితుల అపార్ట్‌మెంట్‌కు వెళ్లాడు. అక్కడే రాత్రి బస చేశాడు. గురువారం వేకువజామున 3.45 గంటల సమయంలో నవీన్ ఒంటరిగా కూర్చొని ఉండటాన్ని విఘ్నేష్ గమనించి ప్రశ్నించగా ఏమీ లేదని చెప్పి, కొంత సమయం తర్వాత మిద్దెపైకి వెళ్లాడు. తర్వాత విఘ్నేష్‌కు ఫోన్ చేసి 'నాకు ఈ ప్రపంచంలో జీవించడానికి ఇష్టంలేదు. నా కుటుంబాన్ని నీవే చూసుకోవాలి' అని చెప్పి ఫోన్ కట్ చేశాడు. దీంతో ఆందోళన చెందిన విఘ్నేష్ వెంటనే మిద్దెపైకి వెళ్లి చూడగా, కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నాడు. పోలీసుల విచారణలో...హైదరాబాద్‌కు చెందిన ఒక యువతిని నవీన్ ప్రేమిస్తున్నాడని, వీడియో కాల్ చేసి మాట్లాడుతుండగా ఏదో విషయమై తీవ్ర స్థాయిలో గొడవపడ్డారని తేలింది. ఆగ్రహించిన నవీన్ వీడియోకాల్ మాట్లాడుతూనే గొంతుకోసుకున్నాడని, అనంతరం స్నేహితునికి ఫోన్ చేసి మిద్దెపై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని వెల్లడైంది.

కేసీఆర్ కుటుంబానికి లైడిటెక్టర్ పరీక్షలు చేయాలి

» ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఎ. ఫహీం డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హరీశ్‌రావు, సంతోష్‌రావు సహా కేసీఆర్ కుటుంబ సభ్యులందరికి లై డిటెక్టర్ పరీక్షలు నిర్వహించాలని తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఎ. ఫహీం కోరారు. అప్పుడే పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన కుంభకోణాలన్నీ బయటకొస్తాయని చెప్పారు. సవాళ్లు విసరడానికి బదులు హరీశ్‌రావు, సంతోష్‌రావులపై కవిత చేసిన అవినీతి ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు.

పాక్ ఉగ్రవాద ముఠా గుట్టు రట్టు

తెలంగాణ సహా వేర్వేరు రాష్ట్రాల్లో ఐదుగురి అరెస్టు.. ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం

న్యూఢిల్లీ, నిజామాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారతదేశంలో ఖిలాఫత్(ఇస్లామిక్ రాజ్యం) ఏర్పాటే లక్ష్యంగా పన్నాగం పన్నుతున్న ఓ ఉగ్రవాద ముఠా గుట్టును ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు రట్టు చేశారు. తెలంగాణ సహా దేశంలోని వేర్వేరు రాష్ట్రాల్లో దాడులు చేసి పాకిస్థాన్‌తో సంబంధాలు కలిగిన ఆ ముఠాకు చెందిన ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాల తయారీకి వాడే పరికరాలు, రసాయనాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో ఝార్ఖండ్‌కు చెందిన అషర్ దానిష్(23), తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన మొహమ్మద్ హుజైఫ్ యమన్(20), ముంబైకి చెందిన అఫ్తాబ్ ఖురేషి(25) సుఫియాన్ అబూబకర్ ఖాన్(20), మధ్యప్రదేశ్‌కు చెందిన కమ్రాన్ ఖురేషి(26) ఉన్నారని ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు గురువారం ప్రకటించారు. ఈ కేసులో తొలుత ఢిల్లీ రైల్వేస్టేషన్ సమీపంలో రెండు సెమీ ఆటోమెటిక్ పిస్టళ్లతో అఫ్తాబ్ ఖురేషి, సుఫియాన్ ఖాన్ సెప్టెంబరు 9న అరెస్టయ్యారు.విచారణ అనంతరం సెప్టెంబరు 10న రాంచీ, థానే, బెంగళూరు, నిజామాబాద్, రాయ్‌ఘడ్‌లో దాడులు చేసి మిగిలిన వారిని అరెస్టు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసుల కథనం ప్రకారం.. ఝార్ఖండ్‌కు చెందిన అషర్ దానిష్ ఈ ముఠాకు మాస్టర్‌మైండ్. నిందితులంతా



నిందితులతో ఢిల్లీ పోలీసులు

గజ్వా ఈ హింద్ అనే ఇస్లామిక్ విధానంలో జిహాద్ ద్వారా భారత్‌ను జయించేందుకు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు దేశంలో అనువైన చోటుకోసం గాలిస్తున్నారు. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద హ్యాండ్లర్లు సామాజిక మాధ్యమాల్లో ఎన్‌క్రిప్టెడ్ సందేశాల ద్వారా నిందితులతో సంప్రదింపులు జరిపేవారు. ఆయుధాలు, పేలుడు పదార్థాల తయారీకి కావాల్సిన రసాయనాల సేకరణపై సూచనలిచ్చేవారు. ఆయుధాల తయారీ, ఉగ్రవాదం వ్యాప్తికి దేశంలో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా నిందితులు పని చేస్తున్నారు. కాగా, ఈ ముఠాకు మాస్టర్‌మైండ్‌గా పేర్కొన్న దానిష్ పోస్టు గ్రాడ్యుయేట్. అతని తండ్రి న్యాయవాది కాగా సామాజిక మాధ్యమాల ద్వారా ఉగ్రవాదం వైపు ఆకర్షితుడైన దానిష్.. సామాజిక మాధ్యమాల ద్వారా ఇతర నిందితులను ఆకర్షించాడు. తనని తాను కంపెనీ సీఈవో, ప్రొఫెసర్, ఎన్జీవో నిర్వాహకుడు అని పేర్కొంటూ సోషల్ మీడియాలో పలు ఖాతాలు తెరిచిన దానిష్ వాటి ద్వారా తన కార్యకలాపాలు సాగించేవాడు. ఇక, పదో తరగతి వరకు చదివిన అఫ్తాబ్ ఖురేషీ తన తండ్రికి మాంసం వ్యాపారంలో తోడుగా ఉంటున్నాడు. ఐదో తరగతి వరకే చదివిన సుఫియాన్ అబూబకర్ ఖాన్ వెల్డింగ్ పనులు చేస్తుంటాడు. కమ్రాన్ ఖురేషి ల్యాబొరేటరి సహాయకుడిగా, న్యాయవాదుల వద్ద టైపిస్టుగా పని చేస్తుంటాడు.

యమన్.. బీఫార్మసీ విద్యార్థి

పోలీసులు నిజామాబాద్ జిల్లా బోధన్‌లో అరెస్టు చేసిన మహమ్మద్ హుజైఫ్ యమన్.. డిచ్‌పల్లి వద్ద ఉన్న తిరుమల నర్సింగ్ కళాశాలలో బీఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. దానిష్ సూచనల ప్రకారం ఆయుధాలు, మందుగుండు సామగ్రిని పరీక్షించేవాడినని యమన్ విచారణలో అంగీకరించాడని ఢిల్లీ పోలీసులు తెలిపారు. భారత్‌లో ముస్లింలు అణిచివేతకు గురవుతున్నారంటూ రెచ్చగొట్టిన దానిష్.. యమెన్‌ను ఉగ్రవాదం వైపు ఆకర్షించాడు. కాగా, యమన్.. దానిష్‌తో వీడియో కాల్ మాట్లాడిన విషయం నిజమేనని యమన్ కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కానీ యమన్‌కు ఉగ్రవాదులతో ఎలాంటి సంబంధాలు లేవని, తన కుమారుడిని విడిచిపెట్టాలని అతని తల్లి వేడుకుంటున్నారు.

జగన్ పీఏకూ 'కిక్కు!'

సునీల్ రెడ్డి పేరుతో పదికిపైగా కంపెనీలు

» విశాఖ, హైదరాబాద్‌లలో సిట్ సోదాలు

» పదీ డొల్ల కంపెనీలే.. మనీరూటింగ్ కోసమే

» నాటి వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండు జే బ్రాండ్లు సునీల్‌వే

» చంచల్‌గూడ జైల్లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి సునీల్ రెడ్డి సేవలు

అమరావతి, విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీలో వైసీపీ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల విలువైన మద్యం స్కామ్‌లో 'సిట్' దర్యాప్తు మరో కీలక మలుపు తిరిగింది. నిత్యం జగన్ వెన్నంటి ఉండే ఆయన వ్యక్తిగత సహాయకుడు (పీఏ).. జగన్ సతీమణి భారతికి బంధువు అయిన నర్రెడ్డి సునీల్ రెడ్డి కంపెనీల తలుపులనూ 'సిట్' తట్టింది. హైదరాబాద్, విశాఖపట్నం నగరాల్లో సునీల్ పేరుతో ఉన్న పది కంపెనీల్లో గురువారం పెద్ద ఎత్తున సోదాలు నిర్వహించింది. హైదరాబాద్ బంజారా హిల్స్ రోడ్ నం.2లోని సాగర్ సొసైటీ, రోడ్ నం. 3లోని స్నేహహౌస్‌లో.. రాజేంద్రనగర్‌లోని కాటేదాన్, ఖైరతాబాద్‌లోని కమలాపురి కాలనీల్లో.. మొత్తం నాలుగు అడ్రస్‌లలో ఉన్న ఎనిమిది కంపెనీల్లో సిట్ బృందాలు సోదాలు జరిపాయి. అలాగే.. విశాఖపట్నంలో హార్బర్ పార్క్ రోడ్డులో రామకృష్ణ మఠం ఎదురుగా గల 'ఆకాశం' భవనంలోని మూడో అంతస్తులో సునీల్‌రెడ్డికి 'వెర్టలైఫ్ బంకర్స్ ప్రైవేటు లిమిటెడ్', 'గ్రీన్‌ఫీల్డ్స్' పేరుతో కార్యాలయాలు ఉన్నాయి. అదనపు ఎస్పీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో విజయవాడ నుంచి అక్కడికి చేరుకున్న సిట్ బృందం గురువారం ఉదయం 11 గంటల సమయంలో సోదాలు ప్రారంభించాయి. రాత్రి 7.30 గంటల సమయంలో ఏపీ ఫోరెన్సిక్ ల్యాబ్ లోగో కలిగిన వ్యక్తి ఒకరు బ్రీఫ్ కేస్ పట్టుకుని ఆ భవనంలోకి వెళ్లారు. దీంతో కీలక పత్రాలను సిట్ అధికారులు గుర్తించారని, వాటిలో సంతకాలు లేదా ఇతర వివరాలను నిర్ధారించుకోవడానికే ఫోరెన్సిక్ నిపుణుడిని రప్పించి ఉంటారని ప్రచారం జరుగుతోంది. సునీల్ రెడ్డి ఈ కార్యాలయాలను 2019లో ప్రారంభించినట్టు కొందరు చెబుతున్నారు. రాత్రి 9.30 గంటల సమయంలో కూడా సోదాలు కొనసాగాయి. ఆయా కంపెనీల కార్యాలయాల నుంచి హార్డ్ డిస్కులు, కీలక పత్రాలు, కంప్యూటర్లలోని డేటా సిట్ అధికారులు సేకరించారు. ఈకంపెనీలకు ఆడిటర్‌గా ఉన్న వ్యక్తిని పిలిపించి సిట్ విచారించనున్నట్టు సమాచారం. అలాగే.. మద్యం కుంభకోణంలో ఉత్తరాంధ్రలో నాడు కీలకంగా వ్యవహరించిన ఒక మంత్రి బంధువు పాత్ర కూడా ఉన్నట్టు సిట్ అధికారులు ఇప్పటికే గుర్తించినట్టు ప్రచారం జరుగుతోంది. ఇక్కడ సోదాలు ముగిసిన తర్వాత సిట్ అధికారులు సదరు మాజీ మంత్రి బంధువు ఇంట్లో సోదాలు నిర్వహించే అవకాశం లేకపోలేదని పోలీసులు చెబుతున్నారు.

జగన్ జైల్‌మేట్

అక్రమాస్తుల కేసులో జైలుకెళ్లిన జగన్‌కు సునీల్ రెడ్డి జైల్లో సేవలందించారు. కోనేరు ప్రసాద్ నుంచి తీసుకున్న డబ్బులు సునీల్ రెడ్డే జగన్‌కు చేర్చినట్లు అప్పట్లో సీబీఐ రిమాండ్ రిపోర్టులో కోర్టుకు తెలిపింది. అప్పటికే అరెస్టయి ఒంటరిగా జైలు గదిలో ఉన్న జగన్‌కు సేవలు చేసేందుకు సునీల్‌ను అక్కడ ఉంచాలని అప్పట్లో ఆ కేసు వాదించిన లాయర్లు సీబీఐ కోర్టులో పిటిషన్ వేశారు. దీంతో చాలాకాలం పాటు జగన్‌కు సునీల్ జైల్‌మేట్‌గా ఉన్నారు. జగన్‌కు బెయిల్ వచ్చే వరకూ కనీసం బెయిల్ పిటిషన్ కూడా వేయకుండా జైల్లోనే గడిపిన సునీల్ రెడ్డి విశ్వాసం జగన్‌ను మెప్పించింది. దీంతో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పది కంపెనీలకు ఆయనను యజమానిని చేసినట్లు సిట్ వర్గాలు ఆధారాలు సేకరించాయి. ఏపీలో మందుబాబుల రక్తాన్ని పీల్చి దోచుకున్న వేల కోట్ల రూపాయల మనీ రూటింగ్‌లో ఈ కంపెనీలను ఉపయోగించినట్లు సమాచారం. అలాగే.. వైసీపీ హయాంలో ఏపీలో మద్యంప్రియులకు విక్రయించిన జే బ్రాండ్లలో రెండు ఉత్పత్తులు సునీల్‌రెడ్డివేనని సిట్ గుర్తించినట్టు తెలుస్తోంది. వాటి ద్వారా ఆయన భారీగానే వెనకేసుకున్నట్టు సమాచారం.

నా పింఛన్ రద్దు చేయండి

» ఓ వృద్ధురాలి దరఖాస్తు

కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందుకోవడానికి అందరూ పోటీపడి దరఖాస్తు చేసుకుంటారు. కానీ, ఓ వృద్ధురాలు మాత్రం పింఛను రద్దు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకుంది. తద్వారా, తనకు వచ్చే పింఛను డబ్బులు ఇతర నిరుపేదలకు ఉపయోగపడతాయనే మానవీయ కోణంలో ఆలోచించింది. బిహార్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ యాకుబ్ భార్య అబ్బాస్ బీ(75) కుటుంబం కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి, కుత్బుల్లాపూర్‌లోని భగత్‌సింగ్‌నగర్‌లో నివాసముంటోంది. ఆమెకు ఇక్కడే ప్రభుత్వ గుర్తింపుకార్డులన్ని ఉండడంతో, సంక్షేమ పథకానికి దరఖాస్తు చేసుకోగా వృద్ధాప్య పింఛన్ వస్తోంది. అయితే, కుటుంబమంతా తిరిగి స్వంత రాష్ట్రానికి మకాం మార్చడంతో తనకు వస్తున్న పింఛను రద్దు చేయించుకోవాలని నిర్ణయించుకుంది. ఆ డబ్బుల్ని ఎవరైనా పేదలకు అందించేలా చూడాలని దరఖాస్తులో పేర్కొనడంతో అధికారులు ఆమె నిజాయితీని అభినందించారు.

నకిలీ ఐటీసీ కేసు దర్యాప్తు...
ఐదు రాష్ట్రాల్లో ఈడీ తనిఖీలు

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కుంభకోణం దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో 10 చోట్ల సోదాలు నిర్వహించి కీలక ఆధారాలు సేకరించారు. హరియాణా, అరుణాచల్‌ప్రదేశ్, ఢిల్లీ, తమిళనాడు, తెలంగాణలోని హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలో ఈడీ అధికారులు గురువారం ఏకకాలంలో సోదాలు చేపట్టారు. భారీ స్థాయిలో సరుకు రవాణా చేసినట్లు ఇన్‌వాయిస్‌లు సృష్టించి, కోట్లాది రూపాయల వ్యాపారాన్ని కాగితాల మీద చూపించి, ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను అక్రమంగా పొందినట్లు ఈడీ గుర్తించింది. పలు షెల్ కంపెనీల ఖాతాల ద్వారా దాదాపు రూ.650కోట్లు కొందరి వద్దకు చేరాయని భావిస్తున్న ఈడీ.. వారెవరో గుర్తించే పనిలో ఉంది. వాస్తవానికి ఈ ఏడాది మే నెలలోనే అంతిమ లబ్ధిదారుడిగా భావిస్తున్న శివకుమార్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలోనే మరికొందరు వ్యక్తులు, సంస్థలు నకిలీ ఐటీసీ కుంభకోణంలో భాగస్వాములైనట్లు గుర్తించి, దేశవ్యాప్తంగా దర్యాప్తు చేపట్టారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆధార్‌కు ఆమోదం!

బిహార్‌లో సమగ్ర ప్రత్యేక సవరణ (సర్)కు ఎన్నికల సంఘం ఉపక్రమించిన 77రోజుల తరువాత, ఓటర్ల జాబితాలో 65 లక్షల ఓట్లు తొలగించిన అనంతరం, చెల్లుబాటయ్యే ఒక గుర్తింపుగా ఆధార్‌ను పరిగణనలోకి తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎన్నికల సంఘం ఎట్టకేలకు, అయిష్టంగానే ఆమోదించింది. ఇకమీదట, ఆధార్‌ను కూడా ఓ ఆధారంగా స్వీకరించండి అంటూ బిహార్‌లో ఉన్న తన ఎన్నికల ప్రధానాధికారికి ఈసీ ఆదేశాలు జారీ చేసింది. మధ్యంతర ఉత్తర్వుల ద్వారా ఒక తీవ్ర సమస్యను సుప్రీంకోర్టు ఇలా పరిష్కరిస్తూనే ఆధార్ పౌరసత్వ ధ్రువీకరణ కాదన్న ఎన్నికల సంఘం వాదననే పునరుద్ఘాటించింది. అంతేకాదు, బిహార్ అక్రమవలసదారులకు నిలయం అంటూ ఎన్నికల సంఘం పదేపదే కోర్టును హెచ్చరిస్తూ వచ్చిన నేపథ్యంలో, ఒక పౌరుడి ఆధార్ అసలైనదో, నకిలీదో నిర్ధారించే అధికారాన్ని కూడా సుప్రీంకోర్టు ఎన్నికల సంఘానికే ఇచ్చింది. ఈ దేశంలో పుట్టిన ప్రతీవ్యక్తి ఉనికినీ, మనుగడను నిర్ధారిస్తున్న, ప్రతీ అవసరాన్నీ తీరుస్తున్న ఆధార్‌ను 'సర్'లో మాత్రం సర్వోన్నత న్యాయస్థానం పన్నెండో స్థానంలో ఉంచింది. ఒక వ్యక్తిని ఓటరు లిస్టులో చేర్చడానికీ లేదా తొలగించడానికి ఎన్నికలసంఘం గుర్తించిన ధ్రువీకరణ పత్రాల జాబితాలో ఆధార్ ఎట్టకేలకు అడుగున చేరింది.

బిహార్‌లో దాదాపుగా ప్రజలందరి దగ్గరా ఉన్న ఒక గుర్తింపు పత్రాన్ని తాను గుర్తించేది లేదంటూ ఎన్నికల సంఘం తీవ్రంగా పోరాడింది. అభ్యంతరం ఏమిటంటూ సుప్రీంకోర్టు కూడా పలుమార్లు ప్రశ్నించింది. గుర్తించి తీరాల్సిందేనంటూ మొన్న విస్పష్టమైన ఆదేశాలు జారీచేసేలోగా కనీసం మూడు సార్లు న్యాయస్థానం ఆధార్‌ను చేర్చమంటూ ఈసీని కోరింది. ఒక లబ్ధిదారుగా ప్రయోజనాలు పొందడానికి అది పనికొస్తుందేమో కానీ, పౌరసత్వ ధ్రువీకరణ పత్రం కాబోదని ఈసీ వాదన. శాశ్వత నివాసం, కులం, పాస్‌పోర్టు సహా ఎన్నికల సంఘం ప్రకటించిన పదకొండు డాక్యుమెంట్లనూ పొందడానికి మూలాధారంగా ఉపకరిస్తున్న ఆధార్, ఓటుహక్కుకు ఎందుకు పనికిరాకుండా పోయిందన్నది అసలు ప్రశ్న. తాను స్వయంగా జారీచేసిన ఓటరు గుర్తింపు కార్డును కూడా ఎన్నికల సంఘం కాదంటూ వచ్చింది. జాబితాలో చేర్పులు జరగాలి కానీ, మూకుమ్మడి తొలగింపులు కాదు అంటూ ఒక దశలో న్యాయస్థానం చిరాకుపడి, ఆధార్, ఓటరు కార్డు విషయంలో మరింత ఒత్తిడి తీసుకువచ్చింది కూడా. 65లక్షల మంది ఓటర్లను తొలగించిన ముసాయిదాను బహిరంగపరచాలన్న కోర్టు సూచనను కూడా, ఇది ఉపకారం కంటే అపకారమే చేస్తుందంటూ ఎన్నికల సంఘం తిరస్కరించింది. అయితే, అభ్యంతరాలు తెలియచేయడానికి అప్పటివరకూ ఉన్న సెప్టెంబరు 1 గడువును పొడిగించడానికి మాత్రం ఒప్పుకుంది. చివరకు కోర్టు కూడా ఆధార్ చట్టం ప్రకారం అది సిటిజెన్‌షిప్ ప్రూఫ్ కాదంటూనే, ఐడీప్రూఫ్‌గా వాడవలసిందేనంటూ వివాదాన్ని ముగించింది. ఎన్నిసార్లు చెప్పినా వినని ఎన్నికల సంఘం కూడా అయిష్టంగానే సరేనంది.

అక్రమ వలసదారులను జాబితాలో చేర్చాలని ఎవరూ కోరుకోరు, అంత మాత్రాన అసలుసిసలు పౌరులకు ఏదో ఒక డాక్యుమెంట్ లేదన్న కారణంగా అన్యాయం జరగకూడదు, అనర్హుడుగా మిగిలిపోకూడదు అంటూ సర్వోన్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్య ఎంతో ఉన్నతమైనది. ఇప్పటివరకూ ఓటరు జాబితాలో ఉంటూ, దశాబ్దాలుగా అనేక ప్రభుత్వాలను అధికారంలో కూచోబెట్టిన లక్షలాది ఓటర్ల పేర్లు ఈ సమూల ప్రక్షాళన కార్యక్రమంలో గల్లంతైన మాట నిజం. ఆధార్‌ను ఆమోదించాలన్న కోర్టు ఆదేశాలతో ఎంతోమందికి న్యాయం జరిగే అవకాశాలు ఇప్పుడు పెరిగాయి. ఇక, నకిలీ ఆధార్‌లు ఉంటాయనీ, వాటిని నిగ్గుతేల్చవచ్చునంటూ న్యాయస్థానమే అధికారాలు అప్పగించిన నేపథ్యంలో, ఏ మాత్రం తేడాపాడాలున్నా అధికారులకు కాదుపొమ్మనే అవకాశాలు కూడా మెండుగా ఉంటాయి. ప్రతీ 1500మంది స్థానంలో ఇప్పుడు 1200మందికి ఓ పోలింగ్‌బూత్ కేటాయిస్తున్నందున వాటిసంఖ్య 77వేల నుంచి 91వేలకు పెరిగిందనీ, బూత్‌లకు కొత్తనెంబర్లు వచ్చాయనీ, ఆధార్ ఆధారంగా తిరిగి జాబితాలో చేరాలనుకుంటున్నవారు కొత్త బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌వో)తో వ్యవహరించవలసి ఉంటుందని వార్తలు వింటున్నాం. అత్యధిక నిరక్షరాస్యత ఉన్న బిహార్‌లో మరో పదిహేనురోజుల్లోగా ఈ పనంతా ఎంత సవ్యంగా పూర్తవుతుందో తెలియదు. ఆధార్‌ను గుర్తించాలంటూ పోరాడుతున్నవారంతా అక్రమవలసదారుల పక్షాన ఉన్నట్టేనని కోర్టులో బలంగా వాదించిన ఎన్నికల సంఘం, సుప్రీం ఆదేశాలను ఎంత సమర్థంగా అమలు చేస్తుందో చూడాలి.

ఆర్థిక వ్యవస్థ స్థానికీకరణ


నేను నెహ్రూ భారత్ బిడ్డను. ప్రపంచీకరణ పవనాలు ఆగమించక ముందు భారతీయ సమాజం ఆర్థిక, సామాజిక స్వరూప స్వభావాల గురించి నా పుస్తకం 'The Rise of the Neo-Locals : a generational reversal of globalisation'లో విపులంగా జ్ఞాపకం చేసుకున్నాను. నా ఆరు దశాబ్దాలకు పైగా జీవితంలో ప్రపంచ ప్రస్థానం ఎక్కడ ప్రారంభమయిందో అక్కడకే ఎలా తిరిగివచ్చిందో నేను చర్చించాను. నా బాల్యంలో ఆర్థికాభివృద్ధి విషయమై భారతదేశ దార్శనికత స్వావలంబనకు, దేశీయ వస్తూత్పత్తి రంగాలలో పెట్టుబడులకు ప్రాధాన్యమిచ్చేది; నా తొలి యవ్వనంలో దేశ ఆర్థిక రంగంలోకి ప్రపంచ వాణిజ్య సంస్థ, స్వేచ్ఛా వాణిజ్యం ప్రవేశించాయి. తత్ఫలితంగా మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమవడం ప్రారంభమయింది; దరిమిలా ఎగుమతుల ఆధారిత ప్రపంచీకరణ అనేది ఆర్థికాభివృద్ధికి బంగారు ప్రమాణంగా పరిణమించింది. వాషింగ్టన్‌లోని శ్వేత సౌధానికి డోనాల్డ్ ట్రంప్ రెండో రాకడతో ఆ అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థలో ఇప్పుడు అసాధారణ మార్పులు సంభవిస్తున్నాయి.



▪ సునీతా నారాయణ్

మట్టివాసన

అమెరికా ప్రజల వినియోగం అపారమైనది. ఈ కారణంగానే ట్రంప్ అనేక దేశాలతో (తన షరతుల ప్రకారం)



స్థానిక వనరుల ఆధారంగా ఎంత అభివృద్ధి సాధిస్తామో వాతావరణ మార్పు వైపరీత్యాలను అంత సమర్థంగా ఎదుర్కోగలుగుతాము. బకాసుర వినియోగ మనస్తత్వాన్ని త్యజించి స్థానిక ఉత్పత్తిని ప్రోత్సహించే జీవనాధారాలను కాపాడే కొత్త హరిత భవిష్యత్తును నిర్మించుకోవాలి.

వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ప్రపంచ జనాభాలో 4 శాతం మాత్రమే ఉన్న అమెరికా జనాభా ప్రపంచ గృహ సంబంధ సరుకుల వినియోగంలో ఆ దేశం వాటా 30 శాతం మేరకు ఉన్నది! అమెరికాతో పోలిస్తే చైనా వినియోగం తక్కువగా ఉన్నది. ప్రపంచ జనాభాలో చైనా జనాభా 17 శాతం ఉండగా ప్రపంచ వినియోగంలో ఆ దేశం వాటా 12 శాతంగా ఉన్నది. ఈ వినియోగ చిక్కు ప్రశ్నను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే అది మన భవిష్యత్తు నిర్ణాయక అంశం. వాస్తవమేమిటంటే అమెరికా తరహా వినియోగం వనరులు పరిమితంగా ఉన్న, కార్బన్ ఉద్గారాలు అత్యధికంగా ఉన్న సమాజాలలో సాధ్యంకాదు. ఈ ధరిత్రిపై ప్రతి ఒక్కరూ అమెరికన్‌లా జీవించాలంటే ప్రపంచానికి మరెన్నో భూగ్రహాలు అవసరమవుతాయని విజ్ఞులు అనే మాట పూర్తి సత్యం. వినియోగ ఆధారిత ఆర్థికాభివృద్ధి నమూనా పర్యవసానాలను ఎదుర్కోకుండా వాతావరణ మార్పు సమస్యను అధిగమించడం గురించి చర్చించలేము. అదే సమయంలో ఆర్థికాభివృద్ధి సాధనకు సరుకుల వినియోగం చాలా ముఖ్యం అనే వాస్తవాన్ని విస్మరించకూడదు.


మరి మన ముందున్న మార్గమేమిటి? వినియోగానికి సంబంధించిన చిక్కు ప్రశ్నలో రెండు అంశాలు ఉన్నాయి. మొదటిది ఒక దేశంలోని సంపద పంపిణీ మరింత పెంచడానికి ప్రాధాన్యమిస్తుంది. తద్వారా వినియోగం అన్నది కొద్ది మంది సంపదకు సంబంధించినది కాకుండా అత్యధిక ప్రజల సంక్షేమ సంబంధితమవుతుంది. 'పేదల చేతుల్లో డబ్బు ఉన్నంతవరకు వారు వివిధ సరుకుల 'వినియోగదారులు' అవుతారు' అన్నది ఎవరూ కొట్టివేయలేని సత్యం. రెండోది ఆర్థిక వ్యవస్థను స్థానికీకరణ చేసుకోవల్సిన ఆవశ్యకత. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రజల కోసం పెద్ద ఎత్తున వస్తూత్పత్తి చేయడం కాకుండా ప్రజలు తమ అవసరాలను తీర్చుకోవడానికి అవసరమైన వస్తువులు అన్నిటినీ స్థానికంగా తయారు చేసుకోవడం. దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించుకుని దేశీయ, ప్రపంచ మార్కెట్ల మధ్య ఆరోగ్యకరమైన సమతుల్యతను సాధించుకోవాలి. గాంధీజీ చెప్పింది ఇదే కదూ? ఆధునిక, స్వావలంబన ఆర్థిక వ్యవస్థకు ఇదే పునాది కావాలి. స్థానిక వనరుల ఆధారంగా స్థానికంగా ఎంత అభివృద్ధి సాధిస్తామో వాతావరణ మార్పు వైపరీత్యాలను అంత సమర్థంగా ఎదుర్కోగలుగుతాము. బకాసుర వినియోగ మనస్తత్వాన్ని త్యజించాలి. స్థానిక ఉత్పత్తిని ప్రోత్సహించే జీవనాధారాలను కాపాడే కొత్త హరిత భవిష్యత్తును నిర్మించుకోవాలి. మరి మనం ఇందుకు సుముఖంగా ఉన్నామా?

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

అమెరికా... అమెరికా.. ఎక్కడ నుంచి ఎక్కడకు!

ప్రాభవం కోల్పోతున్నప్పుడు, దానికి విరుగుడుగా ప్రత్యామ్నాయ మార్గమూ దొరకనప్పుడు విపరీత ప్రవర్తన కనపడుతుంది. వ్యక్తికైనా దేశానికైనా ఇదే వర్తిస్తుంది. ప్రపంచ దేశాల మీద ఎడాపెడా సుంకాలు విధిస్తూ అల్లకల్లోలం సృష్టిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనల్డ్ ట్రంప్ చర్యల్లో మనకు కనపడేది ఇదే. ఆధిపత్యానికి కావాల్సిన హంగులు, ఏర్పాట్లు, మేధో విశిష్టతలు ఒక్కొక్కటిగా కోల్పోతున్నప్పుడు మర్యాదలూ, సంయమనాలూ మట్టికల్సిపోతాయి. దౌత్యనీతులు మంటగలుస్తాయి. చుట్టూ శత్రు సమూహాలు కమ్ముకొస్తున్నట్లుగా హడావుడులు హోరెత్తుతాయి. పైపైన చూస్తే ట్రంప్ లాంటి నాయకులు తమ ప్రవర్తనతో, లోతులేని ఆలోచనలతో కోరికోరి అమెరికాకు నష్టాలు తెచ్చిపెడుతున్నట్లుగా కనిపిస్తుంది. వ్యక్తుల ప్రవర్తన, వ్యక్తిత్వమే అన్నిటికీ కీలకం అనుకుంటే అసలు పరిస్థితులు అర్థంకావు. నాయకుల ప్రభావం చరిత్రగతి మీద ఉంటుంది. దాన్ని కాదనలేం. కానీ ఒక సమాజం, ఒక దేశం సంక్లిష్ట ప్రయాణాన్నీ, ఆటుపోట్లనూ అర్థం చేసుకోటానికి ఎన్నో పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాల్సి వస్తుంది. నిజానికి ఆ పరిస్థితుల్లో నుంచే విపరీత పోకడల నేతలు పుట్టుకొస్తారు.

వాణిజ్య సుంకాలను అస్త్రాలుగా ఉపయోగించి, వివిధ దేశాల ఎగుమతులపై అనిశ్చితిని సృష్టించి, అమెరికాకు నచ్చినట్లు ఆయా దేశాల ఆర్థిక వ్యవహారాలను మార్చటానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను సునిశితంగా పరిశీలిస్తే ఒక సంక్షోభమే కనపడుతుంది. ఆధిపత్యం కోల్పోతున్న క్రమం వెల్లడవుతుంది. ఎగుమతులు తగ్గి దిగుమతులు విపరీతంగా పెరగటం అమెరికాకు నిన్నోమొన్నో మొదలవ్వలేదు. దిగుమతుల కంటే ఎగుమతులు ఎక్కువ ఉంటే ఏ దేశమైనా వాణిజ్యపరంగా మిగులును (ట్రేడ్ సర్ప్లస్) కలిగి ఉంటుంది. అమెరికా ఆ స్థానాన్ని ఎప్పుడో కోల్పోయింది. 1976 నుంచి ఇప్పటివరకూ ఏ ఏడాదిలోనూ వాణిజ్య మిగులును సాధించలేదు. రకరకాల వస్తువులు, పరికరాలు, పదార్థాలు, యంత్రాల కోసం విదేశాలపై ఆధారపడటం 50 ఏళ్లుగా కొనసాగుతోంది. ముడిసరుకులు, శ్రమశక్తి చవకగా ఉన్న దేశాల నుంచి ఎగుమతులను ప్రోత్సహించటం ఒకనాడు విధానంగా పెట్టుకుంది. అక్కడికి పెట్టుబడులనూ తరలించింది. అటువంటి దేశాలను అన్ని విధాలా వెన్నుతట్టింది. తనకు చౌకగా వస్తువులను ఎగుమతి చేసే దేశాలను స్వేచ్ఛా వాణిజ్యానికి అసలుసిసలైన ప్రతినిధులుగా కీర్తించింది. ప్రపంచీకరణ బాగా ఊపందుకున్న 1990ల తర్వాత బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఐటీ ఆధారిత, విమాన ప్రయాణం, పర్యాటక, విద్యా, మేధో హక్కుల రంగాలకు సంబంధించిన వాణిజ్యసేవల లావాదేవీల్లో అమెరికా మిగులును సాధిస్తూ వస్తున్నా, వస్తూత్పత్తి రంగాల్లో వెనుకబడి పోయింది. కిందటి ఏడాదిలో వస్తూత్పత్తి లావాదేవీల్లో 1.21 ట్రిలియన్ డాలర్ల లోటు ఉంది. సర్వీసు రంగాల్లో వచ్చిన మిగులు 293 బిలియన్ డాలర్లు ఉన్నప్పటికీ మొత్తంగా చూస్తే దాదాపు 918 బిలియన్ డాలర్ల లోటు ఏర్పడింది. ఇదొక విపత్కర పరిస్థితి. అగ్రగామి దేశానికి వాణిజ్య మిగులు ఉండటం సహజం. మొదటి ప్రపంచ యుద్ధం వచ్చేవరకూ దాదాపు వందేళ్ల పాటు వాణిజ్యంలో బ్రిటన్ మిగులును సాధించింది. ఆ తర్వాత దాన్ని కోల్పోయింది. దాంతో ప్రపంచంలో ఒకటో స్థానాన్నీ కోల్పోయింది. ఆ తర్వాత ఆర్థికపరంగా చాలా మెట్లు దిగాల్సి వచ్చింది. వస్తు, యంత్ర ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నంతవరకూ బ్రిటన్ ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. అమెరికా కూడా ఒకప్పుడు ఆ రకంగానే తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. 1980ల తర్వాత ఆసియా దేశాలు బాగా ముందంజ వేస్తున్న పరిస్థితుల్లో ఆ స్థానాన్ని అమెరికా తిరిగి పొందే అవకాశం కనపడటంలేదు. మాగా, మాగా (మేక్ అమెరికా గ్రేట్ అగెన్) అనే నినాదంపై ఎంతగా గొంతెత్తినా ఆశించిన ఫలితాన్ని సాధించటం అంత తేలికకాదు.



ఇప్పటి అమెరికా పరిస్థితి చూస్తే 1987లో పాల్ కెనడీ తన పుస్తకం 'ద రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ ద గ్రేట్ పవర్స్'లో చెప్పిన విషయాలు గుర్తుకు రాకుండా ఉండవు. ఆర్థిక బలం, సైనికశక్తి, ప్రాబల్య విస్తరణ.. ఈ మూడు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయనీ.. ఒకనాడు ఆధిపత్యం నెరపి, ఆ తర్వాత దాన్ని కోల్పోయిన రాజ్యాలన్నిటినీ ఈ కోణం నుంచే చూడాలని చెప్పారు. ఆసియా ఖండం నుంచి అమెరికాకు సవాల్ ఎదురుకానుందని కూడా అప్పుడే హెచ్చరించారు. ఆ తర్వాత పరిణామాలన్నీ దాన్ని ధ్రువపరచే విధంగానే ఉన్నాయి.

స్వదేశంలో పెట్టుబడులు పెట్టాలని ఆపిల్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్ లాంటి బడా టెక్ కంపెనీలపై విపరీత ఒత్తిళ్లు వస్తున్నా అవి ఎంతమేరకు నెరవేరతాయో ఇప్పుడే చెప్పలేం. రాజకీయ పరిస్థితులు మారిపోతే ఆ ఒత్తిళ్లు తగ్గుతాయి. లాభాలు, ఇతరత్రా ఉండే సానుకూలతలకే కంపెనీలు ప్రాధాన్యం ఇస్తాయి. వాటి ముందు దేశభక్తి నిలబడటం కష్టం!

అమెరికాతో పోల్చితే చైనా ట్రిలియన్ డాలర్ల మిగులు వాణిజ్యంలో ఉండటానికి కారణం వస్తూత్పత్తిలోనూ, శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాధించిన అనూహ్య అభివృద్ధే. ఆధునిక చరిత్రలోనే ఇది అపూర్వం. గ్లోబలైజేషన్ గురించి ఎన్నో పొగడ్తలతోనూ, పోటీ పునాదిగా ఆర్థిక వ్యవస్థలు మారటానికి అదెలా కారణమవుతుందో వివరిస్తూ ప్రముఖ వ్యాఖ్యాత థామస్ ఫ్రీడ్‌మన్ 2005లో 'ద వల్డ్ ఈజ్ ఫ్లాట్' పుస్తకాన్ని రాశారు. ఆన్‌లైన్ ట్రేడింగ్, ఐటీ ఆధారిత సర్వీసులు ప్రపంచాన్ని ఎట్లా మార్చి వేయబోతున్నాయో అప్పుడే చెప్పారు. ప్రపంచీకరణతో అన్ని దేశాలకూ సమాన అవకాశాలు దక్కుతాయని చెప్పటమే కాకుండా అందుకు ఉదాహరణలుగా బెంగళూరులో ఐటీ కంపెనీల గురించి ఘనంగా వివరించారు. అసలు 'వల్డ్ ఈజ్ ఫ్లాట్' అన్న భావననే తాను ఇన్ఫోసిస్ చీఫ్‌గా ఉన్న నందన్ నిలేకని నుంచి స్వీకరించానని కూడా తెలిపారు. ఫ్రీడ్‌మన్ ఒక విషయాన్ని ఆనాడు చాలా స్పష్టంగా చెప్పారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమ్యాటిక్స్ (స్టెమ్) కోర్సుల్లో అమెరికన్ విద్యార్థుల సంఖ్య తగ్గిపోవటం ప్రమాదకరంగా మారుతోందనీ దాన్ని అరికట్టకపోతే తీవ్ర ప్రమాదం పొంచివుందనీ హెచ్చరించారు. ప్రపంచప్రఖ్యాతి గాంచిన విద్యా సంస్థల్లోని స్టెమ్ కోర్సుల్లో ఆసియా విద్యార్థుల ఆధిపత్యం పెరిగిపోతోందనీ, అది అలాగే కొనసాగితే కొత్త టెక్నాలజీలకు అమెరికా నాయకత్వం వహించే పరిస్థితి ఉండదనీ చెప్పారు. 2005 నాటికే చైనా, జపాన్‌ల్లో అమెరికా కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా స్టెమ్ సబ్జెక్టుల్లో చదివే విద్యార్థులు ఉన్నారు. తాజా లెక్కల ప్రకారం ఈ ఏడాదిలో చైనాలో స్టెమ్ కోర్సుల్లో పీహెచ్‌డీ పూర్తిచేసే పరిశోధక విద్యార్థులు 77,000 మంది ఉంటే అమెరికాలో ఆ సంఖ్య 40,000 మాత్రమే. ఇందులోనూ ఆసియా విద్యార్థుల సంఖ్య గణనీయంగానే ఉంటుంది. వీసాల ఆంక్షలతో, సవాలక్ష శల్య పరీక్షలతో ఆసియా పరిశోధకులకు అడ్డంకులు సృష్టిస్తే స్టెమ్ కోర్సుల్లో చేరే ప్రతిభావంతుల సంఖ్య ఇంకా తగ్గుతుంది. పరిశోధన–అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కోసం ఖర్చుపెట్టే నిధుల విషయంలో కూడా చైనా అమెరికాను ఈ ఏడాది దాటేయబోతోంది. అమెరికా ఆధిపత్యానికి గండిపడటానికి ఇవన్నీ గట్టి సూచికలు.



▪ రాహుల్ కుమార్

సుంకాల యుద్ధంలో తాను ఇప్పటికే విజయం సాధించాననే భావనతోనే ట్రంప్ ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 11 నెలల కాలానికి దిగుమతి సుంకాల ద్వారా 183.6 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చింది. 2024లో వచ్చిన 77 బిలియన్లతో పోల్చుకుంటే ఇది చాలా ఎక్కువ. 2023 నాటి 93 బిలియన్ డాలర్లతో పోల్చినా దాదాపు రెట్టింపు అయినట్లు లెక్క. అయినా అమెరికాను విపరీతంగా కుంగదీస్తోన్న బడ్జెట్ లోటును అది ఆర్పేది తీర్చేది కాదు. ఆ లోటును పూడ్చటానికి అదనపు సుంకాల విధింపును సాధనంగా ఎంచుకున్నా దక్కే ఫలితం మాత్రం కొంతే. 1900 బిలియన్ డాలర్ల బడ్జెట్ లోటులో (2025 అంచనాలు) సుంకాల ద్వారా లభించే మొత్తం ఆదాయం 10 శాతానికి కాస్త అటూఇటూగానే ఉంటుంది. లోటుని పూడ్చటానికి సుంకాలు పెంపు పరిష్కారం కాదనేది ఈ అంకెలే చెబుతాయి. దిగుమతి సుంకాల పెంపు ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టివేసే ప్రమాదం ఉందని రేటింగ్ సంస్థలు తీవ్ర హెచ్చరికలు చేస్తున్నా ట్రంప్ బృందం పట్టించుకోవటంలేదు.

ఒకప్పుడు అభివృద్ధి చెందుతోన్న దేశాలు తమ దుస్థితికి పరోక్షంగానో, ప్రత్యక్షంగానో ధనిక దేశాలే కారణమని విమర్శించేవి. ధనిక దేశాల సామ్రాజ్యవాదానికి దాదాపుగా ఆసియాలో అన్ని దేశాలూ బాధలు పడినవే. దోపిడీకి లోనైనవే. ఇప్పుడు అత్యంత ధనికదేశం తన దుస్థితికి అభివృద్ధి చెందుతున్న దేశాలే కారణమని నిందిస్తోంది. ఒక కోణం నుంచి చూస్తే సరైన నిర్ణయాలు తీసుకుని పరిస్థితిని చక్కదిద్దుకోలేని దుస్థితి, అశక్తతే ఇందులో కనపడుతుంది. ఫెడరల్ ప్రభుత్వ అప్పులను ఎలా తీర్చాలో తెలియదు. ఏటా పెరిగిపోయే వడ్డీలు కట్టే విషయంలో పరిష్కారం కనుక్కోరు. సంపన్నులపై పన్నులు పెంచకుండా తగ్గించుకుని పోవటమే ఇందుకు నిదర్శనం. అప్పులు 37 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఏటా కట్టే వడ్డీ ట్రిలియన్ డాలర్లు దాటుతోంది. వాణిజ్య మిగులు (147 బిలియన్ డాలర్లు) విషయంలో యూరోపియన్ యూనియన్ (ఈయూ) పరిస్థితి కూడా అమెరికాతో పోల్చితే కొంతలో కొంత మెరుగ్గా ఉంది.

ఇప్పటి అమెరికా పరిస్థితి చూస్తే 1987లో పాల్ కెనడీ తన పుస్తకం 'ద రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ ద గ్రేట్ పవర్స్'లో చెప్పిన విషయాలు గుర్తుకు రాకుండా ఉండవు. ఆర్థిక బలం, సైనికశక్తి, ప్రాబల్య విస్తరణ.. ఈ మూడు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయనీ.. ఒకనాడు ఆధిపత్యం నెరపి, ఆ తర్వాత దాన్ని కోల్పోయిన రాజ్యాలన్నిటినీ ఈ కోణం నుంచే చూడాలని చెప్పారు. ఆసియా ఖండం నుంచి అమెరికాకు సవాల్ ఎదురుకానుందని కూడా అప్పుడే హెచ్చరించారు. ఆ తర్వాత పరిణామాలన్నీ దాన్ని ధ్రువపరచే విధంగానే ఉన్నాయి. ఆసియాఖండ ఆర్థిక ఆధిపత్యం 2050 నాటికి ఏర్పడే అవకాశం ఉందన్న అంచనాలు ఇప్పటికే చాలా వచ్చాయి. దీన్ని మరో దృష్టి నుంచి చూస్తే 1820 నాటికి ప్రపంచ జీడీపీలో ఆసియా ఖండానికి ఉన్న స్థానం (56శాతం) తిరిగి లభిస్తున్నట్లుగా పరిగణించొచ్చు. అప్పట్లో ఆసియా ఖండానికి ముఖ్యంగా చైనా, భారత్‌లకు ఆర్థిక సంపదలో, వస్తూత్పత్తుల్లో సగభాగం ఉండేది. ఆర్థిక బలం సైనిక శక్తిని, ప్రాబల్య విస్తరణను నిర్ణయించటం నిజమైతే అమెరికా ఆ బలాన్ని కోల్పోయే రీతిలోనే అక్కడి వ్యవహారాలు సాగుతున్నట్లుగా స్పష్టమవుతుంది. ఉన్న ప్రాబల్యాన్ని కాపాడుకోటానికి మోహరించిన సైనికశక్తిని భరించగలిగే స్థాయిలో కూడా అమెరికా ఆర్థికశక్తి పుంజుకోవటం లేదు. 70కి పైగా దేశాల్లో 800 దాకా సైనిక కేంద్రాలను నిర్వహిస్తున్నప్పటికీ వాటిని ఆర్థికంగా భరించలేని స్థాయికి వెళుతోంది. నాటో కూటమికి నిధులను తామే అధికంగా ఎందుకు సమకూర్చాలని ట్రంప్ అప్పుడప్పుడూ చేసే వ్యాఖ్యల వెనుక అంతరార్థం అదే.

ఏక దేశ ఆధిపత్యానికి రోజులు చెల్లిపోయాయని అమెరికా గుర్తించాలి. కానీ అలాంటి ఆలోచనలు రాజకీయరంగాన అక్కడ కనపడటం లేదు. అమెరికాకు అదే విషాదం! తగ్గుతున్న ఆర్థిక బలంతో ఇప్పటిదాకా ప్రపంచానికి బోధించిన సిద్ధాంతాలన్నీ అక్కడ బోర్లాపడుతుండటమే నిజం!

సోవియట్ రష్యా కూటమితో అమెరికా 45 ఏళ్లపాటు ప్రచ్ఛన్నయుద్ధం సాగించినా అది సైనిక రంగానికే పరిమితం. ఆర్థికంగా సోవియట్ రష్యా అమెరికాకు ఇచ్చిన పోటీ అప్పుడు చాలా తక్కువ. ఇప్పుడు చైనాతోపాటు యువరక్తంతో ఉరకలేస్తున్న ఆసియా దేశాలు పారిశ్రామిక, శాస్త్ర, సాంకేతిక బలాన్ని అతి వేగంగా సమకూర్చుకుంటూ ఆర్థికంగా విసురుతున్న సవాళ్లు సాధారణమైనవి కావు. వాటిని ఎదుర్కొనే సత్తాని సంతరించుకోటానికి అమెరికా తనది తిరుగులేని అగ్రరాజ్యమన్న భావనను వీడి తగు వ్యూహాలు రూపొందించుకోగలగాలి. ఏక దేశ ఆధిపత్యానికి రోజులు చెల్లిపోయాయని గుర్తించాలి. అలాంటి ఆలోచనలు రాజకీయరంగాన అక్కడ కనపడటం లేదు. అమెరికాకు అదే విషాదం! తగ్గుతున్న ఆర్థిక బలంతో ఇప్పటిదాకా ప్రపంచానికి బోధించిన సిద్ధాంతాలన్నీ అక్కడ బోర్లాపడుతుండటమే నిజం!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

పొరుగు ప్రళయాల సుడిలో 'విశ్వగురు'



▪ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రభావదాయక నాయకత్వాన్ని అందించి, అంతర్జాతీయ వేదికలపై తన వాణిని మరింత శక్తిమంతంగా విన్పించేందుకు ఆరాటపడుతున్న భారత్‌కు ఇరుగుపొరుగున నిరంతరం సంభవిస్తున్న సంక్షోభాలు ఒక మహా సవాల్‌ను సృష్టిస్తున్నాయి. చైనా నుంచి ఎదురవుతున్న ప్రతికూలతల నేపథ్యంలో భారత్ తక్షణమే దక్షిణాసియా పట్ల తన వైఖరులు, విధానాలను మౌలికంగా మార్చుకోవల్సిన అవసరమున్నది.

నరేంద్ర మోదీ అధికార ప్రస్థానం జాతీయ మలుపు తిరిగిన సందర్భమది. 2014లో ఆయన ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. తన ప్రమాణ స్వీకారోత్సవానికి దక్షిణాసియాలోని అన్ని దేశాల ప్రభుత్వాధినేతలను ఆయన సాదరంగా ఆహ్వానించారు. అద్భుత రాజనీతిజ్ఞత అది, సందేహం లేదు. దక్షిణాసియా ప్రాంతీయ సమైక్యత విషయమై భారత్ ప్రగాఢ ఆరాటాన్ని మోదీ అసాధారణ దౌత్యనీతి ప్రతిబింబించిందని ఆనాడు అందరూ భావించారు. పదకొండు సంవత్సరాలు గడిచిపోయాయి. దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం (సార్క్) గుర్తుందా? దాని పునరుద్ధరణ ఆలోచనే ఇప్పుడు ఎవరికీ లేదు. అంతర్గత రాజకీయాలు, జాతీయవాద భావోద్రేకాలు, ఆర్థిక అవస్థలు, పరస్పర విరోధాలు మళ్లీ అనూహ్య రీతుల్లో పెచ్చరిల్లుతున్నాయి. సార్క్ ఎవరికి కావాలి? 'పొరుగుదేశాలకే ప్రథమ ప్రాధాన్యం' అన్న మోదీ ప్రభుత్వ సుభాషితం ఒట్టి మాటగా మిగిలిపోయింది.

నేపాల్‌ను తాజాగా అతలాకుతలం చేస్తున్న హింసాత్మక నిరసనలే అందుకు ఒక నిదర్శనం. ఒక దశాబ్ద కాలంగా నిరంతర అస్థిరతతో కుదేలైపోతున్న దేశమది. 2015లో ఒక కొత్త రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటి నుంచి నేపాల్ తొమ్మిది ప్రభుత్వాలను చూసింది. పదో ప్రభుత్వం అధికారంలోకి రానున్నది. పేదరికం, నిరుద్యోగం అవినీతి మితిమీరిపోయిన కారణంగా ఆ హిమాలయ రాజ్యంలో తిరుగుబాటు సంభవించింది. యువ నేపాలీలే ఆ తిరుగుబాటుకు పురిగొల్పడం, అందులో అత్యధికంగా పాల్గొనడం గమనార్హం. నేపాల్ పరిణామాలను మోదీ ప్రభుత్వం ఏ మాత్రం ఊహించలేకపోయిందన్నది అంగీకరించవలసిన సత్యం.

నేపాల్‌లో జనరేషన్ జెడ్ (1997–2012 సంవత్సరాల మధ్య జన్మించిన యువజనులు. పుట్టినప్పటి నుంచి ఇంటర్నెట్, సోషల్ మీడియా, మొబైల్ టెక్నాలజీతో పెరిగిన మొదటితరంవారు) నిరసనలు గత ఏడాది జూలైలో సంభవించిన పరిణామాలను ప్రతిబింబించాయి. నేపాల్‌లో సామాజిక మాధ్యమాలపై నిషేధం యువజనుల నిరసనలను ప్రజ్వలింపచేస్తే బంగ్లాదేశ్‌లో సివిల్ సర్వీస్‌లలో రిజర్వేషన్ల విధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు తిరుగుబాటు చేశారు. అది అంతిమంగా షేక్ హసీనా ప్రభుత్వ పతనానికి, ఆమె భారత్‌లో ఆశ్రయం పొందడానికి దారితీసింది. అటు నేపాల్‌లోను, ఇటు బంగ్లాదేశ్‌లోను ప్రభుత్వాల అవినీతి, ఆశ్రిత పక్షపాతం యువజనుల తిరుగుబాటుకు పురిగొల్పాయి.

బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వానికి అన్ని విధాల మద్దతు నిచ్చిన మోదీ ప్రభుత్వం విద్యార్థుల తిరుగుబాటును ముందుగా పసిగట్టలేకపోయింది. ఇస్లామిక్ పార్టీల ప్రాబల్యం పెరిగిపోవడంతో భారత్ వ్యతిరేక, అందునా హిందూ వ్యతిరేక ధోరణులు పెచ్చరిల్లిపోయాయి. స్వదేశంలో హిందూ ఆధిపత్య పాలనను నెలకొల్పడానికి ప్రయత్నిస్తోందన్న విమర్శల నెదుర్కొంటున్న మోదీ సర్కార్ బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలను కాపాడేందుకు ప్రభావశీలంగా వ్యవహరించలేకపోతోంది. ప్రజల తిరుగుబాటుతో అధికారాన్ని కోల్పోయిన షేక్ హసీనాకు భారత్ ఆశ్రయమివ్వడాన్ని బంగ్లాదేశ్ పాలకులేకాకుండా ప్రజలు సైతం హర్షించలేకున్నారు. న్యూఢిల్లీ–ఢాకాల మధ్య సుహృద్భావ సంబంధాల పునరుద్ధరణకు ఇది తీవ్ర అవరోధంగా ఉన్నది.



మరో పొరుగుదేశం శ్రీలంక సైతం ఇటీవలి కాలంలో పలు ఉపద్రవాలను చవి చూసింది. భ్రష్ట రాజకీయాలు, అవినీతి పాలన, పెరిగిపోయిన ద్రవ్యోల్బణం, ఇంధనం కొరత మొదలైన సమస్యలతో విసిగిపోయిన ప్రజలు ప్రభుత్వంపై తిరగబడ్డారు. శ్రీలంక పాలనా వ్యవస్థపై పూర్తి ఆధిపత్యాన్ని చెలాయించిన రాజపక్స సోదరులు అధికారచ్యుతులయ్యారు. కొలంబోలో అధ్యక్ష భవనాన్ని ప్రజలు స్వాధీనం చేసుకున్న తీరు చూస్తే ఎంత బలమైన పాలకులైనా ప్రజాందోళనలతో ఎంతగా దుర్బలమవుతారో అర్థమవుతుంది. శ్రీలంక పరిణామాలను తొలుత ఉపేక్షించిన మోదీ ప్రభుత్వం సకాలంలో శ్రీలంకకు తగు ఆర్థిక సహాయమందించడం ద్వారా ఆ దేశంతో భారత్ సంబంధాలు మరింతగా దిగజారిపోకుండా నివారించగలిగింది.

నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకల్లో నెలకొన్న పరిణామాల విషయంలో భారత్‌కు ప్రత్యక్ష బాధ్యత లేదు. అయితే 2024లో మాల్దీవులతో నెలకొన్న దౌత్య ప్రతిష్టంభన పూర్తిగా నివారింపదగినది. ఆ దేశ అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు భారత్‌ను వ్యతిరేకించడం ప్రాతిపదికపైనే ఎన్నికలలో విజయం సాధించాడు. న్యూఢిల్లీకి వ్యతిరేకంగా ఆయన తీసుకున్న నిర్ణయాల పట్ల సామాజిక మాధ్యమాలలో పాలకపక్ష ప్రేరేపిత విమర్శలు వెల్లువెత్తాయి. విహారయాత్రకు మాల్దీవులకు వెళ్లవద్దని పలువురు సెలెబ్రిటీలు పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుని విదేశాంగ విధాన సంబంధిత విషయాలను రాజకీయం చేయడం భారత్‌కు తగని పని అని చెప్పక తప్పదు. ఇటీవల ప్రధాని మోదీ మాల్దీవులలో పర్యటించిన తరువాత ఉభయ దేశాల మధ్య సంబంధాలు పూర్తిగా మెరుగుపడ్డాయి. అయితే చిన్న దేశాల నిర్ణయాలకు అతిగా ప్రతిస్పందించడం శ్రేయస్కరం కాదన్న వాస్తవాన్ని గత ఏడాది మాల్దీవులతో నెలకొన్న దౌత్య ప్రతిష్టంభన స్పష్టం చేసింది.

ఇక మనకు 'నిత్య' శత్రువుగా ఉన్న పాకిస్థాన్ విషయాన్ని చూద్దాం. మన దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతునివ్వడం పాక్ ప్రభుత్వ విధానంగా ఉందనేది కొట్టివేయలేని వాస్తవం. కనుకనే పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఎటువంటి ఉగ్రదాడినైనా 'యుద్ధచర్య'గా పరిగణిస్తామని న్యూఢిల్లీ నిక్కచ్చిగా ప్రకటించవలసి వచ్చింది. పాకిస్థాన్ ఒక విఫల రాజ్యం. సైన్యం–జిహాదీ బంధనాల నుంచి ఎంతకూ బయటపడలేకపోతోంది. ఉమ్మడి ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ దక్షిణాసియా వ్యవహారాలపై మరింత ప్రభావాన్ని నెరిపేందుకు దోహదం చేసే ఒక సుసంగత, సమ్మిళిత విధానాన్ని రూపొందించుకోవడంలో న్యూఢిల్లీ విఫలమయింది. చేరువనే ఉన్న సకల దేశాలలో సంభవించే పరిణామాలను నిరంతరం గమనిస్తూ ఆ దేశాలలో తన పలుకుబడిని విస్తరించుకోవాలి. ఇరుగుపొరుగు దేశాలలో ఏ ఒక్కదానినీ ఎట్టి పరిస్థితులలోను నిర్లక్ష్యం చేయకూడదు. ప్రస్తుత అనిశ్చిత ప్రపంచ పరిస్థితులలో అటువంటి వ్యవహారశైలి భారత్ ప్రయోజనాలకు దోహదం చేయదు. ఈ రాజనీతిజ్ఞతను విస్మరించినందువల్లే నేడు నేపాల్‌లో సంభవిస్తున్న పరిణామాలకు తల్లడిల్లుతున్నాం; నిన్న బంగ్లాదేశ్, శ్రీలంకలో చోటుచేసుకున్న ఘటనలకు కలవరపడ్డాం; మరి రేపు ఏ పొరుగు దేశం నుంచి మన ప్రయోజనాలకు విఘాతం వాటిల్లనున్నదో ఎవరికి తెలుసు?

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)


భారీ వర్షంతో వరంగల్ చౌరస్తాలో స్తంభించిన ట్రాఫిక్

జోరు వాన

- వరంగల్ ఉమ్మడి జిల్లాలో కుండపోత
- ఉరుములు, మెరుపులతో వర్షం
- నగరంలో జలమయమైన రోడ్లు
- నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు


భారీ వర్షంతో వరంగల్ చౌరస్తా నుంచి అండర్ బ్రిడ్జికి వెళ్లే దారిలో పెద్దఎత్తున చేరిన వరదనీరు

హనుమకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఉమ్మడి జిల్లాలో గురువారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. ఉరుములు, మెరుపులతో కూడిన ఈ వాన.. సుమారు 50నిమిషాల పాటు విడవకుండా కురిసింది. హనుమకొండలో 50మి.మీ., వరంగల్‌లో 30మి.మీ., కాజీపేటలో 45మి.మీ. వర్షపాతం నమోదైంది. వరంగల్ నగరంలో ఒక్కసారిగా కుండపోతగా కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా హనుమకొండ, వరంగల్ బస్‌స్టేషన్లలో వరద నీరు పెద్ద ఎత్తున నిలిచింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సుల రాకపోకలకు అంతరాయం కలిగింది. హనుమకొండ కాకాజీ కాలనీ, చౌరస్తా, అలంకార్ జంక్షన్, ఎన్‌జీవోస్ కాలనీ రోడ్డు, కాజీపేట పెట్రోల్ బంక్ ప్రాంతంలో వర్షపు నీరు వరదలా ప్రవహించింది. రాకపోకలకు అంతరాయం కలిగింది. వరంగల్‌లో బస్‌స్టేషన్ ప్రాంతంలో పెద్దఎత్తున నీరు నిలిచి ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

జిల్లాల్లో..

హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలో కూడా భారీ వర్షం పడింది. ఐనవోలు, సింగారం, ఒంటిమామిడిపల్లి గ్రామాల్లో కుండపోతగా వర్షం కురిసింది. 50 మి.మీ. వర్షం కురిసింది. వరంగల్ జిల్లాలోని ఖానాపురం, పర్వతగిరి, నెక్కొండ, చెన్నారావుపేటలో 15.5 మి.మీ. వర్షం కురిసింది. ములుగు జిల్లాలో (మిగతా 6లో..)



స్కూల్ గేమ్స్‌పై నిర్లక్ష్యమేల?!

- ఇంకా ప్రారంభం కాని ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీల నిర్వహణ
- కానరాని సన్నద్ధత.. అటకెక్కిన తొలి షెడ్యూల్..
- ఎట్టకేలకు ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీల నియామకం
- మొదలుకాని మండల ఎస్‌జీఎఫ్ సెక్రటరీల నియామకం
- తాజా షెడ్యూల్‌కు మోక్షమెప్పుడు?
- ఎదురుచూస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా పాఠశాలల క్రీడాకారులు



హనుమకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) క్రీడా పోటీల నిర్వహణలో జాప్యం జరుగుతోంది. ఎస్‌జీఎఫ్ఐ తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు మొదటి, రెండో వారంలో మండల స్థాయి టోర్నమెంట్లు పూర్తి కావాలి. మూడో వారంలో జోనల్ (అంతర్‌మండల) టోర్నమెంట్స్‌తో పాటు జిల్లా టీమ్‌ల ఎంపిక జరగాలి. సెప్టెంబర్ 2వవారంలో జిల్లా స్పోర్ట్స్ జోన్ టోర్నమెంట్స్‌తో పాటు ఎంపికలు, నాలుగోవారంలో రాష్ట్ర స్థాయి జిల్లా స్పోర్ట్స్ జోన్స్ టోర్నమెంట్‌తో పాటు ఎంపికలు జరగాలి. రాష్ట్ర స్థాయి టీమ్‌ల ఎంపికలో పది ఉమ్మడి జిల్లాల స్పోర్ట్స్ జోన్స్ క్రీడాకారులు పాల్గొంటారు. ఇవి అక్టోబర్ మొదటి వారంలో జరగాలి.

అటకెక్కిన తొలి షెడ్యూల్

గత జూన్ 27న పాఠశాల విద్యా కమిషనర్ నవీన్ నికోలస్ ప్రకటించిన ఈ షెడ్యూల్ రాష్ట్రస్థాయిలో, జిల్లాల స్థాయిలో ఎస్‌జీఎఫ్‌జీ సెక్రెటరీల నియామకం జరగకపోవడంతో అటకెక్కింది. వాస్తవంగా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీల కాలపరిమితి రెండేళ్లు. ఈ యేడు మార్చినెలాఖరుతోనే ముగిసింది. ఆ వెంటనే ఏప్రిల్, లేదా మే నెలలో కొత్తవారి నియామకాల ప్రక్రియ పూర్తికావాలి. కానీ వీటిని ఆగస్టు వరకు నానబెట్టారు. 2025-26 సంవత్సరానికి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల నిర్వహణకు షెడ్యూల్ జారీ అయినా కదలిక లేదు. ఆయా జిల్లాల స్థాయిలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల నిర్వహణ బాధ్యత సెక్రెటరీలది. వారే లేకపోవడంతో జూన్‌లో జారీ అయిన షెడ్యూల్ బుట్టదాఖలైంది.

ఎట్టకేలకు..

5 నెలల తర్వాత ఎట్టకేలకు ఇటీవల నాలుగు జిల్లాలు హనుమకొండ, వరంగల్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు కొత్తగా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీల నియామకం జరిగింది. మిగతా రెండు జిల్లాలు మహబూబాబాద్, ములుగు జిల్లాలకు ప్రస్తుతం ఉన్న సెక్రెటరీల కాలపరిమితి ఇంకో యేడు ఉండడంతో వారే కొనసాగుతున్నారు. హనుమకొండ జిల్లాకు కాజీపేట మండలం తరాలపల్లి హైస్కూల్ పీడీ వెలిశెట్టి ప్రశాంత్ కుమార్, వరంగల్ జిల్లాకు సారంగపాణి, జనగామ జిల్లాకు జనగామ జిల్లా పరిషత్ బాలికల పాఠశాల పీడీ ఆడెపు శ్రీనివాస్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు జయపాల్ నియమితులయ్యారు. మహబూబాబాద్ జిల్లాకు నెల్లికుదురు మండలం మునిగలవీడు ఉన్నత పాఠశాల పీడీ గండి సత్యనారాయణ, ములుగు జిల్లాకు వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ బలుగు వేణు కొనసాగుతున్నారు.

జిల్లాతో పాటు మండల స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణకు ప్రతీ మండలానికి ఒక ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ఉంటారు. ఉమ్మడి జిల్లాలోని 75 మండలాలకు ఒక్కొక్కరు చొప్పున నియామకం కావాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఇంకా మొదలే కాలేదు. వీరి నియామకాలు పూర్తయితే తప్ప తొలుత మండల స్థాయిలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించే అవకాశం లేదు. కాగా, అండర్-19 (ఇంటర్మీడియట్ విద్య) విద్యార్థుల ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల నిర్వహణకు ఉమ్మడి జిల్లా అంతటికీ ఒక్కరే ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ఉంటారు. ఉమ్మడి జిల్లా అండర్-19 కళాశాలల ఆర్గనైజింగ్ సెక్రెటరీగా వెలిశెట్టి ప్రశాంత్ కుమారే నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం డీఈవో వాసంతి ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్ర స్థాయిలో ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ పోస్టు ఇటీవలే భర్తీ అయింది. ఐఏఎస్ అధికారిణి ఉషారాణి నియమితులయ్యారు.

కొత్త షెడ్యూల్ ఎప్పుడు?

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల నిర్వహణకు కొత్త షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదు. జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీలతో జరిగే సమావేశంలో దీనిని ఖరారు చేస్తారు. క్రీడా పోటీల నిర్వహణపై ఇటీవల జూమ్ సమావేశం మాత్రమే జరిగింది.. కానీ పూర్తిస్థాయి సన్నాహక సమావేశం జరగకపోవడంతో తాజా షెడ్యూల్ ఖరారులో జాప్యం జరుగుతోంది. సెప్టెంబర్ 2వ తేదీన హైదరాబాద్‌లో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీతో జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీల సమావేశం జరగనున్నట్లు తెలుస్తోంది. ఇందులో షెడ్యూల్ ఖరారైతే తప్ప.. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభం కావు.

ఆరు నుంచి ఇంటర్ వరకు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5800కుపైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు 250కిపైగా కేజీబీవీలు, గురుకులాలు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో పాఠశాల స్థాయిలో చదువుతున్న విద్యార్థులు అండర్ -14, అండర్ -17 విభాగంలో, ఇంటర్ విద్యార్థులు అండర్-19 విభాగంలో బాలబాలికలకు వేర్వేరుగా వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహిస్తారు. వీటితో పాటు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చదరంగం, టెన్నిస్, బాస్కెట్‌బాల్ తదితర క్రీడల్లో కూడా పోటీలు జరుగుతాయి. ఇక్కడ ప్రతిభ చాటిన విద్యార్థులు జాతీయ స్థాయి వరకు రాణించేందుకు అవకాశం ఉంటుంది. ఏ ఏ క్రీడలు ఎక్కడ నిర్వహించాలి? మండల స్థాయిలో ఎవరికి బాధ్యతలు అప్పగించాలి? నిధుల ఖర్చు తదితర అంశాలపై జిల్లా సమావేశంలో నిర్వహించి కార్యాచరణ రూపొందించాల్సి ఉండగా ఆ దిశగా అడుగులు పడకపోవడంతో బడుల్లో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల నిర్వహణకు సంబంధించిన సన్నద్ధత కనిపించడం లేదు.

సీఎం రేవంత్‌రెడ్డి రాకకు ఏర్పాట్లు

మేడారంలో హెలిప్యాడ్ సిద్ధం చేస్తున్న అధికారులు


హెలిప్యాడ్ పరిసరాల్లో చెత్తను తొలగిస్తున్న కార్మికులు

తాడ్వాయి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారానికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు గురువారం మేడారంలో హెలిప్యాడ్, పారిశుధ్య పనులు, ప్రధాన రహదారుల తాత్కాలిక మరమ్మతులు నిర్వహిస్తున్నారు. అలాగే పలు అభివృద్ధి పనులు శంకుస్థాపన శిలాఫలకాలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. కాగా, మహాజాతర ఏర్పాట్లను సీఎం స్వయంగా సందర్శించి పరిశీలిస్తారని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈ నెల 9వ తేదీన జరిగిన మేడారం మహా జాతర సమీక్షలో ప్రకటించారు. అయితే సీఎం రాకకు ఇప్పటివరకు షెడ్యూల్ ఖరారు కాలేదు.

ఏబీవీపీ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా
- పోలీసులకు, విద్యార్థులకు తోపులాట


హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ విద్యార్థులు


ఆందోళన చేస్తున్న విద్యార్థిని తీసుకువెళ్తున్న పోలీసులు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పట్టించుకోవడం లేదని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏబీవీపీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం గురువారం ఉద్రిక్తతకు దారి తీసింది. హనుమకొండ సుబేదారిలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట రెండుగంటల పాటు ముట్టడి కార్యక్రమానికి విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చి ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని (మిగతా 6లో..)



బొడ్డెమ్మ.. బొడ్డెమ్మా..

- ఓరుగల్లు పల్లెల్లో మొదలైన బొడ్డెమ్మల సందడి
- బతుకమ్మకు ముందు తొమ్మిది రోజుల వేడుక

7

రైల్వే ప్రాజెక్టులను మంజూరు చేయండి..

- కాజీపేటలో బస్టాండ్‌కు స్థలం ఇవ్వండి..
- భూపాలపల్లికి రైల్వేస్టేషన్, కొత్త లైను నిర్మించండి..
- రైల్వే బైపాస్ లైన్‌లకు ప్రత్యామ్నాయం చూపండి..
- రైల్వే అధికారులకు ఎంపీ కడియం కావ్య విజ్ఞప్తి

7

గంజాయిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలి

- జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్
- కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం


మత్తు పదార్థాల నియంత్రణకు పట్టికను ఆవిష్కరిస్తున్న అధికారులు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్ అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల వద్ద మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సులు, నమోదైన కేసులు పోలీసులు తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారులతో సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా మాట్లాడుతూ.. మత్తు పదార్థాల నియంత్రణకు పగడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు రూపొందించిన మత్తుపదార్థాల నియంత్రణకు సంబంధిచిన నినాదాల పట్టికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో హనుమకొండ, కాజీపేట, పరకాల ఏసీపీలు నర్సింహరావు, ప్రశాంత్‌రెడ్డి, సతీష్‌బాబు, టీజీఎన్‌బీ డీఎస్పీ రమేష్‌కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి గోపాల్, జిల్లా సంక్షేమాధికారి జయంతి, డాక్టర్ అనితారెడ్డి, డాక్టర్ ప్రహసిత్, డాక్టర్ ఆచార్య, వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేరళ కాన్‌క్లేవ్ సదస్సుకు మేయర్ సుధారాణి

రెండు రోజుల పాటు కొచ్చిలో జరగనున్న సదస్సు



వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో 12, 13 తేదీలలో జరుగనున్న కాన్‌క్లేవ్-2025 సదస్సుకు మేయర్ గుండు సుధారాణిని ఎంపిక చేశారు. గురువారం సాయంత్రం సుధారాణి కేరళకు బయలుదేరారు. కేరళ అర్బన్ పాలసీ - 2025-2050 లో భాగంగా 'ఆకాంక్షించే నగరాలు- అభివృద్ధి చెందు తున్న సమాజాలు' అనే అంశంపై కేరళ రాష్ట్రంలో తొలిసారిగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. కొచ్చి నగరంలోని బోల్‌గట్టి గ్రాండ్ హోటల్‌లో రెండు రోజుల పాటు జరిగే సదస్సులో దేశంలోని పలువురు మేయర్‌లు పాల్గొంటుండగా వరంగల్ నగరం నుంచి సుధారాణి పాల్గొంటున్నారు. వరంగల్ నగరంలో అమలవుతున్న పలు అభివృద్ధి పథకాలపై మేయర్ రెండురోజుల సదస్సులో ప్రసంగిస్తారు. మేయర్‌కు వరంగల్ నగరపాలక సంస్థ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

వరంగల్ మీదుగా చర్లపల్లి-అనకాపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు

గిర్మాజీపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం వరంగల్ మీదుగా చర్లపల్లి నుంచి అనకాపల్లి మధ్య ఈనెల 13 నుంచి అక్టోబరు 5 వరకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 నుంచి అక్టోబరు 4 వరకు ప్రతి శనివారం ప్రత్యేక రైలు(07035) చర్లపల్లి నుంచి అనకాపల్లికి, ఈనెల 14 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు ప్రతీ ఆదివారం ప్రత్యేక రైలు(07036) అనకాపల్లి నుంచి చర్లపల్లికి రాకపోకలు సాగిస్తాయని చెప్పారు. ఈ ప్రత్యేక రైళ్లు జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, రాయనపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, ఎలమంచిలి స్టేషన్‌లలో ఆగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రత్యేక రైళ్లలో మొదటి ఏసీ, రెండవ ఏసీ, మూడవ ఏసీ, స్లీపర్, జనరల్ కోచ్‌లు ఉంటాయన్నారు. ఈ రైళ్లను ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.



వర్షం నీటితో నిండిన హనుమకొండ బస్టాండ్ పరిసరాలు

జోరు వాన

(5వ పేజీ తరువాయి)

అత్యధికంగా 88.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. తాడ్వాయిలో భారీ వర్షం కురిసింది. 74.5 మి.మీ, కన్నాయిగూడెం, వాజేడు, ఏటూరునాగారం మండలాల్లో 64.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోనూ వర్షం జోరుగా కురిసింది. ఈ జిల్లాలోని కాటారం, మహదేవ్‌పూర్ మండలాల్లో 64.4 మి.మీ. వర్షపాతం రికార్డు అయింది. పలిమెలలో అత్యధికంగా 64.5 మి.మీ. నుంచి 115.5 మి.మీ. మధ్య వర్షం కురిసింది.



వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద భారీగా చేరిన వర్షం నీరు

యూరియా పంపిణీలో గందరగోళం

● నానో యూరియా లిక్విడ్ బాటిళ్లను పగులకొట్టిన రైతులు ● పోలీసుల రాకతో శాంతించిన అన్నదాతలు

ఐనవోలు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తిలో గురువారం చేపట్టిన యూరియా పంపిణీ గందరగోళానికి దారితీసింది. యూరియా బస్తాలకు నానో యూరియా బాటిళ్లు ముడిపెడుతున్నారని రైతులు ఆగ్రహించి బాటిళ్లను పగులకొట్టి సొసైటీ సిబ్బందిని ఘెరావ్ చేశారు. ఒక దశలో పంపిణీ కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, వ్యవసాయశాఖ అధికారుల హుటాహుటిన వెళ్లి రైతులను శాంతింపచేశారు. రైతుల కథనం ప్రకారం..

కాజీపేట దర్గా సొసైటీ పరిధిలోకి చెందిన కొండపర్తిలో ఇటీవల ఎరువుల పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, వనమాలకనపర్తి, నర్సింహులగూడెం, ముల్కలగూడెం రైతులకు యూరియా, ఎరువులను అందజేస్తున్నారు. గురువారం సొసైటీ ఎరువుల కేంద్రానికి యూరియా రాగా టోకెన్ల ద్వారా రైతులకు పంపిణీని ప్రారంభించారు. యూరియా బస్తాలతోపాటు ఇష్టం ఉన్న రైతులు నానో యూరియా బాటిళ్లను తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు. కొందరు రైతులు తీసుకోగా మరికొందరు వ్యతిరేకించారు. ఇచ్చిన వారికే మళ్లీ యూరియా బస్తాలు ఇస్తున్నారని, రాని వారికి నానో యూరియా ఇస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఒక రైతు నానో యూరియా బాటిల్‌ను పగులకొట్టాడు. మరి కొందరు ఆయనను అనుసరిస్తూ బాటిళ్లను పగులగొట్టి సొసైటీ సిబ్బందిపైకి దూసుకపోవడంతో తోపులాట జరిగింది. పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్, వ్యవసాయశాఖ ఏడీ ఆదిరెడ్డిలు హుటాహుటిన గ్రామానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి రైతులకు నచ్చచెప్పి మిగిలి ఉన్న బస్తాలను రైతులు పంపిణీ చేయించారు.

ఈ విషయంపై ఏవో సునిల్‌రెడ్డి మాట్లాడుతూ.. మొత్తం 444 బస్తాల యూరియా, 60 బాటిళ్ల నానో లిక్విడ్ యూరియాను మార్క్‌ఫెడ్ అధికారులు పంపించారని, నానో యూరియా బాటిళ్లను ఇష్టమున్న రైతులు తీసుకుంటుండగా, ఒక రైతు నానో యూరియా ఎందుకు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసి బాటిల్ పగులకొట్టాడన్నారు. ఆయనను చూసిన మరికొందరు రైతులు బాటిళ్లను పగులకొట్టడంతో గందరగోళం ఏర్పడిందన్నారు. ఎవరికి ఎక్కువ బస్తాలు ఇవ్వలేదని, పోలీసుల సమక్షంలోనే బస్తాలను సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతులు సూచించిన పద్ధతిలోనే టోకెన్లు జారీచేసి యూరియా బస్తాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఒకటి రెండు రోజుల్లో యూరియా అందుబాటులోకి వస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని కోరారు.



ఎరువుల పంపిణీ కేంద్రం వద్ద రైతులను శాంతింపజేస్తున్న సీఐ, ఎస్సై, ఏడీఏలు

భద్రకాళి దేవాలయం సుందరీకరణకు రూ.10లక్షలు

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవాలయం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి సన్నాహాలు మొదలయ్యాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆలయ ధర్మకర్తలు గాదె శ్రవణ్‌కుమార్‌రెడ్డి, మోతుక్కూరి రాము, ఓరుగంటి పూర్ణచందర్, తొనుపునూరి వీరన్నతో పాటు ఇతర ధర్మకర్తలు దాతల సహకారంతో అమ్మవారి ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్దుతున్నారు. దాదాపు రూ.10లక్షల ఖర్చుతో దేవాలయ ఆర్చీలు, గర్భాలయం, స్తంభాలు ప్రాంగణం మొత్తం వెలుగులు కనిపించేలా రాజగోపురానికి బంగారు ఛాయ రంగులతో పనులు కొనసాగుతున్నాయి. రూ.10లక్షల సహకారాన్ని దాతలు కుందూరు వినయ్ నారాయణరెడ్డి, కుందూరు ప్రణీత్‌రెడ్డి, గాదె కార్తీక్‌రెడ్డి, గుజ్జుల గోదా దిలీప్ కుమార్‌రెడ్డిలు వారి స్నేహితులతో కలిసి అమ్మవారి ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేస్తున్నారు. ఇదే కాకుండా ఇతర పనులు కూడా చేస్తున్నట్లు తెలిపారు.



ఆలయ రాజగోపురానికి రంగులు వేస్తున్న దృశ్యం

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన ఉండాలి

సైబర్ క్రైం ఏసీపీ గిరికుమార్

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, వేధింపుల పట్ల పూర్తి అవగాహన ఉండాలని వరంగల్ పోలీసు కమిషనరేట్ క్రైం ఏసీసీ గిరికుమార్ అన్నారు. గురువారం హనుమకొండ సుబేదారిలోని అసుంత భవనంలో వనం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సిస్టర్ నిర్మల ఆధ్వర్యంలో సైబర్ క్రైం అక్రమ రవాణా అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్రైం ఏసీపీ గిరి కుమార్ మాట్లాడుతూ.. డిజిటల్ యుగంలో ఇంటర్నెట్ సమాజంలో సరైన అవగాహన లేక సైబర్‌నేరాలకు గురవుతున్నారని తెలిపారు. మహిళలు నేరాలపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.

యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా ఒక హీనమైన నేరమని తెలిపారు. అక్రమ రవాణాను ఎదుర్కోవడానికి అవగాహన ముఖ్యమైన ఆయుధమని తెలిపారు. సమాజంలో మహిళలను, పిల్లలను ప్రలోభాలకు గురిచేస్తే పోలీసు 100, 1930కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎంఎం ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బత్తుల కరుణ, రీజియన్ ప్రెసిడెంట్ రుమాల్డినా ట్రెజరర్, రిజి అబ్రహం, పోలీసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న క్రైం ఏసీపీ గిరికుమార్

పీవీ విజ్ఞాన వేదిక పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

● హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

భీమదేవరపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లి మండలం వంగరలోని పీవీ విజ్ఞాన వేదిక పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. గురువారం మండలంలోని వంగర పీవీ విజ్ఞాన వేదికను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొన్ని పనులు అసంపూర్తిగా ఉండగా.. వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. గ్యాలరీలోని చెక్క పనులు, కాన్ఫరెన్స్ హాల్, ఫొటో గ్యాలరీలో విద్యుదీకరణ పనులు పూర్తిచేయాలన్నారు. అలాగే ఫొటో గ్యాలరీలో ఫొటోలు పెట్టే విధంగా చెక్క పనులను పూర్తి చేయాలన్నారు. పీవీ విజ్ఞాన వేదికలో మండల పరిషత్, ఉపాధిహామీ, పర్యాటక శాఖ ద్వారా సుమారు 3వేల మొక్కలను ఏర్పాటు చేశారు. కానీ పర్యాటకులను ఆకర్షించే విధంగా మరిన్ని మొక్కలు నాటాలన్నారు. వెంటనే ఈ పనులను పూర్తి చేయాలని పర్యాటక శాఖ డీఈ ధనరాజ్‌ను కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ రాజేష్, ఎంపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి వినయ్‌కిరణ్, ఏపీవో కుమారస్వామి, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు. ముందుగా ముల్కనూర్ బస్టాండ్‌లో జరుగుతున్న రోడ్డు వెడల్పు కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు వెడల్పులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



పీవీ విజ్ఞాన వేదికలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ఏబీవీపీ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

(5వ పేజీ తరువాయి)

డిమాండ్ చేస్తూ కొంత మంది విద్యార్థులు గేటు దూకి కార్యాలయంలోకి వెళ్లారు. సుబేదారి సీఐ ఎం.రంజిత్ కుమార్ పోలీసు సిబ్బందితో విద్యార్థులను అడ్డుకునే ప్రయత్నం చేయగా తోపులాట జరిగింది. కొంతమంది విద్యార్థులను బలవంతంగా పోలీసు సిబ్బంది రోడ్డుపైనే లాగేసి పోలీసు వాహనంలో బలవంతంగా తరలించారని విద్యార్థులు పోలీసుల తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఏబీవీపీ బాగ్ కన్వీనర్ ఆరెపల్లి సుజిత్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. విద్యార్థి ద్రోహి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వమని విమర్శించారు. సుజిత్ మాట్లాడుతూ.. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పైచదువులకు వెళ్లలేక పోతున్నారని, ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విద్యార్థులు గుర్తుకువస్తారా? అని మండిపడ్డారు. డైవర్షన్ పాలిటిక్స్ నిర్వహిస్తూ తెలంగాణ సమాజాన్ని నమ్మిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయకుండా సీఎం వద్దనే ఆ శాఖ కేటాయించుకొని విద్యార్థుల సమస్యలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకుంటే సీఎంను, మంత్రులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కన్వీనర్ దూళిపూడి హరిచరణ్, వరంగల్ మహానగర కార్యదర్శి బెల్లం కార్తీక్, రోహిత్, రాహుల్, నవీన్, త్రినేష్, అభిలాష్, శ్రీశాంత్ పాల్గొన్నారు.

ఎంజీఎం పిల్లలవార్డు వద్ద మృతశిశువు

● మార్చురీకి తరలించిన పోలీసులు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంజీఎంలోని పిల్లలవార్డు వద్ద అప్పుడే పుట్టిన మగ శిశువు మృతదేహాన్ని గురువారం సాయంత్రం కనుగొన్నారు. నెలలు నిండక ముందే పుట్టడం వల్ల శిశువు పురిట్లోనే మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతశిశువును తల్లిదండ్రులు ఆస్పత్రిలోని పీడియాట్రిక్ వార్డు సమీపంలోని తుప్పల మధ్య వదిలేసి వెళ్లిపోయారు. ఆస్పత్రి వైద్య సిబ్బంది సమాచారం ఇవ్వడంతో పోలీసులు శిశువు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని మార్చురీకి తరలించారు. శిశువు తల్లిదండ్రులు ఎవరో కనుగొనేందుకు విచారణ జరుపుతున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. శిశువు తల్లిదండ్రులు సూర్యాపేట జిల్లా తిరుమలగిరి గ్రామమని తెలిసింది. వారిని పిలిపించి మృతదేహాన్ని అప్పగించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

నేలకొరిగిన విప్లవ పాఠాల 'గురువు'!

చత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మోడెం బాలకృష్ణ మృతి
మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడిగా కార్యకలాపాలు
రాజకీయ తరగతులు చెప్పడంలో దిట్ట
స్వగ్రామం మడికొండలో విషాదఛాయలు



మడికొండలో బాలకృష్ణ నివాసం

కాజీపేట/మడికొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌గఢ్‌లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ జిల్లా మడికొండ వాస్తవ్యుడు, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, చత్తస్‌ఘడ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న మోడెం బాలకృష్ణ (60) మృతి చెందాడు. మోడెం బాలకృష్ణ అలియాస్ మనోజ్ అలియాస్ చంద్రహాస్ అలియాస్ పాండు అలియాస్ ప్రమోద్‌గా పలు పేర్లతో ఉద్యమంలో అలుపెరగని ప్రజాఉద్యమాలు చేసినట్లు మాజీ మావోయిస్టు నేతలు గుర్తుచేసుకుంటున్నారు. బాలకృష్ణ పుట్టింది హనుమకొండ జిల్లా మడికొండ గ్రామం. ఆయన ఆరోతరగతి వరకు ఇక్కడే చదువుకున్నాడు. తండ్రి మోడెం వెంకటేశ్వర్లు పోస్టల్ ఉద్యోగి కావడంతో బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లి కుటుంబంతో సహా అక్కడే స్థిరపడ్డారు. మోడెం వెంకటేశ్వర్లు, మల్లికాంబ దంపతులకునలుగురు కుమారులు కాగా, పెద్దకుమారుడు లక్ష్మీనారాయణ కన్‌స్ట్రక్షన్ వ్యాపారంలో స్థిరపడగా రెండో కుమారుడు మావోయిస్టు అగ్రనేత మోడెం బాలకృష్ణ డిగ్రీ వరకు చదువుకుని ఉద్యమబాట పట్టి అజ్ఞాతంలోకి వెళ్లాడు. మూడో కుమారుడు ప్రభాకర్ అడ్వకేట్, నాలుగో కుమారుడు సుధాకర్ వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది. వీరికి సొంత ఇల్లు ఇప్పటికీ మడికొండలో ఉంది. బాలకృష్ణ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడన్న వార్త తెలియడంతో వారి కుటుంబీకులు, మిత్రులు ఆయనను జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు.

జైల్లోనే ఉద్యమం

బాలకృష్ణ 18 ఏళ్ల వయస్సులోనే హైదరాబాద్ నుంచి ఉద్యమం బాటపట్టి అజ్ఞాతంలోకి వెళ్లారు. ఈయనకు ఉద్యమంలోనే వివాహమైంది. ఆమె పేరు సంధ్య అని తెలుస్తోంది. ఉద్యమ ప్రస్థానం అంతా చత్తీస్‌గఢ్‌లో సాగినప్పటికీ 1993లో కర్నూలులో ఓ కోవర్ట్ ఇచ్చిన సమాచారంతో అరెస్ట్ అయి చర్లపల్లిలో జైలు జీవితం గడిపారు. అప్పటికే అరెస్ట్ అయి చర్లపల్లి జైల్లో జైలు జీవితం గడుపుతున్న మావోయిస్టు అగ్రనేతలు శాఖమూరి అప్పారావు, పటేల్ సుధాకర్ రెడ్డితో కలిసి జైల్లో ఖైదీల సమస్యలపై జంగ్ సైరన్ పేరుతో పెద్దఎత్తున ఉద్యమం చేపట్టారు. రాష్ట్ర పోలీస్‌వర్గాలకు కొరకరాని నేతగా బాలకృష్ణ తయారయ్యాడు. జైలు నుంచి బయటకు 1998లో వచ్చి మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిన బాలకృష్ణ.. ప్రాణాలు వదిలిపెట్టే వరకు ఉద్యమాన్ని వీడలేదు. ఆయన అడవిలో మావోయిస్టులకు రాజకీయ తరగతులు చెప్పడంలో నేర్పరి అని తెలుస్తోంది. బాలకృష్ణకు వయస్సు మీదపడటం ఓ సమస్య అయితే.. అనారోగ్యం మరో పెద్ద సమస్యగా మారింది. చివరి దశలో కూడా ఉద్యమాల తరగతులు చెపుతూనే గురువారం జరి గిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు సమాచారం.



ఘటనాస్థలంలో బాలకృష్ణ మృతదేహం, బాలకృష్ణ (ఫైల్)

గుండెపోటుతో తమిళనాడు ప్రయాణికురాలి మృతి

ఉత్తర భారత యాత్ర పూర్తిచేసుకుని రైలులో వెళ్తుండగా ఘటన

గిర్మాజీపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులతో కలిసి ఉత్తర భారత యాత్ర పూర్తి చేసుకుని తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలులో ఇంటికి తిరిగి వెళ్తూ ఓ వృద్ధురాలు గుండెపోటుతో మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి వరంగల్ రైల్వేస్టేషన్‌లో జరిగింది. వరంగల్ జీఆర్‌పీ సీఐ సురేందర్ గురువారం విలేకరులకు తెలిపి న ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా హరూర్ కంబైనల్లూరు పట్టణానికి చెందిన కలైమగల్ తండపాణి(64) అనే వృద్ధురాలు తన కూతురు గోమతి వెంకటరమనన్, బావ జయప్రకాష్‌లతో కలిసి ఉత్తర భారత యాత్రకు వెళ్లింది. యాత్ర పూర్తి చేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి న్యూఢిల్లీ నుంచి తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో చైన్నైకి బయలుదేరింది. రైలు వరంగల్‌కు రాకముందే బుధవారం రాత్రి 7.30 గంటలకు కలైమగల్ తండపాణికి ఛాతిలో నొప్పి రావడంతో విలవిల లాడింది.

వెంట ఉన్న కుటుంబ సభ్యుల సమాచారం మేరకు రైలులోని టికెట్ కలెక్టర్ రైల్వే కంట్రోల్ ద్వారా వరంగల్ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌కు సమాచారం ఇచ్చారు. సూపరింటెండెంట్ సమాచారం మేరకు జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ రాజు 108 అంబులెన్స్‌ను ప్లాట్‌ఫారమ్-1 చేరువలో సిద్ధంగా ఉంచారు. రాత్రి 7.49 గంటలకు వరంగల్ చేరుకున్న తమిళనాడు ఎక్స్‌ప్రెస్ నుంచి తండపాణిని 108 సిబ్బంది ప్లాట్‌ఫారమ్‌పైకి చేర్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అదేరోజు రాత్రి మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించి గురువారం పోస్టుమార్టం అనంతరం వెంట ఉన్న కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, ఆమె గుండెపోటుతో మృతి చెందినట్లుగా తెలుస్తుందని ఆయన పేర్కొన్నారు.



కలైమగల్ తండపాణి(ఫైల్)

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి



వరంగల్ క్రైం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ హోంగార్డ్స్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మేడ భిక్షపతి గురువారం అనారోగ్యంతో మరణించాడు. ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన భిక్షపతి.. 1992లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరాడు. కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చేరి గురువారం మరణించినట్లు భిక్షపతి సహచరులు వెల్లడించారు. కాగా, భిక్షపతి ఇద్దరు కూమార్తెలు, కుమారుడు ఉన్నాడు. ఆయన మృతిపట్ల హోంగార్డ్స్ కార్యాలయ సిబ్బందితోపాటు పోలీస్ అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. జులైవాడలోని ఓ ఇంటిలో గురువారం కొందరు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సుబేదారి పోలీసులు పేకాట శిబిరంపై దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,04.000 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఈ చర్యలో ముఖ్యపాత్ర పోషించిన సుబేదారి ఎస్సై రామారావు, క్రైం కానిస్టేబుల్ మారెపల్లి ప్రభాకర్, కానిస్టేబుళ్ల అఖిల్, ప్రమోద్‌లను సీఐ అభినందించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7545	5300
మక్కలు	2221	1521
కందులు	5522	3022
పెసళ్లు	5952	3022
పల్లికాయ (సూక)	7000	3500
పల్లికాయ (పచ్చిది)	3800	2400
పసుపు (కాడి)	10668	7889
పసుపు (గోల)	10209	8996
తేజ మిర్చి	12500	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16000	12000
యూఎస్341ఏసీ	14600	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

ఉజ్వల భవిష్యత్‌కు వినూత్న కోర్సులు

- ప్రైవేట్‌కు దీటుగా కొత్త బ్రాంచీలు
- రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాలతో ముందుకు..
- కేయూలో విద్యా సంస్కరణలు
- వర్సిటీ అకడమిక్ ఆడిట్ డీన్ ప్రొఫెసర్ గుగులోత్ హన్మంతు





కేయూ క్యాంపస్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు కేయూ పకడ్బందీగా ముందుకు సాగుతోంది. విద్యా విషయాలపై నిర్దిష్టమైన ప్రణాళికలతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో రాబోయే రోజుల్లో విద్యార్థులను సిద్ధం చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా సైన్స్, ఇంజనీరంగ్‌తో పాటు సోషల్‌సైన్స్ రంగాల్లో వస్తున్న విప్లవాత్మక విద్య మార్పులను స్వాగతిస్తోంది. మార్పులను అనుగుణంగా విద్యా రంగాల నిపుణులతో కలిసి వర్సిటీని మరింత ముందుకు తీసుకువేళ్ళేందుకు సిద్ధమవుతోంది. కాకతీయ యూనివర్సిటీ స్వర్ణోత్సవాల సంబురాల వేళ కొత్త కోర్సులను ప్రవేశపెడుతోంది. విద్యారంగంలో కాకతీయ యూనివర్సి టీ మైలురాయిని అందుకుని దీటుగా వెళుతోంది. కాకతీయ యూనివర్సిటీలో విద్యరంగ అంశాలను మానటరింగ్ చేస్తూ మార్పులను అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టడంతో పాటు బోధనలో నాణ్యతను పెంచేందుకు కేయూ అకాడమిక్ ఆడిట్ డీన్ కార్యాలయం నిరంతరం సమీక్షించి పనిచేస్తోంది.

2000లో అకడమిక్ ఆడిట్ డీన్ ఏర్పాటు

కాకతీయ యూనివర్సిటీలో అకాడమిక్ అఫైర్స్‌ను సమీక్షించి పరిశీలించి దిశా నిర్దేశం చేసేందుకు 2000ల సంవత్సరంలో మార్చిలో 77వ ఈసీ నిర్ణయం మేరకు కేయూలో డీన్ కార్యాలయాలన్ని ఏర్పాటు చేశారు. మొదటి డీన్‌గా కేయూ ఫార్మసీ ప్రొఫెసర్ వి. మల్లారెడ్డి నియామితులయ్యారు. విద్యా విషయాలను కో ఆర్డినేట్ చేస్తోంది. డీన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌తో పాటు అఫీస్ సిబ్బందిని కేటాయించారు.

కేయూలో వినూత్న కోర్సులివే..

కేయూలో బీఏ, బీఈడీ ఇంటిగ్రేటెడ్, ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ బీబీఏ, బీబీఎం కోర్సులను నడుస్తున్నాయి. అలాగే డేటా సైన్స్, న్యూట్రిషియన్స్, ఫారెన్సు, అగ్రికల్చర్ బెస్ట్ కోర్సులను డిగ్రీ స్థాయిలో ప్రవేశపె ట్టారు. బాటనీ, కెమిస్ట్రీ, అగ్రికల్చర్ సైన్స్ కోర్సులను ప్రవేశపెట్టారు. బీఏ బీఈడీ కోర్సులను మంచిర్యాల లక్సెట్టిపేటలో ప్రవేశపెట్టారు. బీఎస్సీ కోర్సుల్లోనూ విభిన్న కాంబినేషన్స్‌లో విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా కోర్సులను ప్రవేశపెట్టారు. డేటాసైన్స్, డైట్ టిక్స్ కోర్సులకు అనుమతించారు.

కళాశాలలకు ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం

కేయూ అకాడమిక్ అడిట్ డీన్ వర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలలో డిగ్రీ, పీజీ, ఫార్మసీ, ఎడ్యుకేషన్, లా, ఎంబీఏ, ఎంసీఏ, ఇంజనీరింగ్ కళాశాలలకు ఎప్పటికప్పుడూ అల్మానాక్ విడుదల చేసి పాఠ్యాంశాల బోధన, పరీక్షల టైం టేబుల్ నిర్ణయించి సరైన దిశా నిర్దేశం చేస్తోంది. వర్సిటీ అకాడమిక్ స్టాండింగ్, అకాడమిక్ సెనేట్‌లకు సభ్యులకుగాను పనిచేస్తారు. కళాశాల నుంచి వర్సిటీ చెల్లించాల్సిన ఫీజులను డిమాండ్ నోటీసులు ఇచ్చి వసూళ్ళు చేస్తోంది. నిర్ణీత సమయంలో ఫీజులు చెల్లించని కళాశాలల పెనాల్టీలను విధిస్తోంది. నామినల్ రూల్స్‌ను తయారు చేస్తోంది. కళాశాలల్లో లైబ్రరీలు, ఇతర మౌళిక సదుపాయాలను ఎప్పటికప్పుడూ పరిశీలిస్తోంది. సదుపాయాలతో ఏమైన లోటుపాట్లుంటే వెంటనే నోటీసులు జారీ చేసి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తోడ్పాటును అందిస్తోంది.

వర్సిటీ పరిధిలో కళాశాలల తనిఖీలు

కేయూ పరిధిలోని డిగ్రీ, పీజీలతో పాటు అన్ని అనుబంధ కళాశాల గుర్తింపును కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ కార్యాలయం అధికారులతో కలిసి అకాడమిక్ డీన్ కార్యాలయం ఇస్తోంది. కళాశాల వర్సిటీ నిర్దేశాలకు అనుగుణంగా పనిచేయకపోతే రద్దు చేసే అధికారం కలిగి ఉంటుంది. కళాశాల అధ్యాపకుల వివరాలను, అటెండెన్స్, అకాడమిక్ అడ్మినిస్ట్రేష న్‌ను తనిఖీ చేస్తోంది. క్లాస్ జరగడం లేదని, టీచర్స్ లేని కళాశాలలపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటారు.

కేయూ పరిధిలో కళాశాలల వివరాలు

కేయూ పరిధిలో యూజీ స్థాయిలో డిగ్రీ కళాశాలలు 290 ఉండగా పీజీ కళాశాలలు 74 ఉన్నాయి. అలాగే 6 ఇంజనీరింగ్ కళాశాలలు, 25 ఫార్మసీ, 41 ఎడ్యుకేషన్, 3 ఫిజికల్ ఎడ్యుకేషన్, 3 న్యాయ కళాశాలలు, 24 ఎంబీఏ, 7 ఎంసీఏ, 3 హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలున్నాయి. 1.65 లక్షల మంది డిగ్రీ, 12 మంది పీజీ, 2 వేల మంది ఇంజనీరంగ్ 8 వేల మంది బీఈడీ విద్యార్థులు, 600 మంది ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులు, 24 వందాల మంది న్యాయ శాస్త్ర విద్యార్థులున్నారు. వీరితో పాటు 7500 మంది ఎంబీఏ, 200 మంది ఎంసీఏ, 300 మంది హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు చదివే విద్యార్థులున్నారు. ఏటేటా 2 లక్షల మంది విద్యార్థులు కేయూ పరిధిలో విద్యనభ్యసిస్తున్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

ప్రొఫెసర్ జీ హన్మంతు, డీన్, అకడమిక్ ఆడిట్



వర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపుకోసం పకడ్బందీగా వ్యవరిస్తున్నాం. డిగ్రీ, పీజీ, ఇతర ప్రొఫెషనల్స్ కళాశాలల్లో ఎప్పటికప్పుడూ విద్య ప్రమాణాలు పెంపుకోసం అప్రమత్తం చేస్తాం. కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో మాట్లాడి అకాడమిక్ కరిక్యూలమ్‌ను రూపొందిస్తాం. సిలబస్ బోధన పూర్తైన వెంటనే విద్యా ర్థులకు పరీక్షల షెడ్యూల్ రూపొందిస్తాం. విద్యా అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశాల మేరకు కొత్త కోర్సుల ఏర్పాటుకు అనుమతిస్తాం. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం మార్కెట్‌కు అనువైన సరైన కోర్సులు వర్సిటీ పరిధిలో అనుమతిస్తాం.



సీఎం రేవంత్ రెడ్డితో కలిసి రైల్వే ప్రాజెక్టులపై సమీక్షలో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య

రైల్వే ప్రాజెక్టులను మంజూరు చేయండి

- కాజీపేటలో బస్టాండ్‌కు స్థలం ఇవ్వండి
- భూపాలపల్లికి రైల్వేస్టేషన్, కొత్త లైన్ నిర్మించండి
- రైల్వే బైపాస్ లైన్లకు ప్రత్యామ్నాయం చూపండి
- రైల్వే అధికారులకు ఎంపీ కావ్య విజ్ఞప్తి

హనుమకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌కు సంబంధించిన రైల్వే ప్రాజెక్టులన్నిటినీ మంజూరు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య రైల్వేశాఖ ఉన్నతాధికారులను కోరారు. గురువారం హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రైల్వే ప్రాజెక్టు పురోగతిని పర్యవేక్షించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో డాక్టర్ కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్‌కు సంబంధించి రైల్వే సమస్యలను డాక్టర్ కావ్య ప్రస్తావించారు. కాజీపేటలో రైల్వేకు సంబంధించిన స్థలం బస్‌స్టాండ్ నిర్మాణానికి కేటాయిస్తే దానికి బదులుగా మరోచోట స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని తెలియజేశారు. ప్రజలు, రైల్వే ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మల్టీమోడల్ బస్టాండ్ నిర్మాణానికి సహకరించాలని ఎంపీ కోరారు. రైల్వేశాఖ మంత్రి దీనికి సంబంధించిన ఆదేశాలను కూడా జోనల్ అధికారులకు అందజేశామని వెల్లడించారు.

భూపాలపల్లికి కొత్త రైల్వే స్టేషన్, రైల్వేలైన్ మంజూరు గురించి కూడా ఎంపీ ప్రస్తావించారు. భూపాలపల్లి సింగరేణి కాలరీస్, టీజీజెన్‌కో నుంచి బొగ్గు రవాణా చేయడానికి ట్రక్కులపై ఆధారపడుతున్నదన్నారు. రైల్వే లైన్ మంజూరైతే రోడ్డు ప్రమాదాలు, కాలుష్యం, సరుకు రవాణా ఖర్చులు తగ్గుతాయని, ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని, ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని తెలిపారు. అదే విధంగా కాజీపేటను రైల్వే డివిజన్ చేస్తే రాష్ట్రంలోని రెండో అతిపెద్ద నగరం వరంగల్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రాజెక్టులు ప్రయాణం, వాణిజ్యరంగాన్ని మరింత అభివృద్ధి చేస్తుందన్నారు. ఉద్యోగ కల్పన, వ్యాపార వృద్ధి, వరంగల్ కీలకమైన కనెక్టివిటీ హబ్‌గా ఉంటుందని స్పష్టం చేశారు. కాజీపేట డివిజన్ ఏర్పాటుతో రైల్వేకు అత్యధిక రెవెన్యూ అందించబడుతుందని పేర్కొన్నారు.

నూతన రైల్వే బైపాస్ లైన్ల విషయాన్ని కూడా ఎంపీ ప్రస్తావించారు. నష్కల్ నుంచి వరంగల్ నగరానికి రెండు రైల్వే బైపాస్ లైన్లు, ఒకటి నష్కల్ నుంచి చింతలపల్లి వరకు, రెండు నష్కల్ నుంచి హసన్‌పర్తి వరకు రైల్వేశాఖ ప్రతిపాదనలు చేసిందని గుర్తు చేశారు. ఓఆర్ఆర్ నిర్మాణం కారణంగా ఇప్పటికే రైతులు నష్టపోయారని అన్నారు. మరో సారి ఈ రైల్వే లైన్ల కారణంగా రైతులు మరిన్ని భూములు కోల్పోయి వ్యవసాయం చిన్నాభిన్నం కానుందన్నారు. ట్రయాంగిల్ రైల్వే విధానంతో వరంగల్ నగర అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. అక్కడి రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో అలైన్‌మెంట్ మార్చి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. ఇప్పటికే పలుమార్లు ఈ సమస్యల పరిష్కారానికి కేంద్ర మంత్రులను, అధికారులను కలిశామని వెల్లడించారు.

ఈ సమీక్షా సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణారావు, ట్రాన్స్‌పోర్టు అండ్ బిల్డింగ్స్ స్పెషల్ సెక్రటరీ వికాస్‌రాజ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, ఫైనాన్స్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవతో పాటు పలు విభాగాల ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

గుండెపోటుతో విద్యార్థి మృతి

- నయింనగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఘటన
- ఆందోళన నిర్వహించిన విద్యార్థి సంఘాలు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు



మృతి చెందిన జయంత్ వర్ధన్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాల మైదానంలో వ్యాయామం చేసి తరగతి గదిలోకి వెళుతున్న క్రమంలో గుండెపోటుకు గురైన పదోతరగతి విద్యార్థి పోలెపల్లి జయంత్‌వర్ధన్ (15) స్పృహ తప్పి కింద పడిపోయి మరణించాడు. ఈ సంఘటన గురువారం హనుమకొండ నయింనగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. విద్యారణ్యపురిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు రవి చిన్న కుమారుడు జయంత్‌వర్ధన్ నయింనగర్‌లోని ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. రోజూలాగే పాఠశాలకు వచ్చిన విద్యార్థి.. ఫిజికల్ ట్రైనింగ్ పీరియడ్‌లో భాగంగా గ్రౌండ్‌కు వచ్చాడు. ట్రైనర్ సమక్షంలో మిగతా విద్యార్థులతో కలిసి వ్యాయామం చేశాడు. అనంతరం గ్రౌండ్‌లో వరుసక్రమంలో నిల్చుంటున్న క్రమంలో గుండెపోటుకు గురై స్పృహ కోల్పోయి కిందపడిపోయాడు. మూర్ఛగా భావించిన పాఠశాల సిబ్బంది.. బాలుడి తండ్రి రవికి సమాచారం అందజేసి సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే విద్యార్థి మృతిచెందినట్లుగా వైద్యులు వెల్లడించారు.

కాగా, విషయం తెలుసుకున్న విద్యార్థిసంఘాలు పాఠశాల వద్దకు చేరుకున్నాయి. యాజమాన్యం నిర్లక్ష్యంగా కారణంగానే విద్యార్థి మృతి చెందాడని పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. విద్యార్థి ఆయాసపడుతుంటే పట్టించుకోకుండా బలవంతంగా వ్యాయామం చేయించారని ఆరోపించారు. విద్యార్థి చెవి నుంచి రక్తస్రావం జరిగినట్లుగా కనబడుతోందని, దానిపై విచారణ చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డీఈవో, కలెక్టర్‌ను కోరారు. ఇదిలా వుండగా, పాఠశాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హనుమకొండ సీఐ శివకుమార్ ఆధ్వర్యంలో ఎస్సైలు సతీష్, పరుశురాములు, సదానందం, ఏఎస్సై రఘునాథ్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు. కాగా, తన కుమారుడిని ఆస్పత్రికి తరలించడంలో పాఠశాల యాజమాన్యం జాప్యం చేయడం వల్లనే మరణించాడని మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డీఈవో కార్యాలయం వద్ద ధర్నా

వరంగల్ ఎడ్యుకేషన్: విద్యార్థి మృతికి కారణమైన ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ డీఈవో కార్యాలయం ముందు ఏబీఎస్ఎఫ్, స్వేరోస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బొట్ల నరేశ్, శనిగరపు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. మృతుడి కుటుంబానికి రూ.10లక్షల పరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని అధికారులను కోరారు.

బొడ్డెమ్మా.. బొడ్డెమ్మా..

- ఓరుగల్లు పల్లెల్లో మొదలైన బొడ్డెమ్మల సందడి
- బతుకమ్మకు ముందు తొమ్మిది రోజుల వేడుక

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతానికే తలమానికంగా బాసిల్లుతూ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్న సాంస్కృతిక పర్వం బతుకమ్మ. ఆ బతుకమ్మ పర్వానికి కచ్చితంగా తొమ్మిది రోజుల ముందు గ్రామీణ ప్రాంతాల్లో ప్రారంభమయ్యే వేడుకే బొడ్డెమ్మల పర్వం. భాద్రపద బహుళ పంచమి అయిన గురువారం నుంచి బొడ్డెమ్మల పర్వానికి శ్రీకారం చుట్టారు. ఆధునికత ఎంత పెరిగినా పట్టణ ప్రాంతాలు సహా ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తుండడం విశేషం. బొడ్డెమ్మలు మహాలయ అమావాస్య వరకు అంటే బతుకమ్మ పండగ తొలినాటి వరకు జరుపుకొని బొడ్డెమ్మలను నిమజ్జనం చేసి బతుకమ్మలకు శ్రీకారం చుడుతారు. పెళ్లిగాని యువతులు, పిల్లలు వారితో పాటు ముత్తైదువలు బతుకమ్మ పర్వానికి ఎంతో ప్రాధాన్యమిస్తారో ఈ బొడ్డెమ్మకు కూడా అదే ప్రాధాన్యంతో ఆడుకోవడం విశేషం.

బొడ్డెమ్మ అంటే..

బొడ్డెమ్మ అంటే ధాన్యరాశి, ధాన్యపు కుప్ప అని వాడుకలో ఉంది. బొడ్డెమ్మను పుట్ట మట్టితో అందంగా పేర్చి చెక్కపీటపై చతురస్రాకారంగా ఐదు దొంతరలుగా పేర్చి ఒకదానిపై ఒకటి త్రిభుజాకారంగా పేరుస్తారు. బొడ్డెమ్మను ఉద్రాక్ష, కాకర, కట్ల, బీర, మల్లి, జాజిపూలతో అలంకరిస్తారు. ఆ తరువాత శిఖర ప్రదేశాన బియ్యంతో నిండిన చిన్న కలశం, కొత్త వస్త్రం పెడతారు. తమలపాకు, పసుపు గౌరమ్మను ఉంచుతారు. సాయంకాలం ఇంటి ముందు అలికి ముగ్గులు పెట్టి ఒక్కోవాడకు ఒక్కరి చొప్పున అన్నట్లుగా గ్రామీణ ప్రాంతాల్లో బొడ్డెమ్మను నిలుపుతారు. ఇరుగు పొరుగు వారు, కన్నెపిల్లలు వచ్చి చప్పట్లు కొడుతూ బొడ్డెమ్మ చుట్టూ తిరుగుతూ పాటల పాడుతారు. బతుకమ్మ పాటల మాదిరిగా బొడ్డెమ్మా.. బొడ్డెమ్మా వలలో.. బిడ్డాలెందరో వలలో.. అంటూ బొడ్డెమ్మల పాటలు కూడా ప్రత్యేకంగా పాడుకుంటారు. తొమ్మిది రోజుల పాటు బొడ్డెమ్మను ఆడుకొని అమావాస్యకు ముందురోజు బొడ్డెమ్మను నిద్రబుచ్చి నీటిలో నిమజ్జనం చేయడం ఆనవాయితీ.

తొమ్మిది రోజులు.. ఆటపాటలు

తొమ్మిది రోజులు ఆటపాటల అనంతరం బొడ్డెమ్మను అందంగా అలంకరించి రాగి చెంబులో పోసిన బియ్యం, పప్పు, బెల్లం దినుసులను నైవేద్యంగా తయారు చేసి అందరికి ప్రసాదంగా పంచి చెరువులు, కుంటలు, బావుల్లో గాని బొడ్డెమ్మను నిమజ్జనం చేస్తారు. బొడ్డెమ్మ నిమజ్జనం ముగిసిన మరుసటి రోజు నుంచి బతుకమ్మ ప్రారంభమవుతుంది.

ఉమ్మడి జిల్లాలో..

వరంగల్ ఉమ్మడి జిల్లాలోని దాదాపు అన్ని గ్రామీణ ప్రాంతాల్లో బొడ్డెమ్మల సాంస్కృతిక పర్వం ప్రారంభమైంది. హనుమకొండ రాగన్న దర్వాజలో కూడా ప్రతియేటా ఆనవాయితీగా మాదిరిగా రజక సంఘం ఆధ్వర్యంలో బొడ్డెమ్మల వేడుకకు శ్రీకారం చుట్టారు. నగరాల్లోనూ అనేక చోట్ల బొడ్డెమ్మలకు శ్రీకారం చుట్టారు. ప్రాచీన సంస్కృతికి నిదర్శనంగా ఈ వేడుకలు జరుపుకోవడం తెలంగాణ ప్రాంతానికే ప్రత్యేకం. అందునా ప్రత్యేకించి వరంగల్ జిల్లా బతుకమ్మ, బొడ్డెమ్మ ఆటలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండడం విశేషం.



బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు

ప్రాచీన పండుగకు ప్రభుత్వ ఆదరణేదీ ?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం ప్రాచీన పండుగలకు గుర్తింపు ఇచ్చిన ప్రభుత్వం బొడ్డెమ్మ పండుగను గుర్తించకపోవడం వలన పల్లెల్లో పండుగ ప్రాబల్యం తగ్గిపోతోంది. శాస్త్రీయంగా సైన్స్ పరంగా జరుపుకునే వేడుకల్లో బొడ్డెమ్మ ఒకటి. బొడ్డెమ్మ పండుగను ప్రభుత్వం గుర్తించి గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లో ప్రోత్సహించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రీ ప్రైమరీ టీచర్ పోస్టులపై గందరగోళం

- అర్హతల ప్రాతిపదికపై అయోమయం
- నోటిఫికేషన్‌లో పీపీటీ కోర్సు మాత్రమే ప్రస్తావన
- గడువు ముగిశాక స్థానికతపై మెలిక
- విద్యా శాఖ నుంచి స్పష్టత కరువు



హనుమకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక (ప్రీస్కూల్) తరగతులకు తాత్కాలిక ప్రాతిపదికపై ఇన్‌స్ట్రక్టర్ (టీచర్), ఆయాల నియామకం ప్రక్రియ గందరగోళంగా మారింది. పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రకటనలో ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు కనీసం ఇంటర్ ఉత్తీర్ణతతో పాటు ప్రీ ప్రైమరీ బోధనకు సంబంధించిన ట్రైనింగ్/సర్టిఫికెట్ (మాంటిస్సోరీ, ఈసీసీఈ లేదా తత్సమానమైన కోర్సు) సర్టిఫికెట్ దాఖలు చేయాలని పేర్కొన్నారు. దీంతో అర్హత గల అభ్యర్థులందరు వాటిని సమర్పించారు. దరఖాస్తుల దాఖలు ఈనెల 2వ తేదీన ముగిసింది. హనుమకొండ జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో 45 ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, 45 ఆయా పోస్టులకు గాను మొత్తం 1313 మంది దరఖాస్తు చేసుకున్నారు.

అయితే ఇన్‌స్ట్రక్టర్ అర్హతల ప్రాతిపదిక విషయంలో రకరకాల ప్రచారాలు సాగుతున్నాయి. నోటిఫికేషన్‌లో పీపీటీ సర్టిఫికెట్ లేదా తత్సమాన అర్హత ఉండాలని పేర్కొనగా, తాజాగా డి.ఎడ్ కూడా ఉండాలని ఆయా హెచ్ఎంలు చెబుతున్నట్టు అభ్యర్థులు వెల్లడిస్తున్నారు. దీంతో ప్రీప్రైమరీ కోర్సు మాత్రమే చేసి, దరఖాస్తు చేసిన వారు అయోమయం చెందుతున్నారు. వాస్తవానికి ప్రీ స్కూల్ తరగతులకు పీపీటీ సర్టిఫికెట్ సరిపోతుందని, ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు వారే అర్హులని, నోటిఫికేషన్‌లో కూడా అదే ఉందని విద్యానిపుణులు చెబుతున్నారు. డీ.ఎడ్, బీ.ఎడ్ చేసిన వారు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హులైనందున వాటిని పరిగణనలోకి తీసుకోరని అంటున్నారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులు స్పష్టతనివ్వాల్సి ఉంది.

ఇదిలావుండగా, ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు దరఖాస్తు గడువు ముగిసిన తర్వాత తాజాగా స్థానికత (లోకల్) సర్టిఫికెట్లను సమర్పించాలని చెబుతుండటంతో అభ్యర్థులు అయోమయానికి లోనవుతున్నారు. అధికారులు అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలిస్తున్న క్రమంలో దరఖాస్తుదారులు స్థానికులేనని నిర్ధారణకు రావడం ఎలా అన్న సందేహం వచ్చింది. ఎంపిక ఒకే నివాసం, ఒకే గ్రామ పంచాయతీ, ఒకే మండలం, ఒకే జిల్లావారికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు గానీ, నిర్దిష్టంగా లోకల్ సర్టిఫికెట్ సమర్పించాలని ఎక్కడా పేర్కొనలేదు. దీంతో దరఖాస్తుదారులెవరూ లోకల్ సర్టిఫికెట్ దాఖలు చేయలేదు. దరఖాస్తుదారు ప్రీ ప్రైమరీ స్కూల్ ఉన్న ప్రాంత పరిధి వారేనా.. అన్నది నిర్ధారించడానికి లోకల్ సర్టిఫికెట్ సమర్పించాలన్న నిబంధన తాజాగా విధించారు. సంబంధిత ఎంఈవోలతో సమావేశమైన డీఈవోలు దరఖాస్తుదారుల నుంచి ఈ సర్టిఫికెట్ తీసుకోవాల్సిందిగా తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు ఈ నెల 15 తేదీ వరకు గడువు విధించారు. అయితే ఈ కొత్త నిబంధన గురించి చాలా మంది దరఖాస్తుదారులకు తెలియదు. సర్టిఫికెట్ దాఖలు చేయాలని అధికారులు పత్రికా ప్రకటన కూడా చేయలేదు. ప్రధానోపాధ్యాయులు దరఖాస్తుదారు లకు స్వయంగా ఫోన్లు చేసి, వ్యక్తిగతంగా సమాచారం అందజేసి సర్టిఫికెట్లను సేకరిస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

ఎంపిక కమిటీ

ప్రీ ప్రైమరీ తరగతుల ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల ఎంపిక ప్రక్రియను కలెక్టర్ అధ్యక్షతన ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ చేపడుతుంది. ఈ కమిటీలో కలెక్టర్‌తో పాటు అడిషనల్ కలెక్టర్, డీఈవో, సీడీపీవో సభ్యులుగా ఉంటారు. ఎంపికలో స్థానికతకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. స్థానిక అభ్యర్థి లేని పక్షంలో సమీప ప్రాంతాలకు చెందిన వారిని ఎంపిక చేస్తారు. హనుమకొండ జిల్లాలో 45 ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు ఉండగా, ఒక్కో పోస్టుకు సగటున 45 దరఖాస్తులు వచ్చాయి. ఇక ఆయా (హెల్పర్) పోస్టుల పట్ల ఎవరూ అంతగా ఆసక్తి చూపినట్లు లేదు. ఒక్కో పోస్టుకు 3 నుంచి 4 దరఖాస్తులే వచ్చాయి. వేతనం మరీ నెలకు రూ. 6 వేలే ఉండడంతో ఎక్కువ మంది ముందుకు రానట్లు తెలిసింది.

యూరియా అందక పంట పశువులకు..

ఖానాపురం మండలంలో ఓ రైతు ఆవేదన



గొల్లగూడెంతండాలో పంటను మేస్తున్న గొర్రెలు

ఖానాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యూరియా దొరకక అన్నదాత అరిగోస పడుతున్నాడు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు సంమృద్ధిగా కురిసి వాతావరణం అనుకూలించడంతో దండిగా పంటలు పండించుకుని నాలుగు రాళ్లు వెనకేసుకుందామనుకున్న రైతుల ఆశలను యూరియా కొరత అడియాసలు చేస్తోంది. వరి, మొక్కజొన్న పంటలను సాగుచేసిన రైతులకు రెండునెలలుగా రాత్రింబవళ్లు క్యూ లైన్లలో బారులు తీరినప్పటికీ యూరియా దొరకడంలేదు. అదనుకు యూరియా దొరకపోవడంతో పంటలు ఎర్రబడిపోతున్నాయి. చేసేదేమీలేక రైతన్నలు కన్నీటి పర్యంతమవుతున్నారు. లక్షల పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంట యూరియా దొరకక ఎదుగూబొదుగూ లేకపోవడంతో పశువులకు, గొర్రెలకు మేతగా మార్చుతున్నారు.

ఈ క్రమంలో ఖానాపురం మండలంలోని గొల్లగూడెంతండాకు చెందిన తేజావత్ శ్రీను.. తనకున్న 5 ఎకరాలు భూమిలో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. ఇంతలోనే యూరియా కష్టాలు మొదలయ్యాయి. దీంతో రెండు నెలలుగా యూరియా కోసం భగీరథ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. కానీ, ఎక్కడా అతడికి ఒకటి, రెండు బస్తాలకు మించి దొరక లేదు. వేసిన పంట అదను దాటిపోతున్నది. దీంతో అతడు తన వద్దనున్న యూరియాను కేవలం ఎకరాకు మాత్రమే వినియోగించుకున్నాడు. దీంతో మిగిలిన 4 ఎకరాలకు యూరియా వేయకపోవడంతో చేనంతా ఎదుగుదల లేకుండా ఎర్రబారిపోయింది. నిశ్చేష్టుడైన రైతు.. గురువారం తన 4 ఎకరాల మొక్కజొన్న పంటలో గొర్రెల మందను మేపాడు. ఇదేవిధమైన పరిస్థితుల్లో అనేకమంది రైతులు ఉన్నారు. ఇలాంటి సంఘటనలు యూరియా కష్టాలకు అద్దం పడుతున్నాయి.

సాగు కోసం రూ. 5 లక్షల అప్పు చేశా :

తేజావత్ శ్రీను, రైతు



ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేయడానికి రూ.5లక్షల అప్పు చేశాను. ఒక ఎకరాకే యూరియా అందింది. నాలుగు ఎకరాలకు యూరియా దొరకకపోవడంతో మొక్కజొన్న పెరగలేదు. అంతా ఎండుముఖం పట్టింది. పీచు మాత్రమే తొడింది. గింజ రాలేదు. దీంతో చేసేదేమీ లేక గొర్రెల మందను మేపాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

పులిపిరికి అరుదైన చికిత్స

- ఆకు పసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

వరంగల్ జిల్లా, సెప్టెంబరు 12: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. శుక్ర, శనివారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లలోని సంప్రదించాలన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల న్యాయబద్ధమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమనేని జగన్మోహన్‌రావు కోరారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లోని టీజీవోభవన్‌లో ఉద్యోగ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలను చేసినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ సబ్ కమిటీలో జరిగిన చర్చలలో త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఒక వేళ ప్రభుత్వం నాన్చివేత ధోరణి అవలంబిస్తే టీజీఈ జేఏసీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఉద్యోగులందరూ జేఏసీ చేపట్టే ఆందోళనల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో టీజీవో అసోసియేషన్ కమిటీ సభ్యులు, నూతనంగా ఎన్నికైన సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

గ్రూప్-1 అంశంపై సీఎం బాధ్యత వహించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్
- విద్యార్థుల ఆందోళన.. అడ్డుకున్న పోలీసులు



కేయూ వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న టీఆర్ఎస్వీ నేతలు ప్రశాంత్, సుమన్ తదితరులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 పరీక్షలపై సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని, టీజీపీఎస్సీ పక్షాళనతోనే అభ్యర్థులకు సరైన న్యాయం జరుగుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్ అన్నారు. గురువారం కేయూ క్యాంపస్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మతో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అనంతరం మొదటి గేటు వద్ద ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన చేపట్టారు. పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రికత్త ఏర్పడింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడారు. సీఎం నోరు ఎందుకు విప్పడం లేదన్నారు. గ్రూప్-1 అవకతవకలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలుగు మీడియం అభ్యర్థులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, సహాయ కార్యదర్శి బీరెడ్డి జస్వంత్, జిల్లా కమిటీ సభ్యుడు చెన్నూరి సాయికుమార్, పవన్‌కుమార్, మల్లేశ్, రాహుల్, రణదీప్, రాజ్‌కుమార్, సందీప్, వినయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులతో ప్రభుత్వం చెలగాటం

నిరుద్యోగులతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని కేయూ టీఆర్ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ ధ్వజమెత్తారు. గురువారం గ్రూప్-1పై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని టీఆర్ఎస్వీ నేతృత్వంలో నిరసన ఆందోళన చేపట్టారు. కేయూ మొదటి గేటు వద్ద ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. పోలీసులు అడ్డుకుని కేయూ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడారు. గ్రూప్-1 నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. టీజీపీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నేతలు జెట్టి రాజేందర్, మాచర్ల శరత్‌చంద్ర, కలకోట సుమన్, గండ్రకోట రాకేశ్ యాదవ్, గొల్లపల్లి వీరాస్వామి, కొరపల్లి రాజేశ్, రాసూరి రాజేశ్, బుర్ర మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పును ప్రభుత్వం అమలు చేయాలి

హనుమకొండ టౌన్: గ్రూప్-1 పరీక్ష విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ముష్కె రాము ప్రభుత్వాన్ని గురువారం ప్రకటనలో డిమాండ్‌చేశారు. టీజీపీఎస్సీ నిర్లక్ష్యం వల్ల గ్రూప్-1 అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, పరీక్ష నిర్వహణలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. అభ్యర్థులందరికీ న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. టీజీపీఎస్సీ పరీక్ష నిర్వహణలో విఫలమైందని బాధ్యత వహించి చైర్మన్, సభ్యులు వెంటనే రాజీనామాలు చేయాలని పేర్కొన్నారు. గ్రూప్-1 పరీక్షను రద్దు చేసి ప్రస్తుతం ఉన్న 563 పోస్టులను పెంచుతూ వేయిపోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని, లేకుంటే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని, గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్వీ పోరాటం చేస్తుందని పేర్కొన్నారు.



ఏనుమాములలోని ఈవీఎంలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ఈవీఎం గోదాముల తనిఖీ

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మూడు నెలలకోసారి నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఏనుమాముల మార్కెట్ యార్డులోని గోదాములో ఈవీఎంలను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ గురువారం తనిఖీ చేశారు. సంబంధించిన రికార్డులను పరిశీలించి సీసీ కెమెరాల పర్యవేక్షణలో భద్రతా చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వరంగల్ పశ్చిమ, పరకాల అసెంబ్లీ నియోజకవర్గాలు, లోక్‌సభ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలను భద్రపర్చిన గోదామును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రమేష్ రాథోడ్, డాక్టర్ నారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్‌సింగ్, హనుమకొండ, పరకాల తహసీల్దార్లు రవీందర్‌రెడ్డి, విజయలక్ష్మి, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ శ్రీనివాసరావు, శ్యాంసుందర్, రజినీకాంత్, సయ్యద్, ఫైజుల్లా తదితరులు పాల్గొన్నారు.

లంబాడీలు అన్ని రంగాల్లో రాణించాలి

నాయక్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సాంబయ్య నాయక్



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న సాంబయ్య నాయక్

వడ్డెపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : లంబాడీలు స్వయంకృషితో ఎదిగి విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించాలని నాయక్ పార్టీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ధరావత్ సాంబయ్య నాయక్ పిలుపు నిచ్చారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లంబాడీ, ఆరె, ఎరుకల కేరళ భాషలకు సంబంధించిన లిపిని తాను రూపొందించానని వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించాలని కోరారు. మైదాన ప్రాంతంలో ప్రత్యేక ఐటీడీఏలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సద్గురు సంత్ సేవాలాల్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కోరారు. గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో గోర్ సేవా సమితి హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి సపావత్ మహేందర్ నాయక్, నాయక్ పార్టీ జిల్లా నాయకులు గుగులోత్ నవీన్, బోడ ప్రకాష్, భూక్య తరుణ్, ధరావత్ నర్సింహ, బానోత్ అరవింద్ నాయకులు పాల్గొన్నారు.

గోవర్ధన్‌రెడ్డికి డాక్టరేట్



కేయూ క్యాంపస్ సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పరిశోధకుడు కొత్త గోవర్ధన్‌రెడ్డి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి బి.శ్రీనివాస్ డాక్టరేట్ ప్రకటించారు. 'అడ్మినిస్ట్రేటివ్ రెస్పన్స్ టూ సైక్లోన్స్ ఇన్ శ్రీకాకుళం డిస్ట్రిక్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు గోవర్ధన్‌రెడ్డికి డాక్టరేట్ ప్రకటించారు. మహబుబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడెంకు చెందిన గోవర్ధన్‌రెడ్డి అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ప్రొఫెసర్ ఎ.వెంకట్రాం నర్సింహారెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. జాతీయ స్థాయిలో 4 పరిశోధన పత్రాలను ప్రచురించారు. డాక్టరేట్ సాధించిన గోవర్ధన్‌రెడ్డిని పలువురు అభినందించారు.

ఎమ్మెల్యేను కలిసిన టీఎన్జీవో నాయకులు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న టీఎన్జీవో నాయకులు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీఎన్జీవో నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. ఉద్యోగ సంఘాలకు రికగ్నైజేషన్ ఇస్తూ ఉద్యోగ సంఘాలతో కలిపి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేస్తూ జీవో నంబర్ 185 ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పింగిళి కళాశాల విభావరి విడుదల

వడ్డెపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లి పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విభావరి (న్యూస్ లేటర్) మాస పత్రికను గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బత్తిని చంద్రమౌళి గౌడ్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ సురేష్‌బాబు, జ్యోతిర్మయి, సారంగపాణి, రాజిరెడ్డి, సమత, రామిరెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు బంక సరళ, నాయిని లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నగదు రహిత లావాదేవీలపై మొగ్గు చూపాలి

గ్రామీణాభివృద్ధి సంస్థ డీఆర్‌డీవో మేన శ్రీను



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో మేన శ్రీను

హసన్‌పర్తి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగదు రహిత లావాదేవీలపై మహిళలు మొగ్గు చూపాలని హనుమకొండ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డీఆర్‌డీవో మేన శ్రీను అన్నారు. మండల కేంద్రంలోని టీటీడీసీ సంస్కృతి విహార్‌లోని శాంతి మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం మండల మహిళా సంఘ సభ్యులకు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా సంఘ సభ్యులనుద్దేశించి మాట్లాడుతూ.. బ్యాంకులోను చెల్లింపులలో నగదు రహిత లావాదేవీలు సులభతరం చేయడానికి మహిళా సంఘాలకు డిజిటల్ అక్షరాస్యతను ప్రోత్సహించడం కోసం మండల సిబ్బంది, గ్రామ సంఘాల ప్రతినిధులకు మండల స్థాయిలో శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీలు నగదు రహిత లావాదేవీలు ఏవిధంగా నిర్వహించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు డీఆర్‌డీవో బొజ్జ వెంకటేశ్వర్లు, ఎల్‌డీఎం బ్యాంకు లింకేజీ డీపీఎం అనిత, మండల సమాఖ్య అధ్యక్షురాలు పిట్టల స్వప్న, ఏపీఎం దాసరి నారాయణ, కమ్యూనిటీ కోఆర్డినేటర్ అనురాధ పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటాలి

కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రం, ప్రిన్సిపాల్ మనోహర్ తదితరులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం కోరారు. గురువారం కేయూ క్రీడామైదానంలో వర్సిటీ ఇంటర్ కాలేజీయేట్ టోర్నమెంట్లు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్ అధ్యక్షతన జరిగిన క్రీడలను టాస్ వేసి రిజిస్ట్రార్ రామచంద్రం ప్రారంభించారు. అనంతరం క్రీడావిద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల డిగ్రీ, పీజీ విద్యార్థుల ఇంటర్ కాలేజియేట్ క్రీడల్లో విద్యార్థులు బాగా రాణించి వర్సిటీ పేరును నిలుపాలని అన్నారు. కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తాళ్ళపల్లి మనోహర్ మాట్లాడుతూ.. 11న గురువారం క్వార్టర్ ఫైనల్, 12న సెమీఫైనల్, ఫైనల్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందచేస్తామని అన్నారు. వర్సిటీ పరిధిలో 22 జట్లు క్రీడల్లో పాల్గొంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య, డాక్టర్ బి.కుమారస్వామి, ఎస్.కిరణ్‌కుమార్, సుమన్, కిషన్, బుచ్చయ్యపాషా, సోమన్న క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం నగరంలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని హనుమకొండ చౌరస్తా, కాకాజీ కాలనీ, అశోక జంక్షన్, కాంగ్రెస్ భవన్, టైలర్ స్ట్రీట్, జేఎన్ఎస్ స్టేడియం, కేడీసీ కళాశాల ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు, కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఈద్గా, కుమార్‌పల్లి, కొత్తూర్ ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు.

నేడు పాఠశాలలో

అభివృద్ధి పనులు ప్రారంభం

హసన్‌పర్తి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి జెడ్పీఎస్ఎస్ పాఠశాల పూర్వ విద్యార్థి, ఐపీఎస్ చెన్నూరి రూపేష్ దత్తత పాఠశాలలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వివిధ అభివృద్ధిపనులను ప్రారంభించనున్నారు. హసన్‌పర్తికి చెందిన ఐపీఎస్ రూపేష్ తాను చదువుకున్న ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకున్నారు. మహర్షి ఫౌండేషన్ ద్వారా దాతల నుంచి సేకరించిన రూ.42 లక్షల నిధులతో కాలేజీ ఆడిటోరియం, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్‌ను నిర్మించారు. పూర్తైన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాన్ని కలెక్టర్ స్నేహ శబరీష్, ఎమ్మెల్యే నాగరాజు, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పాఠశాల ఆవరణలో జరిగే సమావేశానికి గ్రామస్థులు, యువకులు, పూర్వ విద్యార్థులు హాజరై దాతలను ప్రోత్సహించి ప్రభుత్వ విద్యా సంస్థల పటిష్ఠతకు సహకరించాలని ఐపీఎస్ రూపేష్ తెలిపారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 65వ డివిజన్ పరిధి దేవన్నపేటకు చెందిన మాజీ సర్పంచ్ చుంచు రవి తండ్రి రామచంద్రయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ దేవన్నపేటలోని వారి స్వగృహానికి చేరుకొని మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా రామచంద్రయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన వెంట వనంరెడ్డి, తదితరులున్నారు.

వేయిస్తంభాల ఆలయ పెయింటింగ్



ఆలయ చిత్రం గీస్తున్న లావణ్య

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయాన్ని చూస్తూ ఓ విద్యార్థిని కుంచెతో అద్భుతంగా చిత్రం గీసింది. యాదాద్రి జిల్లా భువనగిరిలో డిగ్రీ చదువుతున్న విద్యార్థిని నామోజు లావణ్య.. రెండేళ్లుగా ఇలాంటి లైవ్ పెయింటింగ్ ప్రారంభించింది. ఈ క్రమంలో స్వర్ణగిరి, భద్రాచల రామాలయం, హైదరాబాద్‌లోని చార్మినార్, ఖైరతాబాద్ గణేషుడి చిత్రాలను అద్భుతంగా గీసి సంబంధిత అధికారులకు అందజేసి ప్రశంసలందుకుంది. గురువారం వేయిస్తంభాల ఆలయంలో గీసిన చిత్రాన్ని పురావస్తుశాఖ అధికారులకు అందించింది.

ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎన్‌సీసీ నూతన గ్రూపు కేడెట్లను ఎంపిక చేశారు. ఇంజనీరింగ్ మొదటి ఏడాది చదువుతున్న విద్యార్థులను ఎన్‌సీసీ 8వ బెటాలియన్ సుబేదార్ కె.రమణరావు పర్యవేక్షణలో ఎంపికలు నిర్వహించారు. 100కు పైగా విద్యార్థులకు ఎంపిక పరీక్షలు నిర్వహించారు. తుదిగా 35 మందిని ఎంపిక చేసి మరో 15 మందిని రిజర్వ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిక్షాలు, ఎన్‌సీసీ యూనిట్ కేర్ టేకర్ వై.యశస్విని, అధ్యాపకులు, సూపరింటెండెంట్ బి.వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 33ను సవరించాలి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత విద్యార్థులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగాలంటే జీవో 33ను సవరణ చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ నీట్ పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యేను కలిసి తెలంగాణలో చదివిన వారికి లోకల్ క్యాడర్ కింద ఎంబీబీఎస్ సీట్లలో అవకాశం కల్పించాలని వారు ఎమ్మెల్యేను కోరగా ఈ విషయంపై జీవో రూపకల్పన కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నీట్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లోజు సత్యనారాయణ చారి, సభ్యులు రావుల మధు, గోలి సత్యనారాయణ, ఆకుల భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా

యూరియా పంపిణీ చేయాలి

రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రావు



వ్యవసాయ శాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న కిషన్‌రావు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో యూరియా పంపిణీని పారదర్శకంగా చేపట్టాలని డీఏవో రవీందర్ సింగ్‌కు గురువారం తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు వినతిపత్రం అందజేశారు. రైతులకు తగినన్ని యూరియా వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమన్వయంతో అవసరమైన యూరియాను జిల్లా రైతులకు పంపిణీ చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ జరిపించాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నయీంనగర్‌లో పదో తరగతి చదువుతున్న పి.జయంత్‌వర్ధన్ మృతిపై విచారణ జరిపించాలని జాతీయ మాల మహానాడు హనుమకొండ జిల్లా యూత్ అధ్యక్షుడు గరిగె అనిల్ డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యం ఒత్తిడి వల్లనే విద్యార్థి మృతి చెందాడని ఆరోపించారు. పాఠశాల గుర్తింపును రద్దుచేసి బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కాజీపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాజీపేట చౌరస్తాలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. భవన నిర్మాణ కార్మికుల కోసం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం సత్వరమే నిర్ణయం తీసుకోవడం ప్రశంసనీయమన్నారు. నాయకులు సిరిల్ లారెన్స్, జాక్సన్, రఫిక్, సారంగపాణి, శేషాద్రి, సురేశ్ పాల్గొన్నారు.

కేయూలో సర్క్యూట్ బ్రేకర్స్ ఏర్పాటు

రాంనగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్ట్యా కేయూ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు రూ.15లక్షలతో ఏర్పాటు చేసిన రెండు 33 కేవీ సర్క్యూట్ బ్రేకర్స్‌ను టీజీ ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ టి.మధుసూదన్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ పి.మధుసూదన్, డీఈ సాంబరెడ్డి, ఎంఆర్‌టీ డీఈ కె.దర్శన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే..

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. శ్రీనివాసరావు



హనుమంతరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టి. శ్రీనివాసరావు, సీపీఐ శ్రేణులు

మడికొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. గురువారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా కాజీపేట మండలం రాంపూర్‌లో సీపీఐ కాజీపేట మండల సమితి ఆధ్వర్యంలో సీపీఐ నేత అర్షనపల్లి హనుమంతరావు స్థూపం వద్ద వార్షికోత్సవ సభను నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని ట్యాంకు బండ్‌పై సాయుధపోరాట యోధుల విగ్రహాలు పెడతామని, పాఠ్యపుస్తకాల్లో సాయుధపోరాట యోధుల చరిత్రను చేర్చుతామని చెప్పిన హామీలను ప్రభుత్వం ఎందుకు నెరవేర్చడంలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర, జిల్లా నాయకులు నేదునూరి జ్యోతి, ఆదరి శ్రీనివాస్, మద్దెల ఎల్లేష్, స్టాలిన్, తోట బిక్షపతి, మునిగాల బిక్షపతి, మాలోత్ శంకర్, వేల్పుల సారంగపాణి, అలువాల రాజు, లకావత్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సహజయోగ

ఏకాదశ రుద్రశక్తులు

మహా విష్ణువు దశావతారాల్లో కల్కి అవతారం ఆఖరిది అనీ, సదాశివుడి పదకొండు రుద్ర శక్తులతోనే ఈ కల్కి అవతారం రాబోతున్నదనీ, ఆ అవతారమే దుష్ట శక్తులను, దైవ వ్యతిరేక కార్యాలు చేసేవారని సంహరిస్తుందనీ ప్రాచీన పురాణ గ్రంథాలు వివరించాయి. భౌతిక స్థాయిలో ఆ ఏకాదశ రుద్రశక్తులు మన అంతర్గత సూక్ష్మ నాడీ వ్యవస్థలో... నుదుటి మధ్య భాగంలో ఉన్న ఆజ్ఞా చక్రం పైభాగంలో స్థిరపడి ఉంటాయి. సృష్టి పరిణామ క్రమంలో మానవుల నుదుటి భాగం సృష్టి అంత సులువుగా జరగలేదు. ఎంతో ప్రత్యేకమైన, సుదీర్ఘమైన ఆధ్యాత్మిక ప్రక్రియ ద్వారా ఇది సంభవించింది. దీనిలో ఎంతో లోతైన అంతరార్థం ఉంది.



ప్రకృతిలో కాలానుగుణంగా అన్నీ సరైన రీతిలో సక్రమంగా జరుగుతాయి. ఇదంతా అందంగా జరిగే నిరంతర ప్రక్రియ. కానీ మనిషి అనాలోచితమైన మూర్ఖ విధానాలతో ప్రకృతికి భంగం కలుగుతుంది. ప్రకృతిని నాశనం చేసే దుష్ట శక్తులను ఏకాదశ రుద్రులు నాశనం చేస్తారు. ప్రస్తుత కాలంలో మానవులు భ్రాంతి, భ్రమలకు లోనై జీవిస్తున్నారు. కార్యాచరణలో విఫలమైనప్పుడు... తమకంటే ఇతరులు గొప్పగా ఉన్నారని భావిస్తారు. వేరొకరితో పోల్చుకొని, వారితో సరితూగలేకపోతున్నామనే వ్యథ, అసూయ, కోపోద్రేకాల వల్ల నిగ్రహం కోల్పోతారు. ఆ స్వభావం పెరిగి పెద్దదై... భగవత్ వ్యతిరేక శక్తిగా మారుతుంది. ఇలాంటి శక్తులు బలపడి, మానవులకు అర్థం కాని రీతిలో చాలా సూక్ష్మంగా పని చేస్తాయి. వైరస్‌లా అనుక్షణం వినాశనం సాగిస్తూ ఉంటాయి. మరి మనం ఏం చేయ్యాలి? ఆత్మ సాక్షాత్కారం ద్వారా దైవికంగా పొందిన చైతన్య తరంగాలతో ప్రకృతిని మీరు రక్షించగలరు. ఆత్మ సాక్షాత్కారం పొందిన తరువాత మనలోనే ఉన్న ఏకాదశ రుద్రశక్తులు ఎలా పనిచేస్తాయనేది తెలుస్తుంది. కానీ ఈ శక్తిని మనలో పెంపొందించుకోవడానికి ముందు... మనం నిర్మాణాత్మక స్థితి వైపు వెళ్తున్నామా? లేక వినాశనం వైపు వెళ్తున్నామా? అనే విషయాన్ని మనం ఆత్మ విమర్శ చేసుకోవాలి.

నేటి ప్రపంచంలో ఎన్నో చెడ్డ విషయాలు, ప్రలోభాలు మనలో దుష్ట స్వభావాన్ని ప్రేరేపించి తప్పులు చేయిస్తున్నాయి. మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి. ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నాయి. మనలో ఉన్న ఏకాదశ రుద్రశక్తిని జాగృత పరుచుకోవడమే దీనికి పరిష్కారం.. ఆత్మసాక్షాత్కారం ద్వారా మనలోని కుండలినీ శక్తి జాగృతమైనప్పుడు... ఆ ఏకాదశ రుద్ర శక్తులు నుదుటిపైన, శిరస్సు చుట్టూ నిలబడి మనల్ని కాపాడతాయి. సహజయోగ సాధన ద్వారా మనలోని ఆ శక్తులను జాగృతం చేసుకోవడం ద్వారా... దుష్ట శక్తుల ప్రభావం మన మీద పడకుండా జాగ్రత్త పడవచ్చు.



డాక్టర్ పి. రాకేష్,
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ


విశేషం



కృతజ్ఞతా పక్షం...

మహాలయం

బిడ్డలు పుట్టాలని తల్లితండ్రులు గుళ్ళూ, గోపురాలు తిరుగుతారు, ఎత్తైన కొండలు ఎక్కి దేవతలకు మొక్కుకుంటారు. వారి ఋణం తీర్చుకోవడం మన ధర్మం. అలాగే మనం, మన కుటుంబం అధ్వాన్న స్థితిలో ఉన్నప్పుడు ఆపన్న హస్తాన్ని అందించి, ఒక స్థాయికి చేరుకోవడానికి దోహదం చేసినవారికి, తిట్టి, అవసరమైతే కొట్టి.. నాలుగు అక్షరాలు మనకు ఒంటపట్టేలా చేసి, నాలుగు రాళ్ళు సంపాదించుకోవడానికి మార్గం వేసిన దైవసమానులైన గురువులకు, మన బంధువులకు... ఇలా ఏదో విధంగా మనకు సాయం చేసినవారందరికీ కృతజ్ఞతలు సమర్పించుకోవాల్సిందే. అలా చేయని పక్షంలో మనం కృతఘ్నులం. మనం ధర్మాన్ని నిర్వర్తించుకోవడానికే పెద్దలు ఏడాదిలో అయిదుసార్లు వారిని స్మరించుకొనే ఏర్పాటు చేశారు.



అయిదు విధానాలు

వ్యక్తి మరణించిన ప్రతి 'అబ్ద' కాలానికి (సంవత్సర కాలానికి, అలా ప్రతి సంవత్సరం) వారికి కృతజ్ఞతలు ప్రకటించుకొనే విధానాన్ని 'ప్రత్యాబ్దికం' (ప్రతి+ఆబ్దికం) అన్నారు. ఇక జీవనది ప్రవహిస్తూ ఉండే ప్రదేశానికి వెళ్ళినప్పుడు... మన పెద్దలను గుర్తు చేసుకుంటూ ఆచరించే ఇదే విధానాన్ని 'తీర్థ శ్రాద్ధం' అంటారు. గయ లాంటి తీర్థ ప్రదేశాలకు వెళ్ళినప్పుడు చేసేది అదే. వీటితోపాటు మకర సంక్రమణం (ఉత్తరాయణం... జనవరి పద్నాలుగు/పదిహేను), కర్కాటక సంక్రమణం (దక్షిణాయనం... జూలై పదహారు/పదిహేడు) రాగానే... ఆ రోజుల్లో నిర్వహించుకొనే ఇదే కృతజ్ఞతా సమర్పణ కార్యక్రమాన్ని 'సంక్రమణ శ్రాద్ధం' అంటారు. అందుకే సంక్రాంతి మరుసటి రోజైన కనుము (కనుమ అనకూడదు) నాడు 'పెద్దలకు పెట్టుబడులు' అనే కార్యక్రమాన్ని నిర్దేశించారు. అందుకే 'కనుము రోజున కాకైనా కదలదు' అంటూ ప్రయాణాలు పెట్టుకోవద్దన్నారు. ఇక ఆశ్వయుజ మాసంలో లక్ష్మీదేవి పుట్టిన అమావాస్య నాడు పెద్దల కోసం శ్రాద్ధ కార్యక్రమం నిర్వహించుకొనే విధానం కూడా ఉంది. ఇది తెలియని వారికి, మరచిపోయినవారికి 'లక్ష్మీ పూజనాడు తద్దినమా?' అనిపిస్తుంది. వీటికి అదనంగా భాద్రపద మాసంలో పౌర్ణమికి మరుసటి రోజు నుంచి 15 పాటు కూడా పెద్దలకు కృతజ్ఞతలను సమర్పించుకోవడం అనే గొప్ప పద్ధతి మనకు ఉంది. దాన్ని 'మహాలయ పక్షం' అంటారు. ఆ కాలంలో ఆచరించేది మహాలయ శ్రాద్ధం.

ఎలా చేయాలి?

ఆదౌ పితా తథా మాతా సాపత్నీ జననీ తథా... తండ్రి, తాత, ముత్తాత, తల్లి, ఆమె అత్త, ఆమెకు అత్తా... ఇలా బంధుగణంలో మరణించినవారు ఎవరెవరు ఉన్నారో వారి పేర్లను ఉచ్చరిస్తూ, వారు మనకు చేసిన సహాయాలను గుర్తు చేసుకుంటూ ఒక్కొక్క పిండాన్ని సమర్పించాలి. వారితోపాటు మనకు చేయూత అందించినవారికి, గురువులకు, చివరిగా భీష్మ పితామహులకు, ఈ వ్యవస్థను మనకోసం ఏర్పాటు చేసిన ఆదిశంకరులకు కూడా పిండ నివేదన చేయాలి. శరీర ఆరోగ్యం లేని వారు స్వయంపాకాన్ని ఇవ్వవచ్చు. రెండోది... బియ్యపు పిండితో పిండాలను చేసి సమర్పించవచ్చు. మూడోది శాస్త్రోక్తంగా... అన్నశ్రాద్ధాన్ని ఆచరించాలి. ఆబ్దికం నాడు చేసే వంటకాలతో ఆ కార్యక్రమాన్ని చేయించిన వారికి భోజనం పెట్టాలి. అలాగే ఏవో పనులు ఉన్నాయని ఈ కార్యక్రమాన్ని పొద్దున్నే ముగించేయకూడదు. పితృదేవతలది 'అపర-అహ్న' (అపరహ్న) కాలం (రోజులో రెండవ సగం... అంటే మధ్యాహ్నం పన్నెండు దాటాక). కాబట్టి అప్పుడే పెట్టాలి. "మహాలయాన్ని ఆచరించడం మాకు కష్టం" అనుకోవద్దు. మీకు జ్వరమో, ఆపదో వచ్చినప్పుడు మీ తల్లితండ్రులు మాకు కుదరదని అనుకోలేదు కదా? అలాగే... 'మనం ఇక్కడ ఉండి చేసినవి మన పితృదేవతలకు చేరుతాయా?' అనే సందేహం కూడా వద్దు. "విదేశాల్లో ఉన్నవారికి భారతీయ రూపాయల్లో పంపుతాం. వారికి అది రూపాయిల్లో చేరదు... ఆ దేశపు కరెన్సీలో చేరుతుంది. ఇదీ అంతే!" అని కంచి పరమాచార్యులవారు ఒక సందర్భంలో చెప్పారు.

దీనివల్ల ఏం లాభం?

'ఇలా చేయడం వల్ల లాభం ఏమిటి?' అని కొందరు అనుకుంటారు. 'పితృశాపాలు' అనే మాట మనం వింటూ ఉంటాం. గతించి, పైలోకాలకు వెళ్ళిన వారు అక్కడినుంచి మన మీద కసి, పగ, ద్వేషం లాంటివి చూపించరు. కాబట్టి 'పితృశాపం' అంటే పితృదేవతలు పెట్టే శాపం కాదు. మన తాతో, ముత్తాతో ఎవరికో ఘోరమైన అపచారం చేసినా, ఎవరి దగ్గరైనా ఋణాన్ని తీసుకొని దాన్ని తిరిగి ఇవ్వకపోయినా... అది వారితో చెల్లిపోదట. ఆ వంశంలో అందరికీ... వారి ఆస్తి సంక్రమించినట్టు... ఇది కూడా సంక్రమిస్తూనే ఉంటుందట. అందుకే అన్నీ ఉండి సంతానం లేకపోవడం, ఎప్పుడూ ఏదో అనారోగ్యంతో ఉండడం, ఏదీ కలిసిరాకపోవడం, బుద్ధిహీనత, జడత్వం, మూర్ఖ లాంటి వాటితో బాధపడుతూ... ఆనందానికి దూరమవుతారు. దానికి సరైన పరిష్కారం మహాలయ శ్రాద్ధాన్ని పెట్టడమేనని పెద్దలు చెప్పారు. తమ వారసులకు ఏయే కోరికలు అపరిష్కృతంగా ఉన్నాయో వాటిని తీర్చి వెళ్ళాలనే ఉద్దేశంతో... పితృదేవతల ఆత్మ సూక్ష్మ శరీరంతో ఈ పదిహేను రోజులపాటు భూలోకానికి ప్రత్యేకంగా వస్తారు. కనిపించని ఆ ఆత్మ శరీరాలకు మనం కనిపిస్తాం. వారు చేసిన సహాయాలను కృతజ్ఞతాపూర్వకంగా స్మరించుకుంటూ... ఒక్క రోజు వారికి కేటాయించగలిగితే వాళ్ళు పరమానందాన్ని పొందుతారు. మన కడగండ్లను తీర్చి మరీ పై లోకానికి తిరిగి వెళతారు. కాబట్టి ఈ పదిహేను రోజుల కాలం ఎంతో శ్రేష్ఠం, మరెంతో ముఖ్యం.

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు

సద్బోధ

దేవునికైనా అసాధ్యమే

వర్ధమాన మహావీరుడు అహింసామూర్తి. ఆయన ప్రభావం పశుపక్షాదుల మీద కూడా ఉండేది. ఆయన వెళ్ళిన ప్రాంతంలో పరిసరాల్లో ప్రశాంతత ఏర్పడేది. నదుల్లో నీరు తాగడానికి వచ్చిన పులులు, సింహాలు, గోవులు, జింకలు పక్కపక్కనే సంచరించేవి. మహావీరుడి సామీప్యం క్రూర జంతువులను సైతం సాధుజంతువులుగా మార్చేది. జంతువులు, జనులు అక్కడ నిర్భయంగా సంచరించగలిగేవారు.

విచిత్రం ఏమిటంటే... ఎంతటి మహనీయులైనా ఎన్నో ఏళ్ళుగా తమ చుట్టూ ఉన్న కొందరిలో ఏర్పడిన అసూయా ద్వేషాలను, కామ క్రోధాలను రూపు మాపలేరు. వారిలో ఆశలను, కోరికలను నిర్మూలించలేరు. మహావీరుడి చరిత్రలోనూ ఇలాంటి ఉదంతం కనిపిస్తుంది. ఆయనకు జమాలి అనే అల్లుడు ఉండేవాడు.

జమాలి ఆయన శిష్యుడు కూడా. మహావీరుడి వారసుడయ్యే హక్కు తనకే ఉందని జమాలి భావించేవాడు. మహావీరుడికి ఎందరో శిష్యులు ఉండేవారు. వారిలో రాజులు కూడా ఉన్నారు. కాబట్టి మహావీరుడి ఆధ్యాత్మిక సామ్రాజ్యం ఎంతో విశాలమైనది. మహావీరుడి తరువాత ఆయన శిష్యులందరికీ తనే నాయకుడు కావాలనే కాంక్ష జమాలిలో ఉండేది. మహావీరుడి అంతిమ దినాల్లో చాలాసార్లు తనను తదుపరి తీర్థంకరుడిగా, వారసుడిగా ప్రకటించాలని ఆయనను ఒత్తిడి చేశాడు. కానీ మహావీరుడు అందుకు సమ్మతించలేదు. "అది వీలు కాదు. ప్రస్తుత సృష్టిలో నేనే చివరి తీర్థంకరుణ్ణి. రాబోయే సృష్టిలో తీర్థంకరుడు అయ్యే యోగ్యత, అర్హత (మహావీరుడి ముఖ్య శిష్యుడు) గౌతమ గణధరుడికి ఉంది. కాబట్టి నువ్వు నా అల్లుడివి, శిష్యుడివి అయినా నిన్ను నేను నా వారసుడిగా ప్రకటించలేను" అని మహావీరుడు నిష్కర్షగా చెప్పాడు.

జమాలి దీన్ని అవమానంగా భావించాడు. మహావీరుడి శిష్యుల్లో చీలికలు తెచ్చాడు. అయిదువందల మంది శిష్యులతో బయటకు వెళ్ళిపోయాడు. ఆ తరువాత మహావీరుణ్ణి నిందలపాలు చేశాడు.

క్రూర జంతువులను, ఎందరో వ్యక్తులను మార్చగలిగిన మహావీరుడు తన అల్లుణ్ణి, శిష్యుణ్ణి ఎందుకు మార్చలేకపోయాడు? ఎందుకంటే మనం పరివర్తన చెందడానికి సిద్ధంగా లేకపోతే... ఏ మహనీయుడూ మనల్ని ఉద్ధరించడు. అది దేవుడికి కూడా సాధ్యం కాదు. అందుకే "నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి" అంటాడు 'భగవద్గీత'లో శ్రీకృష్ణ పరమాత్మ.

• రాచమడుగు శ్రీనివాసులు




దైవమార్గం

విమోచనే లక్ష్యంగా...

సువార్తికుడైన సెయింట్ లూకా పూర్తి పేరు లూకానుస్. అతను యూదా మతానికి సంబంధం లేని ఒక గ్రీకు కుటుంబీకుడు. ప్రాచీన సిరియాలోని ఆంటియోచ్‌కు చెందిన వ్యక్తి. అతనిది వైద్య వృత్తి అని చెబుతారు. 'లూకా' అంటే ఇటలీ దేశంలోని లూకానియా ప్రాంతానికి చెందిన పేరు. ఆ పదానికి 'కాంతి' అనే అర్థం కూడా ఉంది లూకా పేరు... లాటిన్‌లో 'లూకాస్' అని వినిపిస్తూ ఉంటుంది. అరుణోదయంలో పుట్టినవారిని 'లూసియాస్' అంటారట. ఏ విధంగా చూసినా... ఆ పేరుకు ప్రకాశం అనే అర్థం స్థిరంగా కనిపిస్తోంది.

లూకా... క్రీస్తు జీవన రేఖలను చిత్రించిన మహా రచయిత. అంతేకాదు, అపోస్తుల (అపోస్తలుల) కార్యాలన్నిటినీ సుస్పష్టంగా రాశాడు. నూతన నిబంధనలోని రెండు ప్రధాన గ్రంథాలకు (లూకా సువార్త, అపోస్తుల కార్యాలు) కర్తృత్వం వహించడం అంటే మాటలు కాదు. 'లూకా సువార్త 24 అధ్యాయాల గ్రంథం. 'అపోస్తుల కార్యాలు' 28 అధ్యాయాలు కలిగిన గ్రంథం. ఒక గ్రంథాన్ని రాయడం వేరు, ఎక్కడా ఏ విధమైన భావ వైరుధ్యం లేకుండా రాయడం వేరు. లూకా గ్రంథంలో మానవ విమోచనే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. యూదేతరులను, తరతరాల అబ్రహామీయులను, పేదలను, మహిళలను లూకా ప్రత్యేక కోణంలో చూపించాడు. క్రీస్తును తండ్రి (దేవుడి) మాటను నెరవేర్చే వ్యక్తిగా ప్రదర్శించాడు. ప్రార్థనా సంస్కృతిని, దాని గొప్పతనాన్ని చిత్రీకరించాడు. మిగతా సౌవార్తికుల మాదిరిగానే ఉపమానాలతో నిండిన కథలను ప్రకటించాడు. క్రీస్తు చేసిన 26 అద్భుతాలను లూకా పేర్కొన్నాడు. దెయ్యాలను వెళ్ళగొట్టడం నుంచి, రోగులను స్వస్థత పరచడం వరకూ, అలాగే ఏసు స్వీయమైన దివ్య శక్తుల నుంచి దైవ మహిమను నిరూపించడం కోసం ప్రకటించిన విశేషాల వరకూ అన్నిటినీ వివరించాడు. ఈ 26 ఉపమాన కథల ద్వారా ఆయన సందేశాన్ని సుగమం చేశాడు. లూకా చిహ్నం వృషభం.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024



గీతాసారం


సమదృష్టి



"జ్ఞానంతో, విజ్ఞానంతో సంతృప్తుడైన (జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా) వ్యక్తి దేనికీ చలించకుండా ఉంటాడు. అతను తన ఇంద్రియాలను జయిస్తాడు. అతనికి మట్టి పెళ్ళ, రాయి, బంగారం అన్నీ ఒకటే. అతడే యోగి" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు చెప్పాడు. ఆయన చెప్పినది అర్థం చేసుకోవడానికి అవగాహన, జిజ్ఞాస, జ్ఞానం, అనుభవం మనకు సాయపడతాయి. 'జ్ఞానం' అంటే స్వీయ అవగాహన. దాన్ని సాధించిన వ్యక్తి సంతృప్తిని పొందుతాడు. విజ్ఞానాన్ని 'శాస్త్రం' (సైన్స్) అని కూడా పిలుస్తారు. విషయాలు, వ్యక్తుల పట్ల ఉత్సుకత అని చెప్పుకోవచ్చు. ఈ ఉత్సుకతలకు సమాధానాలు సేకరించడం అనేది ఎల్లప్పుడూ గతానికి చెందిన జ్ఞానం సంపాదించడం. అది పుస్తకాల్లో లభిస్తుంది. అంతర్గతంగా మనం చేసే ప్రయాణానికి ప్రారంభదశలలో ఈ ఉత్సుకత సాయపడుతుంది. కానీ దానికి పరిమితులు ఉన్నాయి. సైన్స్ కూడా కణాలు, తరంగాలకు సంబంధించిన అనిశ్చితమైన సూత్రాలు, ద్వంద్వత్వాల లాంటి పరిమితులతో సంతృప్తి చెందాల్సి వచ్చింది.

మరోవైపు, అస్తిత్వం లేదా ఉనికి... మార్పు లేనిది. అది శాస్త్రీయపరంగా, నిరంతరం అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. ఉత్సుకత సమాధానాల కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. కానీ అస్తిత్వం అనేది మనలో ప్రతి ఒక్కరికీ కలిగే అనుభవాలతో ప్రతిస్పందిస్తుంది. వాటిని పంచుకోవడానికి మార్గం లేదు. ఒక వ్యక్తి జ్ఞానపరంగా సంతృప్తి చెందాడంటే... అతని అన్ని ప్రశ్నలకూ సమాధానాలు దొరికాయని కాదు. అతనిలో ఉత్సుకత తగ్గిపోయిందని అర్థం. అప్పుడు అతను సాక్షిగా ఉంటాడు. సాక్షిగా ఉండడం అంటే... ఏ అంశం మీదా ఎటువంటి తీర్పులు చెప్పకుండా, అంచనాలు లేకుండా... వస్తువులు, వ్యక్తులు, పరిస్థితుల విషయంలో... ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించడం. ఇది 'ఎంపికలేని అవగాహన' స్థితి.

చలించకుండా ఉండడం, ఇంద్రియాలను జయించడం గురించి కృష్ణుడు వివరంగానే చెప్పాడు. మనల్ని ఎవరైనా ప్రశంసించినప్పుడు... దానికి సంపూర్ణంగా అర్హులమని భావిస్తాం. విమర్శలు ఎదురైనప్పుడు కోపగించుకుంటాం. ప్రశంస అనేది తియ్యని విషం అని, ఒక ఉచ్చు అని గ్రహించినట్టయితే... ప్రశంసలను, విమర్శలను అధిగమించే దిశగా మన ప్రయాణాన్ని సులువుగా ప్రారంభించవచ్చు. బంగారాన్ని, మట్టి ముద్దను, రాతి ముక్కను ఒకే విధంగా పరిగణించే దశకు చేరుకోవడం ద్వారా... అన్నిటినీ సమానంగా చూసే స్థితిని సాధించినప్పుడు మనం దేనికీ చలించకుండా ఉంటాం.



కె.శివప్రసాద్

దేహమే దేవాలయం

"దేహమే దేవాలయం. అందులోని జీవుడే సనాతనుడైన భగవంతుడు. కాబట్టి అజ్ఞానాన్ని తొలగించి, సోహంభావ బుద్ధితో ('పరమాత్మే నేను' అనే భావనతో) ఆయనను పూజించాలి" అని 'స్కందోపనిషత్తు' చెబుతోంది. అయితే "పరమాత్మ తాలూకు దేహమే దేవాలయం" అంటోంది 'శ్రీప్రశ్న సంహిత'. దేవాలయంలోని భాగాలను దేహంలోని భాగాలతో పోల్చడాన్ని ఈ క్రింది శ్లోకాలలో గమనించవచ్చు.

గర్భగేహం శిరఃప్రోక్తం శిఖా శిఖరముచ్యతే
నాసికా శుకనాసీస్యాత్ అంతరాలంగలంస్మృతం
త్యమండపం దేహమిత్త ప్రాకారః కర ఉచ్యతే
గోపురం పాద ఇత్యుక్తం దేవస్థానం ప్రకధ్యతే
(ఈశ్వర సంహిత)

భగవంతుడి గర్భగృహం శిరస్సుగా, శిఖరం శిఖాస్థానంగా, శిఖరం పైన ఉండే శుక నాసిక దేవుని ముక్కుగా, అంతరాలము (మధ్య ప్రదేశం) కంఠంగా, మండపాలు శరీరంగా, ప్రాకారాలు చేతులుగా, గోపురాలు పాదాలుగా 'ఈశ్వర సంహిత' వర్ణించింది. కొద్దిపాటి తేడాలతో మరి కొన్ని ఆగమాలు కూడా ఈ విషయాన్ని తెలిపాయి. "ఏవయేష హరి స్సాక్షాత్ ప్రాసాదేత్వేన సంస్థితః... ఆలయ రూపంలో సాక్షాత్తూ శ్రీహరి రూపం ఉంటుంది. కాబట్టి దేవాలయంలోని ప్రతి నిర్మాణాన్ని పవిత్రమైనవిగా భావించి నమస్కరించాలి" అంటోంది 'హయశీర్ష సంహిత'.

దేవాలయ ప్రతిష్ఠాఫలం

దేవాలయాలను నిర్మించడం, వాటిలో విగ్రహాలను ప్రతిష్ఠించడం, నిత్య, నైమిత్తిక, బ్రహ్మోత్సవాది కార్యక్రమాలు... ఇవన్నీ పూర్వ కాలంలో ఆ దేశపు రాజు లేదా రాజ ప్రతినిధి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగేవి. ఉత్సవాలు అవిచ్ఛిన్నంగా జరగడం కోసం ఎన్నో ధనరాశులను, మాన్యాలను ఆలయాలకు వారు సమర్పించేవారు. అయితే ఇదంతా గతం. ఆధునిక కాలంలో రాజులు, రాచరిక వ్యవస్థ అంతరించిపోయాయి. ఇప్పటి కాలంలో భక్తులు ఒక కూటమిగా ఏర్పడి... తమతమ ప్రాంతాలలో కొత్త దేవాలయాల నిర్మాణం, పాత దేవాలయాల విషయంలో జీర్ణోద్ధారణ, ఉత్సవాల నిర్వహణ లాంటివి చేపడుతున్నారు. దేవాలయాల నిర్మాణం చేసినవారికి, అందులో పాలు పంచుకున్నవారికి కలిగే పుణ్య ఫలాలను వివిధ ప్రాచీన గ్రంథాలు వివరించాయి. దేవాలయాల నిర్మాణం గొప్ప పుణ్యకార్యం అని, ప్రతిమను కూడా నిర్మించి ప్రతిష్ఠిస్తే మరింత పుణ్యఫలం కలుగుతుందని, సుఖ సంపదలు లభిస్తాయని, పాపాలు తొలగిపోతాయని, అభీష్టాలు నెరవేరుతాయని, పవిత్ర యజ్ఞఫలాలు, సకల పుణ్యతీర్థాలలో స్నానం చేసిన ఫలం, అన్ని దానాలు చేసిన ఫలం కలిసి లభిస్తాయని 'అపరాజిత పృచ్ఛ', 'ప్రాసాద మంజరి', 'పురుషోత్తమ సంహిత' లాంటి గ్రంథాలు చెప్పాయి. ఐశ్వర్యం, విజయం, పుణ్యఫలం, ఆయుష్షు, ఆరోగ్యం, సర్వశత్రు క్షయం, సర్వోపద్రవ నాశనం, ఇహలోక సౌఖ్యం, అనంతరం మోక్షం పొంది భగవంతుని సాయుజ్యం లభిస్తాయని 'కపర్దీ సంహిత', ఆలయంలోని ఏ భాగాన్నైనా భక్తితో, ప్రీతితో నిర్మిస్తే భగవంతుడి సామీప్యాన్ని పొందుతారని 'సుమూర్తార్చనాధికారం' అనే గ్రంథం, కలప, శిల, లోహం, మట్టి లాంటి ద్రవ్యాలతో ఆలయ నిర్మాణం చేసిన వారు అనంత పుణ్యఫలాలు పొందుతారని, ప్రతినిత్యం యజ్ఞం చేస్తే ఏ ఫలితం లభిస్తోందో దానికి సమానమైన ఫలం లభిస్తుందని, తాము మాత్రమే కాకుండా పూర్వీకులు, తదుపరి తరాలవారు సద్గతి పొందుతారని భృగు మహర్షి విరచితమైన 'ప్రకీర్ణాధికారం' స్పష్టం చేశాయి. ఈ విధంగా మన మహర్షులు అందించిన ఆగమాలు, శిల్ప శాస్త్రాలు దేహమే దేవాలయం అని పేర్కొంటూ... ఆలయాల విశిష్టతను, ఆలయాలు నిర్మించేవారికి, దానికి సహకరించేవారికి లభించే పుణ్య ఫలాలను వివరించాయి. ఆలయాలు సర్వతోముఖాభివృద్ధి సాధిస్తే ధర్మం వికసిస్తుంది. అన్ని కళలకు నిలయమైన ఆలయం సకల జగతిని సస్యశ్యామలంగా ఉంచుతుంది.

• దగ్గుపాటి నాగవరప్రసాద్ స్థపతి
9440525788

తెలుసుకుందాం




నమాజ్... పవిత్ర విధి

అల్లాహ్‌పైన, దైవప్రవక్తపైన భక్తి విశ్వాసాలను చూపించడానికి అత్యంత ఆవశ్యకమైన విధి నమాజ్. దైవారాధనలో నమాజ్ పాత్ర ఎంతో కీలకమైనది. ప్రతిరోజూ అయిదుసార్లు (ఫజర్, జొహర్, అసర్, మగ్రిబ్, ఇషా) చేయాల్సిన విధిగా నిర్దేశితమైన నమాజ్... ఇస్లాం ధర్మం మూల స్తంభాలలో ఒకటి. "నమాజ్ ద్వారా సహాయం పొందండి. నమాజ్ నిస్సందేహంగా కష్టతరమైన కార్యమే. కానీ అల్లాహ్‌కు విధేయులైన దాసులకు ఇది ఎంతమాత్రం కష్టం కాదు. మీ కుటుంబ సభ్యులను నమాజ్ చేయాల్సిందిగా ఆజ్ఞాపించండి. మీరు కూడా దాన్ని పాటించండి. మీ ప్రభువును స్తుతించడంతోపాటు ఆయన పవిత్ర నామాన్ని జపిస్తూ ఉండండి. సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయానికి ముందు, రాత్రి సమయంలో కూడా ఆ పవిత్ర నామాన్ని జపించండి" అని వివిధ సందర్భాలలో అంతిమ పవిత్ర గ్రంథమైన దివ్య ఖుర్‌ఆన్ పేర్కొంది.

"ఎవరైతే క్రమం తప్పకుండా సక్రమంగా నమాజ్ చేస్తారో... ప్రళయ దినాన ఆ నమాజ్ అతని కోసం జ్యోతిగా, అతని విశ్వాసానికి నిదర్శనంగా, ముక్తి సాధనంగా మారుతుంది. ఎవరు నిబద్ధతతో, ఏకాగ్రతతో నమాజ్ చేయరో వారు అవిశ్వాసులుగా జమ అవుతారు" అని దైవప్రవక్త మహమ్మద్ తెలిపారు. "ఒక వ్యక్తి ఇంటి ముందు నది ప్రవహిస్తోంది. అతను ఆ నదిలో రోజూ అయిదుసార్లు స్నానం చేస్తూ ఉంటాడు. ఇక అతని శరీరం పైన మలినం ఉంటుందా?" అని తన అనుచరులను ఆయన ప్రశ్నించారు. "ఎలాంటి మలినం ఉండదు" అని వారు సమాధానం చెప్పారు. "రోజుకు అయిదుసార్లు నమాజ్ చేసే మనిషి స్థితి కూడా అలాగే ఉంటుంది. అయిదు వేళలా నమాజ్ చేసిన దాసుని పాపాలను అల్లాహ్ క్షమిస్తాడు" అని దైవప్రవక్త స్పష్టం చేశారు.

సందేశం



నమాజ్ వల్ల అనేక లాభాలు ఉన్నాయి.. అల్లాహ్‌తో బాంధవ్యాన్ని నమాజ్ బలోపేతం చేస్తుంది. మనో ధైర్యాన్ని పెంచుతుంది. ఆత్మవిశ్వాసాన్ని బలోపేతం చేస్తుంది. నమాజ్ నియమం ప్రకారం చేసేవారిలో క్రమశిక్షణ, సహనం, చక్కగా మాట్లాడే పద్ధతి, ఉత్తమమైన నడత, మంచి దృక్పథం, నిజాయితీ లాంటి సద్గుణాలు వృద్ధి చెందుతాయి. సమూహంగా నిర్వహించే నమాజ్ సామాజిక ఐక్యతను, సోదర భావాన్ని, సమానత్వాన్ని ప్రోత్సహిస్తుంది. ఎలాంటి భేదాలు లేకుండా అందరూ ఒకే వరుసలో నిలబడి నమాజ్ చేయడం... ఇస్లాం సార్వత్రికతకు చిహ్నం. నమాజ్... ఇస్లాం ఆరాధనలో ప్రధానాంశం. కాబట్టి నమాజ్‌ను అందరూ సక్రమంగా, పూర్తి ఏకాగ్రతతో ఆచరించాలి. దానిద్వారానే సకల శుభాలు జరుగుతాయి. దైవ సాన్నిధ్యపు ద్వారాలు తెరుచుకుంటాయి. సన్మార్గంలో పయనం సులభతరం అవుతుంది.

• మహమ్మద్ వహీదుద్దీన్

తెలుగు ప్రేక్షకుల కోసమే సినిమాలు చేస్తాను

'తెలుగు ప్రేక్షకులను అలరించడమే నాకు ముఖ్యం. కంటెంట్ నచ్చి పరభాషల్లోనూ మన సినిమా ఆడితే సంతోషిస్తాను. అంతే తప్ప పాన్ ఇండియా హీరో అనిపించుకోవాలనే కోరికతో కథలను ఎంచుకోవడం లేదు. మున్ముందూ తెలుగు ప్రేక్షకుల కోసమే సినిమాలు చేస్తాను' అని తేజ సజ్జ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'మిరాయ్' విడుదల సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో పంచుకున్నారు.



● ఎప్పటికప్పుడు కొత్త తరహా చిత్రాలు చేయాలనే నా ప్రయత్నంలో 'మిరాయ్'ను మంచి అవకాశంగా భావించాను. ఎక్కడా అసభ్యతకు తావు లేకుండా కుటుంబ సమేతంగా చూసేలా ఉంటుంది. సాహసోపేత పోరాటాలు, కాల్పనిక ప్రపంచం, భావోద్వేగాలు, భక్తి భావన లాంటి అంశాల మేళవింపుగా దర్శకుడు ఈ కథను మలిచారు. ప్రేక్షకులకు అద్భుతమైన థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందీ చిత్రం.

● సినిమా కోసం నూటికి నూరు శాతం కష్టపడుతున్నానా లేదా? అనే ఆలోచన తప్ప ఎలాంటి ఒత్తిడి నాపైన లేదు. ఈ సారి చేసే సినిమా ఇంతకు మించి ఉండాలి అనే అంచనాలు పెట్టుకోను. అలాగే సినిమా విజయాన్ని నాకు ఆపాదించుకోను. ఫలితాలపైనా అంచనాలు పెట్టుకోను.

● 'హనుమాన్' అనూహ్య విజయం ప్రభావంతో 'మిరాయ్'ను పాన్ ఇండియా ప్రాజెక్ట్ చేయలేదు. అలా కుదిరిందంతే. పాన్ ఇండియా స్థాయిలో ఉండాలని చెప్పి స్క్రిప్ట్‌లో మార్పులూ, చేర్పులూ చేయలేదు. దాదాపు ముందు అనుకున్న బడ్జెట్‌లోనే సినిమాను పూర్తి చేశాం.

'కిష్కింధపురి' ఆ లోటును తీర్చింది

- బెల్లంకొండ సాయి శ్రీనివాస్



"అందరూ 'రాక్షసుడు 2' ఎప్పుడు చేస్తారు?' అని నన్ను అడుగుతున్నారు. కానీ 'కిష్కింధపురి' దానికి మించిన చిత్రం అవుతుంది. నేను ఇండస్ట్రీకి వచ్చి పదేళ్లు అయినా హారర్ జానరలో ఓ మంచి చిత్రం చేయలేకపోయాననే అనే వెలితి ఉంది. 'కిష్కింధపురి' ఆ లోటును తీర్చింది. ప్రేక్షకులను భయపెట్టడం కూడా ఒక కళ. ఊహించని మలుపులు, భయానక సంఘటనలతో ప్రేక్షకులను థ్రిల్ చేస్తాం. ఒక మంచి సినిమా చూశామనే సంతృప్తి ప్రేక్షకులకు కలుగుతుంది' అని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించిన చిత్రమిది. నేడు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని దర్శకుడు అద్భుతంగా ఆవిష్కరించారు. చిత్రబృందం పడిన కష్టం మీకు ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తుంది. రాక్షసుడు తర్వాత నేను సాయి శ్రీనివాస్‌తో చేసిన చిత్రమిది. ఈ సినిమా కూడా ఆ స్థాయి విజయం అందుకోవాలి' అని ఆకాంక్షించారు. కౌశిక్ మాట్లాడుతూ 'సాయి శ్రీనివాస్, సాహుగారు ఈ కథను నమ్మడం వల్లే ఈ ప్రాజెక్ట్ ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ చిత్రంలో అనుపమ నటన ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది' అని చెప్పారు. సాహు గారపాటి మాట్లాడుతూ 'హారర్ జానర్‌లో చాలా చిత్రాలు వస్తుంటాయి. వాటిల్లో విభిన్న కథా చిత్రమిది" అని చెప్పారు.

'ఓజీ' నుంచి ప్రత్యేక గీతం



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓజీ'. అరుళ్ ప్రియాంక మోహన్ కథానాయిక. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై డీవీవీ దానయ్య నిర్మించారు. సినిమా ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఇటీవలె పవన్ కల్యాణ్ పుట్టినరోజు కానుకగా ఈ చిత్రం నుంచి విడుదలైన 'ఓమీ' గ్లింప్స్‌నకు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా చిత్రబృందం 'ఓమీ ట్రాన్స్' పూర్తి వెర్షన్‌ను విడుదల చేసింది. 'ఓజీ', 'ఓమీ'ల ముఖాముఖి పోరుని సూచించేలా ఈ గీతం ఉంది. తమన్ స్వరపరచిన ఈ పాట ఎంతో శక్తిమంతంగా, నిజంగానే శ్రోతలను ట్రాన్స్‌లోకి తీసుకెళ్లేలా ఉంది. కాగా, ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ఓమీగా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు.

కొల్లూరు మూకాంబికాదేవికి వజ్ర కిరీటం

● **రూ.4 కోట్ల కానుకలను సమర్పించిన ఇళయరాజా**



ఉడిపి జిల్లా కొల్లూరు మూకాంబికాదేవికి ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా వజ్రాలు పొదిగిన బంగారు కిరీటాన్ని, వీరభద్ర స్వామికి రజత కిరీటాన్ని, వెండి ఖడ్గాన్ని కానుకలుగా సమర్పించారు. ఆలయ మంటపంలోని రథం వీధి నుంచి పూర్ణకుంభంతో, పంచవాయిద్యాల నడుమ కిరీటాలను, ఇతర ఆభరణాలను ఆయన తీసుకెళ్ళారు. ఇళయరాజా, ఆయన కుమారుడు కార్తీక్ ఇళయరాజా, మనవడు యతీష్ మూకాంబికా దేవిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూకాంబికా దేవిని ఇళయరాజా ఏటా దర్శించుకుంటారు. ఆయన సమర్పించిన కానుకల విలువ రూ.4 కోట్లు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 2006లోనూ ఆయన మూకాంబికా దేవికి వజ్రకిరీటం, పలు వస్తువులను కానుకగా సమర్పించారు.

- ఆంధ్రజ్యోతి, బెంగళూరు

సొంత ఇంటినే పాఠశాలగా...



'రాఘవ లారెన్స్ ఛారిటబుల్ ట్రస్ట్' ద్వారా ఇప్పటికే ఎంతోమందికి సహాయం చేశారు కథానాయకుడు, దర్శకుడు రాఘవ లారెన్స్. ఇప్పుడు తన సొంతింటిని పాఠశాలగా మారుస్తున్నట్లు ప్రకటించి మరోసారి గొప్ప మనసును చాటుకున్నారు. విద్యార్థులకు ఉచిత విద్య అందించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఆయన కష్టం కదిలించింది



ట్రైన్‌లో తినుబండారాలు అమ్మే ఓ 80 ఏళ్ల వృద్ధుడికి రూ.లక్ష సాయం చేయడానికి సిద్ధమని ప్రకటించారు లారెన్స్. 'ఆయన ట్రైన్లలో తినుబండారాలు అమ్ముతుంటారని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్నా. జీవనం సాగించడానికి ఆయన పడుతున్న కష్టం నన్ను ఎంతగానో కదిలించింది. ఆయనకు నా వంతుగా రూ.లక్ష సాయం చేద్దామని భావించాను. ఆయన వివరాలు మీకెవరికైనా తెలిస్తే చెప్పండి' అని ఎక్స్ వేదికగా లారెన్స్ కోరారు.


ఇన్ఫీ రూ.18,000 కోట్ల బైబ్యాక్

కంపెనీ వాటాలో 2.41% వాటాకు సమానమైన 10 కోట్ల షేర్ల తిరిగి కొనుగోలు

- ఒక్కో షేరుకు రూ.1,800 చెల్లింపు
- కంపెనీ చరిత్రలో ఇదే అతిపెద్ద బైబ్యాక్
- గడిచిన మూడేళ్లలో ఇదే మొదటిసారి
- మార్కెట్లో లిస్టయినప్పటి నుంచి ఐదోసారి

బెంగళూరు: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ రూ.18,000 కోట్ల విలువైన షేర్లను మార్కెట్ నుంచి తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేయనున్నట్లు ప్రకటించింది. కంపెనీ మొత్తం పెయిడప్ ఈక్విటీ షేర్ క్యాపిటల్‌లో 2.41 శాతానికి సమానమైన 10 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేయనున్నట్లు, ఒక్కో షేరుకు రూ.1,800 చెల్లించనున్నట్లు తెలిపింది. గురువారం సమావేశమైన కంపెనీ బోర్డు సభ్యులు ఈ బైబ్యాక్ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. కాగా ఇన్ఫోసిస్ చరిత్రలో ఇదే అతిపెద్ద బైబ్యాక్ కానుంది. గడిచిన మూడేళ్లలో ఇదే మొదటిసారి. సంస్థ స్టాక్ మార్కెట్లో లిస్టయినప్పటి నుంచి ఇది ఐదోసారి.

బీఎస్ఈలో ఇన్ఫోసిస్ షేరు ధర గురువారం 1.51 శాతం తగ్గి రూ.1,509.5 వద్ద ముగిసింది. ఈ ముగింపు ధరతో



పోలిస్తే కంపెనీ షేర్ల తిరిగి కొనుగోలు కోసం 19 శాతం అధికంగా చెల్లించనుంది. ఈ జూన్ త్రైమాసికం చివరినాటికి కంపెనీ 88.4 కోట్ల డాలర్ల (సుమారు రూ.7,805 కోట్లు) ఫ్రీ క్యాష్‌ఫ్లోను నమోదు చేసింది. తాజా బైబ్యాక్ ప్రతిపాదనకు కంపెనీ వాటాదారులూ ఆమోదం తెలపాల్సి ఉంటుంది.

బై బ్యాక్ సంవత్సరం	రూ.కోట్లు	మొత్తం ఎన్ని షేర్లు	ఒక్కో షేరు ధర (రూ.)
2017	13,000	11.3 కోట్లు	1,150
2019	8,260	11.05 కోట్లు	747
2021	9,200	5.58 కోట్లు	1,649
2022	9,300	6.04 కోట్లు	1,539
2025	18,000	10 కోట్లు	1,800

టీసీఎస్ కూడా ప్రకటిస్తుందా..?

ఇన్ఫోసిస్ తాజా నిర్ణయం నేపథ్యంలో దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కూడా షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించవచ్చని హాంకాంగ్‌కు చెందిన బ్రోకరేజీ సంస్థ సీఎల్ఎస్ఏ అభిప్రాయపడింది. 2023 డిసెంబరుతో ముగిసిన బైబ్యాక్‌లో టీసీఎస్ రూ.17,000 కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు చేసింది. 2022లో రూ.18,000 కోట్ల షేర్లను బైబ్యాక్ చేసింది. ఈ విడత టీసీఎస్ రూ.20,000 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేయవచ్చని సీఎల్ఎస్ఏ అంచనా వేస్తోంది.

మరో విడత పీఎస్‌బీల విలీనాలు!?

- ఎస్‌బీఐ తరహాలో 3-4 మెగా బ్యాంకుల ఏర్పాటు ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం!!
- నేటి నుంచి పీఎస్‌బీల మేధోమథనం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీ) మరో విడత విలీనాలకు కేంద్రం సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. ఆస్తుల విలువ పరంగా ప్రస్తుతం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మాత్రమే ప్రపంచంలోని 100 అతిపెద్ద బ్యాంకుల జాబితాలో ఉన్నాయి. వీటి తరహాలో మరో 3-4 మెగా పీఎస్‌బీలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ఈసారి విలీనాలను చేపట్టనున్నట్లు సమాచారం. వికసిత్ భారత్ లక్ష్యాల సాధనకు దేశంలో మరిన్ని ప్రపంచ స్థాయి బ్యాంకుల ఏర్పాటు అవసరమని మోదీ సర్కారు భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ నెల 12-13 తేదీల్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల సారథులు, ఆర్‌బీఐ, ఆర్థిక శాఖ అధికారులతో కేంద్రం నిర్వహించే రెండు రోజుల మేధోమథనం కార్యక్రమంలో పీఎస్‌బీల మలి విడత విలీనాల ప్రతిపాదనపై చర్చ జరగనుందని వారన్నారు. చివరిసారి 2020లో మోదీ ప్రభుత్వం పీఎస్‌బీల విలీనాలను జరిపింది. దీంతో పీఎస్‌బీల సంఖ్య 27 నుంచి 12కు తగ్గింది. విలీనాల అంచనాల నేపథ్యంలో లిస్టెడ్ పీఎస్‌బీల షేర్లు గురువారం లాభాల్లో పయనించాయి. దాంతో బ్యాంక్ నిఫ్టీ దాదాపు ఒక శాతం పెరిగింది.

హైదరాబాద్‌లో హార్ట్‌ఫోర్డ్ సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికా కేంద్రంగా ఉన్న బీమా కంపెనీ హార్ట్‌ఫోర్డ్.. హైదరాబాద్‌లో తన టెక్నాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. తమ సాంకేతిక రూపాంతర ప్రయాణంలో ఈ కేంద్రం ఏర్పాటు ఒక మైలురాయి అని తెలిపింది. హార్ట్‌ఫోర్డ్ కంపెనీ ఇంజనీరింగ్ ఎక్సలెన్స్, ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీల అభివృద్ధికి హైదరాబాద్ సెంటర్ ప్రధాన కేంద్రంగా పని చేయనుంది. హార్ట్‌ఫోర్డ్‌కు అమెరికాలో ఇప్పటికే ఆరు టెక్నాలజీ కేంద్రాలు ఉన్నాయి. తమ ఉత్పత్తులు, ప్రాసెస్‌ల్లో ఏఐ వినియోగం పునాదిలా మారనుందని కంపెనీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ శేఖర్ తెలిపారు.

డాక్టర్ రెడ్డీస్ చేతికి వర్టిగో ఔషధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వర్టిగో (తల తిరగటం) చికిత్సలో ఉపయోగించే స్టగెరాన్ బ్రాండ్ కొనుగోలుకు జాన్సన్ అండ్ జాన్సన్ (జే అండ్ జే)తో కీలక ఒప్పందం కుదుర్చుకున్నట్టు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ప్రకటించింది. ఈ ఒప్పందంతో భారత్, వియత్నాం కీలక మార్కెట్లుగా ఈఎంఈఏ దేశాల్లో స్టగెరాన్ బ్రాండ్ హక్కులు డాక్టర్ రెడ్డీస్‌కు దక్కుతాయి. స్టగెరాన్‌లో వర్టిగో, వెస్టిబ్యులార్ రుగ్మత చికిత్సలో ఉపయోగపడే సినారిజిన్ ఔషధం ఉంటుంది. యాంటీ-వర్టిగో, సెంట్రల్ నెర్వస్ సిస్టమ్ (సీఎన్ఎస్) పోర్ట్‌ఫోలియో శక్తివంతం చేసుకునేందుకు ఈ బ్రాండ్ కొనుగోలు దోహదపడుతుందని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	132
కరీంనగర్	121	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	113
కర్నూలు	121	నెల్లూరు	118
విశాఖపట్నం	144	అనంతపురం	118
గోదావరి	140		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)


	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,10,500 ▼	1,01,300 ▲	1,39,000 ▼
విజయవాడ	1,12,500 ▼	1,06,500 ▼	1,28,250 ▼
విశాఖపట్నం	1,12,790 ▼	1,01,300 ▲	1,40,000 ▲
రాజమండ్రి	1,10,510 ▲	1,01,300 ▲	1,27,900 ▼
ప్రొద్దుటూరు	1,13,500 ▼	1,04,420 ▼	1,29,000 ▲
ముంబై	1,09,097 ▼	99,933 ▼	1,24,499 ▼

పసిడి రుణాలు రికార్డు స్థాయికి

ఆగస్టులో రూ.2.94 లక్షల కోట్లకు చేరిక

న్యూఢిల్లీ: బంగారం విలువ వేగంగా ఎగబాకుతోంది. గడిచిన ఏడాది కాలంలో 10 గ్రాముల పసిడి రేటు 53 శాతం పెరిగింది. దాంతో బంగారం తాకట్టు పెట్టి తీసుకునే రుణాలూ అంతకంటే వేగంగా పెరుగుతున్నాయి. ఆగస్టు నెలలో బ్యాంకుల గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.2.94 లక్షల కోట్లకు చేరుకుంది. 2024 ఏప్రిల్‌లో ఇది కేవలం రూ.1.02 లక్షల కోట్లే. ఈ రుణాలు ఆల్‌టైం రికార్డు స్థాయికి పెరగడం వరుసగా ఇది 15వ నెల. అంతేకాదు, ఈ మార్చి నుంచి ప్రతినెలా ఈ రుణాల్లో వార్షిక ప్రాతిపదికన 100 శాతానికి పైగా వృద్ధి నమోదైంది. బంగారం ధరలు పెరుగుతున్నంత కాలం గోల్డ్ లోన్స్‌లోనూ అప్‌ట్రెండ్ కొనసాగనుందని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కార్తీక్ శ్రీనివాసన్ అన్నారు.

ఇవీ కారణాలు: బంగారం తాకట్టుపై గతంలో కంటే అధికం రుణం లభిస్తుండటం, బ్యాంకులు తనఖా రహిత వ్యక్తిగత రుణాల మంజూరులో ఆచితూచి వ్యవహరిస్తుండటం ఇందుకు ప్రధానం కారణం. వ్యక్తిగత రుణంతో పోలిస్తే గోల్డ్ లోన్స్‌పై వడ్డీ కూడా తక్కువగా ఉండటమూ మరో కారణం. వ్యక్తిగత రుణం లభించే అవకాశం లేనివారికి బంగారం తనఖా రుణాలు మంచి ప్రత్యామ్నాయంగా



మారాయని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి.

10 గ్రాముల ధర రూ.1.13 లక్షలకు చేరిక

దేశీయంగా బంగారం ధరలు సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మరో రూ.100 పెరిగి రూ.1,13,100కు చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం రేటు కూడా రూ.100 పెరిగి ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.1,12,600 స్థాయికి ఎగబాకింది. 2024 డిసెంబరు 31న రూ.78,950గా నమోదైన 10 గ్రాముల మేలిమి బంగారం ధర.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.34,150 మేర (43.25 శాతం) పుంజుకుంది. కాగా, కిలో వెండి రూ.500 పెరుగుదలతో రూ.1,28,000కు చేరుకుంది.

హైదరాబాద్‌లో ఎంజీ సెలెక్ట్

ఎంజీ సైబర్‌స్టర్, ఎం9 ఎలక్ట్రిక్ కార్లను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి చంద్రశేఖర్

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి): జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా హైదరాబాద్‌లో ఎంజీ సెలెక్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కంపెనీ లగ్జరీ ఎలక్ట్రిక్ కార్లు ఎంజీ సైబర్‌స్టర్, ఎంజీ ఎం9లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత్ చమురు దిగుమతులను తగ్గించుకోవాలంటే దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాల్సి ఉందన్నారు. ఇంధన స్వయం సమృద్ధిని సాధించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు దోహదపడతాయన్నారు. దేశీయంగా పునరుత్పాదక ఇంధన వనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని వివరించారు. కాగా హైదరాబాద్ మార్కెట్లోకి ఎంజీ స్పోర్ట్స్‌కారు సైబర్‌స్టర్, ఎం9 కార్లను విడుదల చేయటం ఎంతో సంతోషంగా ఉందని ఎంజీ సెలెక్ట్ హెడ్ మిలింద్ షా అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 13 నగరాల్లో 14 ఎంజీ సెలెక్ట్


ఎంజీ సైబర్‌స్టర్ కారును ఆవిష్కరిస్తున్న మంత్రి చంద్రశేఖర్, మిలింద్ షా, గౌతమ్ సాయి, కంభంపాటి రామ్మోహన్ రావు

సెంటర్లు ఉన్నాయని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో సైబర్‌స్టర్, ఎం9 కార్లకు వినియోగదారుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని, ఇప్పటికే 250 కార్లు బుకింగ్స్ కావటమే ఇందుకు నిదర్శనమని ఎంజీ సెలెక్ట్ జయలక్ష్మీ మోటార్స్ ఇండియా డీలర్ ప్రిన్సిపల్ పీ గౌతమ్ సాయి తెలిపారు. ఎంజీ సైబర్‌స్టర్ ఒకసారి చార్జింగ్‌తో 580 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. దీని ధర రూ.74.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్). అయితే ప్రీ బుకింగ్స్ కోసం పరిచయ ధర రూ.72.49 లక్షలుగా ఖరారు చేసింది. ఎంజీ ఎం9 ధర రూ.69.90 లక్షలుగా ఉంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ 25,000 పైకి నిఫ్టీ

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో దేశీయ ఈక్విటీ సూచీలూ గురువారం లాభాల్లో పయనించాయి. సెన్సెక్స్ 123.58 పాయింట్లు పెరిగి 81,548.73 వద్ద స్థిరపడింది. సూచీ లాభపడటం వరుసగా ఇది నాలుగో రోజు. నిఫ్టీ 32.40 పాయింట్ల వృద్ధితో దాదాపు మూడు వారాల గరిష్ఠ స్థాయి 25,005.50 వద్దకు చేరింది. సూచీ లాభపడటం వరుసగా ఇది ఏడో రోజు. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 16 రాణించాయి. ఎన్‌టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, పవర్ గ్రిడ్, ఎటర్నల్, ఎయిర్‌టెల్ షేర్లు ఒక శాతానికి పైగా పుంజుకున్నాయి.

సెమీకండక్టర్ పరిశ్రమ కోసం చిప్‌లెట్ ఆధారిత ఇంజనీరింగ్ సేవలు

టీసీఎస్

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం టీసీఎస్ దేశీయ సెమీకండక్టర్ పరిశ్రమకు అవసరమైన చిప్‌లెట్ ఆధారిత ఇంజనీరింగ్ సర్వీసును అభివృద్ధి చేసింది. ఈ చిప్‌లెట్ ఆధారిత ఇంజనీరింగ్ సేవలు సెమీకండక్టర్ల తయారీకి భారత్‌ను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఎంతగానో దోహదం చేస్తాయని టీసీఎస్ వెల్లడించింది. ఈ రంగంలో నూతన ఆవిష్కరణలకూ ఇది ఉపకరిస్తుందని పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం 4,500 కోట్ల డాలర్ల నుంచి 5,000 కోట్ల డాలర్ల వరకు ఉన్న భారత సెమీకండక్టర్ల మార్కెట్ 2030 నాటికి 10,000 కోట్ల డాలర్ల నుంచి 11,000 కోట్ల డాలర్లకు చేరనుంది. ఇలాంటి కీలక సమయంలో తాము అందించే ఈ సరికొత్త సేవలు భారత సెమీకండక్టర్ పరిశ్రమకు ఎంతగానో తోడ్పడతాయని టీసీఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ విభాగం ప్రెసిడెంట్ వీ రాజన్న తెలిపారు.

స్పోర్ట్స్

ఆయుష్ సంచలన విజయం

- క్వార్టర్స్‌లో లక్ష్య సేన్, సాత్విక్ జోడీ
- హాంకాంగ్ ఓపెన్

హాంకాంగ్: భారత వర్ధమాన షట్లర్ ఆయుష్ షెట్టి సంచలన విజయంతో హాంకాంగ్ ఓపెన్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్ జోడీ కూడా రౌండ్-8కు చేరుకొన్నాయి. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో ఆయుష్ 21-19, 12-21, 21-14తో 2023 వరల్డ్ చాంపియన్‌షిప్స్ రజతపతక విజేత కొడాయ్ నరోకా (జపాన్)పై పోరాడి గెలిచాడు. రౌండ్-8లో భారత్‌కే చెందిన లక్ష్యసేన్‌తో ఆయుష్ తలపడతాడు. కాగా సహచర షట్లర్ల మధ్య పోరులో సేన్ 15-21, 21-18, 21-10తో ప్రణయ్‌ను ఓడించాడు. కిరణ్ జార్జ్ 6-21, 12-21తో చోట్ సి (చైనీస్ తైపీ) చేతిలో చిత్తయ్యాడు. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట 18-21 21-15, 21-11తో టీరారట్‌సకుల్-సుక్‌పున్ (థాయ్‌లాండ్)పై గెలిచింది.

యు ముంబా ఉత్కంఠ గెలుపు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) తొలి అంచె లీగ్ మ్యాచ్‌లలో యు ముంబా జోరు కొనసాగుతోంది. పట్నా పైరేట్స్‌తో గురువారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో యు ముంబా 40-39 స్కోరుతో విజయం సాధించింది. ప్రథమార్థం ముగిసేసరికి యు ముంబా 23-15 ఆధిక్యంలో ఉంది. ద్వితీయార్థం 10వ నిమిషం నుంచి ఇరు జట్లు సమాన పాయింట్లతో స్కోరు బోర్డును నడిపించడంతో మ్యాచ్ రసవత్తరంగా మారింది. గెలుపు అంచున ఉన్న పట్నా చివరి సెకన్లలో పొరపాట్లు చేసి చేజేతులా ఓటమిపాలైంది. మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 38-28తో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది.

సెమీఫైనల్లో పూజ

- భారత్‌కు మరో పతకం ఖాయం
- ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్


పూజారాణి

లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు మూడో పతకం ఖాయమైంది. మహిళల 80 కి. విభాగంలో పూజారాణి సెమీఫైనల్‌కు చేరింది. బుధవారం అర్ధరాత్రి హోరాహోరీగా జరిగిన క్వార్టర్ ఫైనల్లో 34 ఏళ్ల పూజ 3-2తో ఎమీలియా కొటెర్‌స్కా (పోలెండ్) ఓడించింది. సెమీస్‌కు చేరిన పూజారాణికి కనీసం కాంస్యం లభించనుంది. ప్రపంచ పోటీలలో ఆమెకిదే తొలి పతకం. ఇక జైస్మీన్ లంబోరియా (మహిళల 57కి.), నూపుర్ షెరాన్ (మహిళల 80+కి.) ఇంతకుముందే సెమీఫైనల్‌కు చేరడంతో భారత్‌కు కనీసం రెండు కాంస్య పతకాలు ఖరారైన సంగతి తెలిసిందే. పురుషుల 65కి. కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో అభినాష్ జమ్వల్ 1-4తో ఒలింపిక్ కాంస్య పతక విజేత లాష గురులీ (జార్జియా) చేతిలో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

భారత్ జోరుకు బ్రేక్

చైనా చేతిలో ఓటమి
మహిళల ఆసియా కప్ హాకీ

హాంగ్జౌ (చైనా): ఆసియా కప్‌లో భారత అమ్మాయిల జోరుకు బ్రేక్ పడింది. అప్రతిహత విజయాలతో దూసుకుపోతున్న మనోళ్లకు ఆతిథ్య చైనా షాకిచ్చింది. గురువారం జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో చైనా 4-1తో భారత్‌పై నెగ్గింది. ముంతాజ్ (38వ ని.) భారత్‌కు ఏకైక గోల్ అందించింది. జూ మీరాంగ్ (4, 56 ని.), చెన్ యాంగ్ (31), టాన్ జిన్హువాంగ్ (47) చైనా తరఫున గోల్స్ చేశారు. శుక్రవారం జరిగే తదుపరి పోరులో జపాన్‌తో భారత్ తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే మనోళ్లకు ఫైనల్ బెర్త్ ఖాయమవుతుంది.

సింగిల్స్ బరిలో దక్షిణేశ్వర్

- రిజర్వ్ ప్లేయర్‌కు చాన్స్
- డబుల్స్‌లో రిత్విక్
- నేటి నుంచి డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్ 1



బీల్ (స్విట్జర్లాండ్): డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-1లో పటిష్ఠ స్విట్జర్లాండ్‌ను ఎదుర్కొనేందుకు భారత జట్టు కీలక నిర్ణయం తీసుకుంది. నేటి నుంచి జరిగే ఈ పోటీల్లో రిజర్వ్ ఆటగాడిగా ఉన్న దక్షిణేశ్వర్ సురేశ్‌తో సింగిల్స్ ఆడించబోతున్నారు. ఆరు అడుగుల ఐదు అంగుళాల ఈ మధురై ఆటగాడు ట్రైనింగ్ సెషన్‌లో భారీ సర్వీస్‌లతో ఆకట్టుకున్నాడు. అందుకే ఇండోర్ హార్డ్ కోర్టుల్లో సాగే పోటీలకు సురేశ్ ఆట సరిగ్గా సరిపోతుందని కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ భావిస్తున్నాడు. శుక్రవారం జరిగే తొలి సింగిల్స్‌లో దక్షిణేశ్వర్.. జెరోమ్ కిమ్‌తో తలపడనున్నాడు. అలాగే భారత నెంబర్‌వన్ ఆటగాడు సుమిత్ నగాల్ మరో సింగిల్స్ ఆడనున్నాడు. అయితే యూఎస్ ఓపెన్‌లో గాయపడిన డబుల్స్ స్టార్ యుకీ భాంబ్రీ ఇంకా కోలుకోలేదు. దీంతో 13న జరిగే డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీకి జతగా హైదరాబాదీ రిత్విక్ బొల్లిపల్లి బరిలోకి దిగుతాడు. 1993లో చివరిసారి స్విస్‌తో తలపడిన భారత్ ఓవరాల్‌గా 2-1తో ఆధిక్యంలో ఉంది. తాజా వరల్డ్ గ్రూప్-1లో విజేత డేవిస్ కప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధిస్తుంది. ఓడిన జట్టు వరల్డ్ గ్రూప్ 1 ప్లేఆఫ్స్‌కు పడిపోతుంది.

హెచ్‌సీఏ బ్యాంకు ఖాతాను పునరుద్ధరించండి

హైకోర్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) బ్యాంకు ఖాతాను పునరుద్ధరించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నిధుల దుర్వినియోగం కేసులో ఆ సంఘం బ్యాంకు ఖాతాను సీఐడీ సూచనల మేరకు కెనరా బ్యాంకు అధికారులు స్తంభింపజేశారు. ఖాతా స్తంభనను హెచ్‌సీఏ తాత్కాలిక సీఈఓ ఇంతియాజ్ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ శ్రవణ్ ధర్మాసనం, సీఐడీ పెట్టిన కేసులో కార్యవర్గ సభ్యులు నిందితులుగా ఉన్నారే కానీ హెచ్‌సీఏ కాదని, సీఐడీ పెట్టిన కేసుకు సంఘం రోజువారీ కార్యకలాపాల నిర్వహణకు సంబంధం లేదని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ప్రీక్వార్టర్స్‌కు 15 ఏళ్ల గాథ ఖడాకే

● దీపిక, అంకిత విఫలం ● వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్స్



గ్వాంగ్జు (కొరియా): వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో టీనేజ్ ఆర్చర్ గాథ ఖడాకే ప్రీక్వార్టర్స్‌కు చేరుకోగా.. వెటరన్ దీపిక కుమారికి మరోసారి నిరాశే ఎదురైంది. గురువారం జరిగిన మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో 15 ఏళ్ల గాథ 6-4తో కేథరినా బౌవర్ (జర్మనీ)పై గెలిచింది. కాగా, సీడింగ్ ఆధారంగా నేరుగా రౌండ్-32లో తలపడిన దీపిక 4-6తో చొయిరున్నీసా (ఇండోనేసియా) చేతిలో, అంకిత భక్త్ 2-6తో షియాన్ చేతిలో పరాజయం పాలయ్యారు. కాగా, మెగా ఈవెంట్‌లో దీపిక విఫలం కావడం ఇది ఆరోసారి.

వరల్డ్‌కప్ జట్టులో తెలుగమ్మాయి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అంధుల టీ20 మహిళల ప్రపంచకప్‌లో ఆడే భారత జట్టులో ఆంధ్ర క్రికెటర్ పి. కరుణ కుమారి స్థానం దక్కించుకుంది. గురువారం 16 మందితో కూడిన భారత వరల్డ్‌కప్ జట్టును ప్రకటించింది. టి. దీపిక (కర్ణాటక) కెప్టెన్‌గా ఎంపికైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు మండలం, వంట్ల మామిడి గ్రామం కరుణ స్వస్థలం. వచ్చే నవంబరు 11 నుంచి 25వ తేదీ వరకు బెంగళూరు, న్యూఢిల్లీలో వరల్డ్‌కప్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

కుప్పకూలిన సౌత్ జోన్.. దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్ తొలి రోజే తడబడింది. సెంట్రల్ జోన్ స్పిన్నర్లు సారాంశ్ జైన్ (5/49), కుమార్ కార్తికేయ (4/53) సుడులు తిరిగే బంతులతో హడలెత్తించడంతో గురువారం తొలి ఇన్నింగ్స్‌లో సౌత్ జోన్ 149 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ తన్మయ్ (31) టాప్ స్కోరర్. ఆ తర్వాత ఇన్నింగ్స్ ఆరంభించిన సెంట్రల్ జోన్ నిలకడగా ఆడుతోంది. రోజు ముగిసే సమయానికి 19 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 50 పరుగులతో నిలిచింది. క్రీజులో ఓపెనర్లు డానిష్ (28 బ్యాటింగ్), అక్షయ్ (20 బ్యాటింగ్) ఉన్నారు.

బంగ్లా.. అవలీలగా

ఆసియా కప్

హాంకాంగ్‌పై 7 వికెట్ల తేడాతో విజయం
కెప్టెన్ లిట్టన్ హాఫ్ సెంచరీ



లిట్టన్ దాస్ (39 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 59)

అబుధాబి: కెప్టెన్ లిట్టన్ దాస్ (39 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 59) అర్ధసెంచరీతో ఆసియాకప్‌లో బంగ్లాదేశ్ బోణీ చేసింది. గురువారం గ్రూప్ 'బి'లో భాగంగా హాంకాంగ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో బంగ్లా ఏడు వికెట్ల తేడాతో నెగ్గింది. తౌహీద్ హ్రిదయ్ (35 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హాంకాంగ్ 20 ఓవర్లలో 143/7 స్కోరు సాధించింది. నిజాకత్ ఖాన్ (42), ఓపెనర్ జీషన్ అలీ (30), యాసిన్ ముర్తజా (28) మాత్రమే రాణించారు. పేసర్లు తన్‌జీమ్ హసన్, టస్కిన్ అహ్మద్, స్పిన్నర్ రిషాద్ రెండేసి వికెట్లు సాధించారు. ఆ తర్వాత ఛేదనలో బంగ్లాదేశ్ 17.4 ఓవర్లలో 3 వికెట్లకు 144 పరుగులు చేసి నెగ్గింది. పవర్‌ప్లేలో ఓపెనర్లు పర్వేజ్ (19), తన్‌జీద్ (14) వికెట్లు కోల్పోయినా 51/2 స్కోరుతో జట్టు మెరుగైన స్థితిలో నిలిచింది. అయితే ఆ తర్వాత 7-12 ఓవర్ల మధ్య హాంకాంగ్ బౌలర్లు ఒక్క బౌండరీ కూడా ఇవ్వకపోవడంతో మ్యాచ్‌పై ఆసక్తి నెలకొంది. కానీ కెప్టెన్ లిట్టన్ వరుస ఫోర్లతో స్కోరును గాడిలో పెట్టాడు. 16వ ఓవర్‌లో 6,4తో 16 రన్స్ సాధించిన అతడు 33 బంతుల్లోనే హాఫ్ సెంచరీ కూడా పూర్తి చేశాడు. అతడికి మరో ఎండ్‌లో హ్రిదయ్ సహకరించగా మూడో వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యం సమకూరింది. విజయానికి రెండు పరుగుల దూరంలో లిట్టన్ వెనుదిరిగినా మరో 14 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.

పేసర్ల కట్టడి: అఫ్ఘాన్‌పై 94 పరుగులకే పరిమితమైన హాంకాంగ్ ఈసారి కాస్త మెరుగ్గానే ఆడింది. అయితే ఆరంభంలో బంగ్లా పేసర్లు ఇబ్బందిపెట్టడంతో పవర్‌ప్లేలో 34 రన్స్‌కే రెండు వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో నిజాకత్ ఖాన్, ఓపెనర్ జీషన్ అలీ ఆదుకునే ప్రయత్నం చేశారు. ఆరంభంలో తడబడిన జీషన్ తొమ్మిదో ఓవర్‌లో 6,4తో బ్యాట్ ఝుళిపించాడు. ఆ తర్వాత అడపాదడపా బౌండరీలతో వేగం పెంచిన అతడిని తన్‌జీమ్ అవుట్ చేశాడు. ఈ దశలో యాసిన్ ముర్తజా ధాటిగా ఆడి స్కోరులో వేగం చూపాడు. కానీ 18వ ఓవర్‌లో అతడు రనౌట్ కావడంతో నాలుగో వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాతి ఓవర్‌లోనే నిలకడగా ఆడుతున్న నిజాకత్, కించిత్ (0)లను స్పిన్నర్ రిషాద్ అవుట్ చేయడంతో హాంకాంగ్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది.

సంక్షిప్త స్కోర్లు

హాంకాంగ్ :20 ఓవర్లలో 143/7: (నిజాకత్ ఖాన్ 42, జీషన్ అలీ 30 తన్‌జీమ్ 2/21, రిషాద్ 2/31, టస్కిన్ 2/38); **బంగ్లాదేశ్ 17.4 ఓవర్లలో 144/3 :** (లిట్టన్ దాస్ 59, హ్రిదయ్-నాటౌట్ 35, ఇక్బాల్ 2/14, శుక్లా 1/32).

రెఫరీలు, అంపైర్లు అంతా అతివలే..

మహిళల వన్డే వరల్డ్ కప్


లక్ష్మి

దుబాయ్ : మహిళల వన్డే వరల్డ్ కప్ చరిత్రలో తొలిసారి..మెగా టోర్నీలో అంతా అతివలే మ్యాచ్ అధికారులుగా వ్యవహరించనున్నారు. ఈమేరకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 14 మందితో కూడిన మ్యాచ్ అధికారుల జాబితాను గురువారం ప్రకటించింది. ఇందులో..అంతర్జాతీయ మహిళా క్రికెట్‌లో తొలి మహిళా మ్యాచ్ రెఫరీగా ఖ్యాతి గాంచిన తెలుగు మాజీ క్రికెటర్ జీఎస్ లక్ష్మికి చోటు దక్కింది. మొత్తం నలుగురు మ్యాచ్ రెఫరీలుగా వ్యవహరించనున్నారు. అలాగే 14 మంది అంపైర్లలో భారత్‌నుంచి మాజీ క్రీడాకారిణులు వ్రింద రాఠీ, ఎన్.జనని, గాయత్రీ వేణుగోపాలన్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. వన్డే వరల్డ్ కప్ భారత్, శ్రీలంక వేదికలుగా ఈనెల 30న ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే.

కవితకు చింతమడక వాసుల ఆహ్వానం

» ఎంగిలిపూల బతుకమ్మకు రావాలని పిలుపు

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ సంబరాల్లో భాగంగా ఈ నెల 21న నిర్వహించే ఎంగిలిపూల బతుకమ్మ పండుగకు రావాలని.. కేసీఆర్ సొంతూరు చింతమడక వాసులు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను ఆహ్వానించారు. ఆ గ్రామానికి చెందిన ప్రజలు గురువారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయానికి చేరుకొని.. కవితతో భేటీ అయిన సందర్భంగా వారు ఆమెను చింతమడకకు రావాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గొప్ప ఉద్యమకారుడినికన్న గొప్ప ఊరు చింతమడక అని, బతుకమ్మ వేడుకకు తనను అక్కడికి ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. చింతమడక నుంచి ఎంతో నేర్చుకున్నానని, తన చిన్నప్పుడు ఆ గ్రామంలో బతుకమ్మ ఆడిన రోజులు ఇంకా కళ్లముందే ఉన్నాయన్నారు.. ఈ సమయంలో గ్రామస్తులు తన వద్దకు రావడం ఎంతో ధైర్యం కలిగించిందని కవిత పేర్కొన్నారు.

ఉద్యాన పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచాలి

» సంప్రదాయ పంటలను రక్షించుకోవాలి: కోదండరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంచాలని, దీంతోపాటు సంప్రదాయ పంటలను కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదని వ్యవసాయ, రైతు కమిషన్ ఛైర్మన్ ఎం. కోదండరెడ్డి అన్నారు. రైతు కమిషన్ కార్యాలయంలో మార్కెటింగ్, ఉద్యాన, యూనివర్సిటీ శాస్త్రవేత్తలతో సమీక్ష నిర్వహించారు. ఒకప్పుడు నల్లగొండ జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో బత్తాయి సాగయ్యేదని, ఇప్పుడు అది 43 వేల ఎకరాలకు పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెటింగ్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో బత్తాయి రైతులు దళారుల చేతుల్లో మోసపోతున్నారని కోదండరెడ్డి అన్నారు. నల్లగొండలో ప్రైవేటు మార్కెట్ ఏర్పాటు చేస్తే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవటంలేదని ప్రశ్నించారు. ఉద్యానశాఖ నర్సరీల ద్వారా రైతులకు నాణ్యమైన మొక్కలు సరఫరా చేయాలని సూచించారు.

17న సాయుధ పోరాట దినోత్సవం నిర్వహించాలి

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్/కవాడిగూడ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినోత్సవం పేరుతో ఈ నెల 17న ప్రభుత్వం వేడుకలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. భూమి కోసం, భుక్తి కోసం మట్టి మనుషులంతా ఏకమై దొరలు, భూస్వాములను తరిమికొట్టిన మహోత్తర ఉద్యమం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని తెలిపారు. వీర తెలంగాణ పోరాట స్ఫూర్తిని నేటి తరాలకు అందించాల్సిన ప్రభుత్వాలు సమైక్య దినోత్సవం, ప్రజాపాలనా దినోత్సవం అంటూ రకరకాల పేర్లతో వేడుకలు నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. కాగా, తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సీపీఐ హైదరాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గురువారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న మగ్దూం మొయినుద్దీన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ట్యాంక్‌బండ్‌పై నుంచి లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు అమరవీరులను స్మరించుకుంటూ ర్యాలీ నిర్వహించారు.

సీఎం రేవంత్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ లేఖ

తెలంగాణలో 1 నుంచి 10వ తరగతి వరకు చదివి, ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్ చదివిన విద్యార్థులను స్థానికులుగా పరిగణించాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ గురువారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. వారికి నీట్ కౌన్సెలింగ్‌లో పాల్గొనే అర్హత కల్పించాలని కోరారు.

డాక్టర్ రఘురామ్‌కు గౌరవ ఎఫ్ఆర్‌సీఎస్

» దక్షిణాసియాలో ఈ ఘనత సాధించిన తొలి వైద్యుడు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కిమ్స్ ఉషాలక్ష్మి బ్రెస్ట్ డిసీజెస్ సెంటర్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ రఘురామ్ పిల్లరిశెట్టికి అరుదైన గౌరవం దక్కింది. బ్రిటన్‌లోని రాయల్ కాలేజీ ఆఫ్ ఫిజీషియన్స్ అండ్ సర్జన్స్ ఆఫ్ గ్లాస్గో సంస్థ ఆయనకు గౌరవ ఎఫ్ఆర్‌సీఎస్(ఫెల్లో ఆఫ్ రాయల్ కాలేజీ సర్జన్స్)ను ప్రదానం చేసింది. దక్షిణాసియాలోనే ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడిగా ఆయన రికార్డులకెక్కారు.



రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ అండ్ సర్జన్స్ అధ్యక్షుడు హనీ ఎటీబా నుంచి గౌరవ ఫెల్లోషిప్ అందుకుంటున్న డాక్టర్ రఘురామ్

1997లో పరీక్ష రాయడం ద్వారా ఎఫ్ఆర్‌సీఎస్ పొందిన ఆయన.. ఇప్పుడు అదే కాలేజీ నుంచి గౌరవ ఎఫ్ఆర్‌సీఎస్ అందుకున్నారు. గ్లాస్గోలోని చారిత్రక రాయల్ కాలేజీ హాల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రఘురామ్‌కు కాలేజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ హనీ ఎటీబా ఈ ఫెల్లోషిప్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హనీ ఎటీబా మాట్లాడుతూ డాక్టర్ రఘురామ్‌కు తమ కాలేజీ తరఫున గౌరవ ఫెల్లోషిప్ అందించడం ఆనందంగా ఉందన్నారు. రెండు దశాబ్దాలుగా రొమ్ము క్యాన్సర్ బాధితులకు డాక్టర్ రఘురామ్ అందించిన సేవలు అమూల్యమైనవని ప్రశంసించారు. అనంతరం డాక్టర్ రఘురామ్ మాట్లాడుతూ అత్యున్నత గౌరవ ఫెల్లోషిప్‌ను ప్రదానం చేసినందుకు ఆర్సీపీఎస్జీ అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవస్థాగత లోపాలు సరిదిద్దకుండా గురుకుల ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులా..?!

» తెలంగాణ గురుకులాల ప్రిన్సిపాళ్ల సంఘం ఖండన

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వ్యవస్థాగత లోపాలు సరిదిద్దకుండా ప్రిన్సిపాళ్లను బాధ్యులను చేయడం సరి కాదని తెలంగాణ గురుకులాల ప్రిన్సిపాళ్ల సంఘం (టీజీపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ కుమార్ రౌతు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు, కాలేజీల్లో పూర్తిస్థాయిలో విద్యార్థుల ప్రవేశాలు నిర్వహించలేదని, విద్యార్థులు తగ్గారంటూ రాష్ట్ర వ్యాప్తంగా 170 మైనారిటీ గురుకులాల ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసు ఇవ్వడాన్ని ఖండించారు. ఎక్కువ గురుకుల పాఠశాలలు/ కాలేజీలు పెట్టి 100 శాతం ప్రవేశాలు చేయాలని కోరడం సబబు కాదని పేర్కొన్నారు.

2017లోనే చిరునామా మార్పుకు ఫామ్-6 సమర్పణ: కోట నీలిమ

తనకు రెండు ఓటరు గుర్తింపు కార్డులు ఉన్నాయని స్వతంత్ర సంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) నోటీసు ఇవ్వడమేమిటని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ ప్రశ్నించారు. ఓటరు గుర్తింపు కార్డులో తన చిరునామాను మార్చాలని కోరుతూ ఎన్నికల సంఘానికి 2017లోనే ఫామ్-6 ఇచ్చామని, దానికి ఈసీ అక్‌నాలెడ్జ్ కూడా ఇచ్చిందని గురువారం గాంధీభవన్‌లో మీడియాకు చెప్పారు. ఫామ్-6 సమర్పించిన తర్వాత కూడా తన చిరునామా మార్చని ఈసీ, రెండు ఓటరు గుర్తింపుకార్డులున్నట్లు నోటీసులివ్వడమేమిటన్నారు.

గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డా. వాణి నియామకం

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అదనపు వైద్య విద్య సంచాలకులుగా ఉన్న ఆమే, గతంలో మెడికల్ ఎడ్యుకేషన్‌కు ఇన్‌చార్జి డైరెక్టర్‌గా, సంగారెడ్డి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించారు. శుక్రవారం సూపరింటెండెంట్‌గా బాధ్యతలను స్వీకరించనున్నారు. కాగా, గత సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారిపై ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు అందాయి. ఆమె బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆసుపత్రి పాలన గందరగోళంగా మారిందని, ఆఫీసు నుంచి బయటకురారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో రాజకుమారిపై సర్కారు వేటు వేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు గాంధీ మెడికల్ కాలేజీలోనే ఫిజియాలజీ ప్రొఫెసర్‌గా కొనసాగుతారని హెల్త్ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇదేం ద్వంద్వ నీతి?

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్‌ను ఎందుకు ప్రశ్నించడం లేదు?



» ఏ ప్రభుత్వ విభాగం సమర్థంగా పనిచేస్తుందో సీఎం చెప్పాలి

» రాజాసింగ్ విమర్శలపై స్పందించాల్సిన అవసరం లేదు

» టీబీజేపీ చీఫ్ రాంచందర్‌రావు

హైదరాబాద్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీది ద్వంద్వ నీతి అని టీబీజేపీ చీఫ్ ఎన్.రాంచందర్ రావు విమర్శించారు. శాసనసభ ఆమోదించిన బిల్లులను గడువులోగా గవర్నర్ ఆమోదించాలంటున్న కాంగ్రెస్.. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సమయానుసారంగా చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు కప్పర ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన 'మీట్ ద ప్రెస్'లో రాంచందర్‌రావు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలనకు పక్షవాతం వచ్చిందని, ఏ ప్రభుత్వ విభాగం సమర్థంగా పనిచేస్తుందో సీఎం రేవంత్ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దావోస్ వెళ్లి రూ.70వేల కోట్ల పెట్టుబడులు తెచ్చామని ప్రచారం చేసుకున్నా సీఎం, మంత్రుల విమాన ఖర్చుల మేర కూడా పెట్టుబడులు వచ్చిన దాఖలా లేదని ఆయన ఎద్దేవా చేశారు. కేవలం 3 బ్యారేజీలకే పరిమితం చేయకుండా మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ కోరాలన్నారు. అక్రమ కట్టడాల కూల్చివేతలపై హైడ్రా శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సెప్టెంబరు 17ను అధికారికంగా చేయరేం?

సెప్టెంబరు 17పై కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఒవైసీ ఫోబియా పట్టుకుందని రాంచందర్‌రావు విమర్శించారు. తమ పార్టీ ఆఫీసుల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పార్టీలు, అధికారికంగా మాత్రం కొనసాగించకపోవడం శోచనీయమన్నారు. కొత్త కమిటీపై రాజాసింగ్ చేసిన విమర్శలపై స్పందించాల్సిన అవసరం లేదన్నారు. రాజాసింగ్‌ను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ స్పీకర్ ఫార్మాట్‌లో లేఖ ఇస్తారా? అనే ప్రశ్నకు రాంచందర్‌రావు స్పందిస్తూ, ఆ అంశాన్ని జాతీయ నాయకత్వం చూసుకుంటుందన్నారు. తమ సీఎం అభ్యర్థిని ఎమ్మెల్యేలు ఎన్నుకుంటారని ఒక ప్రశ్నకు సమాధానంగా రాంచందర్‌రావు చెప్పారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదన్నారు. రాష్ట్రానికి యూరియా సరఫరాలో కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమే అయినా వచ్చిన యూరియాను బ్లాక్‌మార్కెట్‌కు తరలకుండా అడ్డుకోవడంలో వ్యవసాయశాఖ మంత్రి విఫలమయ్యారని ఆయన ఆరోపించారు.

నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే..!





(మొదటిపేజీ తరువాయి)

నుంచి నోటీసులు అందుకున్న ఎమ్మెల్యేలు.. కాస్త అటు, ఇటుగా ఇచ్చిన వివరణ ఇది. స్పీకర్ నుంచి పది మంది ఎమ్మెల్యేలు నోటీసులు అందుకోగా, వారిలో 8 మంది ఎమ్మెల్యేలు రాతపూర్వకంగా వివరణ ఇచ్చారు. మిగిలిన ఇద్దరూ వివరణ ఇచ్చేందుకు మరి కొంత గడువు కావాలని స్పీకర్‌ను కోరినట్లు తెలుస్తోంది. వివరణ ఇచ్చిన ఎమ్మెల్యేల్లో తెల్లం వెంకట్రావు, అరికెపూడి గాంధీ, కాలె యాదయ్య, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సహా మరో ఇద్దరు ఉన్నారు. వివరణ ఇచ్చిన వారందరూ.. తాము పార్టీ మారలేదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నామని స్పష్టం చేశారు. దానికి సంబంధించిన కొన్ని ఫొటోలు, ఆధారాలను సమర్పించారు. శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులు 38 మంది ఉన్నారంటూ అనేక సందర్భాల్లో కేటీఆర్, హరీశ్‌రావు చెప్పారని, తద్వారా తమను బీఆర్ఎస్ సభ్యులుగానే వారు పేర్కొన్నారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి పనుల పైన అధికార, ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు సీఎంను కలవడం దశాబ్దాలుగా వస్తున్న సంప్రదాయమేనని, తాము కూడా అభివృద్ధి పనుల పైనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశామని వివరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు వచ్చే వేతనంలో నెలకు రూ.5 వేలు.. పార్టీ ఫండ్ కింద కట్ అవుతాయని, ఈ ఏడాది మార్చి వరకూ తమ వేతనం నుంచి పార్టీ ఫండ్‌ను తీసుకున్నారంటూ సంబంధిత ఆధారాలను సమర్పించారు. అసెంబ్లీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ) ఛైర్మన్ పదవిని ప్రతిపక్ష ఎమ్మెల్యేకు ఇవ్వడం సంప్రదాయమని, అందువల్లే తనకు పీఏసీ ఛైర్మన్ పదవి ఇచ్చారని అరికెపూడి వివరణ ఇచ్చినట్లు సమాచారం. తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీఆర్ఎస్ నేతలు గంగుల కమలాకర్, ప్రశాంత్‌రెడ్డి హాజరయ్యారని స్పీకర్ దృష్టికి తెచ్చినట్లు తెలుస్తోంది.

ఆ వార్తలన్నీ ఊహాగానాలే

» జూబ్లీహిల్స్‌లో నేను పోటీ చేయట్లేదు

» ఎవరికి టికెటిచ్చినా గెలుపే లక్ష్యంగా పని చేస్తా

» ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



బంజారాహిల్స్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తాను పోటీ చేస్తున్నానంటూ వస్తున్న వార్తలన్నీ ఊహాగానాలేనని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో పోటీ విషయమై తనకు ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేశారు. ఆదర్శ్‌నగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. అనంతరం దానం మాట్లాడుతూ అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని, అందులో ఎవరి ప్రమేయమూ ఉండదని అన్నారు. పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా.. వారి గెలుపే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు జూబ్లీహిల్స్ గెలవడం చాలా అవసరమని, ఇందుకోసం సర్వశక్తులు ఒడ్డుతానని చెప్పారు. ఫిరాయింపులపై ప్రశ్నించగా... అది కోర్టు పరిధిలో ఉన్నందున ప్రస్తుతం మాట్లాడబోనని స్పష్టం చేశారు.

అయితే, 8 మంది ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణ ఆధారంగా బీఆర్ఎస్‌కు స్పీకర్ కార్యాలయం నోటీసులు పంపినట్లు సమాచారం. బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నామంటూ ఆయా ఎమ్మెల్యేలు వివరణ ఇచ్చారని, ఆధారాలూ సమర్పించారని పేర్కొంటూ.. విచారణకు పిలిచినప్పుడు హాజరై వాదనలు వినిపించాలని బీఆర్ఎస్‌కు సూచించినట్లు సమాచారం. కాగా, అనర్హత అంశంపై ఒక్కో ఎమ్మెల్యేను స్పీకర్ ప్రసాద్ కుమార్ స్వయంగా విచారించనున్నారు. ఆ విచారణకు పిటిషన్‌ను దాఖలు చేసిన బీఆర్ఎస్ ప్రతినిధి, ఫిరాయింపు ఆరోపణ ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే.. తమ న్యాయవాదులతో హాజరు కావాల్సి ఉంటుంది. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత.. తగిన సమయంలో స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి.

నేపాల్‌లో మాడభూషి కుటుంబం క్షేమం

» హైదరాబాద్ పర్యాటకులు కూడా సురక్షితం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : నేపాల్‌లో తీర్థయాత్రలకు వెళ్లిన కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు క్షేమంగా ఉన్నారు. ఈ నెల 27న మాడభూషి కుటుంబం, మిత్రులు కలిసి 27మంది నేపాల్ వెళ్లారు. అయితే, అక్కడ హింస తలెత్తడంతో పశుపతినాథ్ దర్శనం అనంతరం కాఠ్మాండూలోని దారాహి హోటల్‌లో వారంతా ఆర్మీ రక్షణలో తలదాచుకున్నారు. ఏపీ మంత్రి నారా లోకేశ్ తనకు ఫోన్ చేసి క్షేమ సమాచారం తెలుసుకున్నారని మాడభూషి శ్రీధర్ తెలిపారు. గురువారం ఉదయానికే కాఠ్మండూలో పరిస్థితులు సద్దుమణగడంతో తీర్థయాత్రను కొనసాగించాలని తామంతా నిర్ణయించుకున్నామని తెలిపారు. మరో రెండు రోజుల్లో భారత్‌కు వస్తామని తెలిపారు. కాగా, నేపాల్ పర్యటనకు వెళ్లిన హైదరాబాద్‌కు చెందిన మరో రెండు బృందాలు కూడా సురక్షితంగా ఉన్నాయి. అయితే, అల్లరి మూకలు ఓ హోటల్‌ను తగలబెట్టడంతో అందులో ఉన్న ఒక బృందానికి చెందిన వస్తువులన్నీ కాలిపోయాయని తెలిసింది.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

» కోదండరాం, అద్దంకి దయాకర్‌ల వినతి

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీల భర్తీకి సంబంధించి రాష్ట్రప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని.. టీజేఎస్ అధినేత కోదండరాం, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కోరారు. గురువారం సచివాలయంలో మంత్రి పొంగులేటి, వేం నరేందర్‌రెడ్డిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగుల కోసం సమగ్ర ఉపాధి కల్పన విధానాన్ని రూపొందించాలని విన్నవించారు.

సీపీఏ సదస్సుకు స్పీకర్, మండలి ఛైర్మన్

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కామన్‌వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్(సీపీఏ) సదస్సుకు హాజరయ్యేందుకు శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలు గురువారం బెంగళూరు చేరుకున్నారు. వీరికి విధాన సౌధ వద్ద కర్నాటక శాసనసభ అధికారులు కన్నడ సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కర్నాటక సీఎం సిద్ధ రామయ్య తదితరులను ప్రసాద్‌కుమార్, గుత్తా సుఖేందర్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్జీపీఏటీ అధ్యక్షుడిగా అర్విణి రాజేంద్రబాబు

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎస్జీపీఏటీ) రాష్ట్ర అధ్యక్షుడిగా అర్విణి రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎం.వి.నరసింగరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారులు ఎం.వి.గోనారెడ్డి, జి.లచ్చయ్య ప్రకటించారు. అసోసియేషన్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శిగా బి.నరసయ్య, సంయుక్త అధ్యక్షుడిగా జి.వీరస్వామి, అదనపు ప్రధాన కార్యదర్శిగా వి.రాంమనోహర్ ఎన్నికైనట్లు రాజేంద్రబాబు తెలిపారు.

సైబర్ దాడుల ముప్పును సమిష్టిగా ఎదుర్కొందాం

» కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపు



హైదరాబాద్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): దేశంలో డిజిటల్ విప్లవం కొనసాగుతున్న సమయంలో సైబర్‌దాడుల ముప్పు పెరుగుతుందని, దీన్ని సమిష్టిగా ఎదుర్కొందామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. రామంతపూర్‌లోని సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(సీడీటీఐ)లో జరిగిన నేషనల్ పోలీసు హ్యాకథాన్ సైఫరోకాప్ 2025 అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీడీటీఐ త్రైమాసిక పత్రిక హోరిజన్‌ను ఆవిష్కరించి, హ్యాకథాన్ విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందచేశారు. సైబర్ సెక్యూరిటీ, సైబర్ నేరాల డైనమిక్ సవాళ్లను ఎదుర్కొవడం సమాజం ముందున్న ప్రధాన కర్తవ్యమని, వీటిని ఎదుర్కొవడంలో అందరు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

జైలు అధికారులే కీలకం

ఖైదీల జీవితాల్లో మార్పు తీసుకురావడంలో జైలు అధికారుల పాత్ర కీలకమని కేంద్ర మంత్రి బండి సంజయ్ చెప్పారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో జరిగిన 7వ ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్-2025 ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్యూటీ మీట్‌లో పలు విభాగాల్లో తెలంగాణ జైళ్ల శాఖ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మొదటిస్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయా విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఆయన మెడల్స్, ట్రోఫీలు అందించారు. తెలంగాణ జైళ్ల శాఖ సొంతం చేసుకున్న ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్ ట్రోఫీని జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా అందుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తెలంగాణ విధానాల్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలన్నారు. తెలంగాణలో జాతీయ ప్రిజన్ అకాడమీ ఏర్పాటుకు సహకరించాలని బండి సంజయ్‌ను సౌమ్యా మిశ్రా కోరారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక జైళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని బీపీఆర్‌డీ అదనపు డీజీ రవి జోసెఫ్ లోకూర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా, డీజీపీ జితేందర్, జాతీయ పోలీస్ శిక్షణా కేంద్రం డైరెక్టర్ అమిత్ గార్గ్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జైళ్ల శాఖ ప్రతిభ

7వ ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్‌లో అత్యధిక ట్రోఫీలు, మెడల్స్ సాధించి తెలంగాణ జైళ్ల శాఖ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. మొత్తం 28 పతకాల్లో బంగారం-21, వెండి-4, కాంస్యం-3 ఉన్నాయి.

గ్రూప్-1 పరీక్ష మళ్లీ నిర్వహించాల్సిందే

హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు.. సీఎం రేవంత్ రెడ్డి రాజీనామాకు డిమాండ్

» ఓయూ సహా పలుచోట్ల బీఆర్ఎస్వీ ఆందోళనలు, పలువురి అరెస్టు

హైదరాబాద్, ఉస్మానియా యూనివర్సిటీ, చిక్కడపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): హైకోర్టు తీర్పు నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షను మళ్లీ నిర్వహించాల్సిందేనని బీఆర్ఎస్వీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్రంథాలయం, హైదరాబాద్, చిక్కడపల్లిలోని కేంద్ర గ్రంథాలయం వద్ద వారు గురువారం ఆందోళనకు దిగారు. ఇందులో భాగంగా ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ముఖ్యమంత్రి ఫొటోలను చింపేశారు. గ్రూప్-1 పరీక్ష నిర్వహణలో టీజీపీఎస్సీ విఫలమైనందుకు నైతిక బాధ్యతగా సీఎం రేవంత్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనల్లో పాల్గొన్న పలువురు బీఆర్ఎస్వీ నేతలను పోలీసులు అరెస్టు చేసి వేర్వేరు పోలీసుస్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, తుంగ బాలు మాట్లాడుతూ గ్రూప్-1 అంశంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు. గ్రూప్ 1 పరీక్షను రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని లేని పక్షంలో తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. గ్రూప్-1 పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. పరీక్షల్లో అవకతవకలు చోటు చేసుకోవడంతో అభ్యర్థులు నిరుత్సాహానికి లోనవడంతో పాటు మానసికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 29 ద్వారా చేపట్టిన నియామకాల వల్ల రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతోందని నిరసనలు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం లాఠీ చార్జీలు చేస్తుందని ధ్వజమెత్తారు.



బీఆర్ఎస్వీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

మంత్రులు, సీఎంవో నుంచి గ్రూప్-1 పోస్టుల అమ్మకం : కేటీఆర్

గ్రూప్-1 పోస్టుల కోసం ప్రభుత్వ పెద్దలు భారీగా డబ్బులు డిమాండ్ చేసినట్లు నిరుద్యోగులు చెబుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మంత్రులు, సీఎంవో నుంచే గ్రూప్-1 పోస్టులను కోట్ల రూపాయలకు అమ్ముకున్నారనే విమర్శలు ఉన్నాయని తెలిపారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం గ్రూప్ 1 పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే, పరీక్షల్లో జరిగిన అవకతవకలపై జ్యూడిషియల్ కమిషన్‌తో విచారణ చేపట్టి ఉద్యోగాలు అమ్ముకున్న దొంగలెవరో తేల్చాలని కోరారు. పరీక్షల నిర్వహణలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వాన్ని యువత ఎప్పటికీ క్షమించదని కేటీఆర్ పేర్కొన్నారు. ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలు స్తామన్న కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానంపై ప్రత్యేక అసెంబ్లీ సెషన్ ఏర్పాటు చేసి చర్చించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక, బీఆర్ఎస్వీ నాయకుల అరెస్టును బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఖండించారు. ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను రెచ్చగొట్టిన రేవంత్‌రెడ్డి తన అసమర్థతను ఒప్పుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 అవకతవకలపై వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టాలన్నారు.

సిమ్ బాక్స్ ముఠా అరెస్టు

» అంతర్జాతీయ కాల్స్‌ను.. లోకల్ కాల్స్‌గా మారుస్తున్న ముఠా

» హాంగ్‌కాంగ్‌లో సూత్రధారి వెన్నీసా..

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే అంతర్జాతీయ ఫోన్‌కాల్స్‌ను రిసీవ్ చేసుకోవద్దని, మోసగాళ్ల ఉచ్చులో చిక్కుకోవద్దని కేంద్ర,రాష్ట్ర సంస్థలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు తమ పంథాను మార్చారు. అంతర్జాతీయ కాల్స్‌ను స్థానిక కాల్స్‌గా మార్చే సాంకేతికతను వాడుతూ సిమ్ బాక్స్ డంపింగ్ ద్వారా ఎర వేయడానికి సన్నద్ధమయ్యారు. హాంగ్‌కాంగ్‌లో ఉన్న సైబర్ నేరగాళ్ల ముఠాలోని సూత్రధారి వెన్నీసా అనే మహిళ ద్వారా హైదరాబాద్, చాంద్రాయణగుట్టలలో సిమ్ బాక్స్ ఏర్పాటు చేసిన హిదయతుల్లా, అతనికి వందలాది సిమ్ కార్డులు ఇచ్చిన మరో ఇద్దర్ని సైబర్ సెక్యూరిటీ, కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖాధికారులు సంయుక్త ఆపరేషన్‌లో పట్టుకున్నారు. కార్ల వ్యాపారం చేసే హిదయతుల్లా అందులో నష్టం రావడంతో స్నాప్‌చాట్ ద్వారా పరిచయమైన ఒక వ్యక్తిని సంప్రదించాడు. అతనిచ్చిన సలహా మేరకు ఒక ట్రేడింగ్ యాప్‌లో రూ.16లక్షలు పెట్టుబడి పెట్టి మళ్లీ నష్టపోయాడు. దీంతో సదరు అగంతకుడు హిదయతుల్లాకు వాట్సాప్ ద్వారా హాంగ్‌కాంగ్‌లో ఉన్న వెన్నీసా అనే మహిళను పరిచయం చేశాడు. తమకు సాయం చేస్తే డబ్బు వచ్చేలా చేస్తామని వెన్నీసా పేర్కొనడంతో హిదయతుల్లా ఒప్పుకున్నాడు. ఒక సిమ్ బాక్స్‌ను పంపిస్తామని, స్థానికంగా సిమ్ కార్డులు సేకరించి, వైఫై కనెక్షన్ తీసుకుని దాని ఆపరేషన్ తమకు అప్పగించాలని వెన్నీసా సూచించడంతో హిదయతుల్లా సరేనన్నాడు. అతడికి కొరియర్ డెలివరీ బాయ్ ద్వారా అతనికి సిమ్ బాక్స్ అందింది. సిమ్‌కార్డుల కోసం వివిధ టెలికం కంపెనీల్లో పనిచేస్తున్న అహ్మద్‌ఖాన్, షోయబ్‌లను హిదయతుల్లా సంప్రదించాడు, వారు అందించిన 500 సిమ్ కార్డుల్లో 200 కార్డులను సిమ్ బాక్స్‌లో వేసి దాన్ని వెన్నీసా సూచించినట్లు హిదయతుల్లా పని చేయడం ప్రారంభించాడు. సైబర్ సెక్యూరిటీ బ్యూరోకి అందిన ఫిర్యాదు ఆధారంగా రంగంలో దిగిన పోలీసు బృందాలు చాంద్రాయణగుట్ట నుంచి విదేశీ కాల్స్ రూట్ అవుతున్నట్లు గుర్తించి హిదయతుల్లాతో పాటు సిమ్‌లు అందచేసినవారిని పట్టుకున్నారు. వెన్నీసా గురించి దర్యాప్తు జరుపుతున్నామని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అదనపు డైరెక్టర్ అనురాగ్ తెలిపారు.

గొర్రెల స్కాం కేసులో ఈడీ దూకుడు

బాధితులను విచారించేందుకు నోటీసులు జారీ

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల కొనుగోలు, బిల్లుల చెల్లింపు గోల్‌మాల్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వేగం పెంచింది. గొర్రెల స్కాంకు సంబంధించి ముందుగా కొందరు బాధితులు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా ఏసీబీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగినట్లు తేలడంతో నిందితులుగా ఉన్న ప్రస్తుత, మాజీ ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులను అరెస్ట్ చేసింది. ఏసీబీ కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ కేసులో బాధితులుగా ఉన్న వారిని విచారించి వాంగ్మూలం నమోదు చేసేందుకు ఈడీ హైదరాబాద్ జోనల్ అధికారులు సిద్ధమయ్యారు. ఏసీబీ నుంచి సేకరించిన వివరాల ఆధారంగా బాధితులకు నోటీసులు జారీ చేసి ఈ నెల 15న విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. మొదటి దశలో బాధితులను విచారించిన అనంతరం రెండో దశలో ఈ కేసులో ఏసీబీ అరెస్ట్ చేసిన వారికి సైతం నోటీసులు జారీ చేసి ప్రశ్నించేందుకు ఈడీ అధికారులు సిద్ధమవుతున్నారు.

బీసీ 'స్థానిక రిజర్వేషన్ల'కు అడ్డు బీజేపీనే

» మంత్రులు పొంగులేటి, వివేక్, వాకిటి, సీతక్క, సురేఖ

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% కల్పించకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డు పడుతోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, సీతక్క మండి పడ్డారు. ఈ విషయంలో ఇచ్చిన మాటకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. ఈ నెల 15న కామారెడ్డిలో టీపీసీసీ ఆధ్వర్యంలో జరిగే బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ ఏర్పాట్లపై మంత్రి పొంగులేటి నివాసంలో వారు గురువారం సమీక్షించారు. ఈ సభకు జన సమీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కామారెడ్డి వేదికగా ఇచ్చిన కుల గణన హామీని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు చేశామన్న మంత్రులు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పనలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. కానీ, బీసీలకు రిజర్వేషన్ కల్పించకుండా బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. కామారెడ్డి సభకు రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

కార్మికుల భద్రతపై దృష్టి పెట్టాలి: మంత్రి వివేక్

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రసాయన, ఫార్మా పరిశ్రమల్లో ఉద్యోగులు, కార్మికుల భద్రతపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సంబంధిత అధికారులు, యాజమాన్యాలను కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి ఆదేశించారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో 'కెమికల్, ఫార్మా పరిశ్రమల్లో వృత్తిపరమైన భద్రత' అంశంపై కంపెనీల ప్రతినిధులు, ఐటీఐ కాలేజీల ప్రిన్సిపాళ్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. మంత్రి వివేక్ ఇందులో పాల్గొని మాట్లాడారు. పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో ఘోర ప్రమాదం, ప్రాణ నష్టం జరిగిన సంగతి అందరికీ తెలిసిందేనని, దీనిని కంపెనీ యాజమాన్యాలు, అధికార వర్గాలు ఒక కేస్ స్టడీగా తీసుకోవాలని ఆయన సూచించారు.

రిటైర్డ్ జర్నలిస్టులకు పింఛను ఇవ్వాలి

» మంత్రి పొంగులేటికి వయోధిక పాత్రికేయుల వినతి

హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ జర్నలిస్టులకు పింఛను సౌకర్యం కల్పించాలని కోరుతూ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, రెవిన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వయోధిక పాత్రికేయుల సంఘం ప్రతినిధులు గురువారం వినతిపత్రం సమర్పించారు. జర్నలిజం ప్రధాన వృత్తిగా దశాబ్దాలుగా సేవలు అందించి పదవీ విరమణ చేసిన వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక వెసులుబాటు లేకపోవడంతో వృద్ధాప్యంలో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటిని ఆయన క్యాంప్ ఆఫీసులో కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు.

మూడు ప్రాజెక్టులకు పెట్టుబడి అనుమతిలివ్వండి

» సీడబ్ల్యూసీకి రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మూడు ప్రాజెక్టులకు పెట్టుబడి అనుమతి(ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్) కోసం ప్రభుత్వం దరఖాస్తు చేసుకుంది. ముక్తేశ్వర్(చిన్న కాళేశ్వరం), మొడికుంటవాగు, చనాకా కొరాటాలో డిస్ట్రిబ్యూటరీ పనుల కోసం పెట్టుబడి అనుమతులు ఇవ్వాలని కేంద్ర జలవనరుల సంఘాన్ని(సీడబ్ల్యూసీ) కోరింది. ఈ ప్రాజెక్టుల డీపీఆర్‌లకు ఇదివరకే సీడబ్ల్యూసీ క్లియరెన్స్ ఇవ్వగా.. సాంకేతిక సలహా కమిటీ(టీఏసీ) సాంకేతిక అనుమతి కూడా ఇచ్చింది. ఇక ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన(పీఎంకేఎస్‌వై-ఏఐబీపీ) కింద ఏ ప్రాజెక్టుకు కేంద్ర సహాయం కోరాలన్నా.. సీడబ్ల్యూసీ నుంచి ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ తీసుకోవాల్సిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ కోసం అర్జీ పెట్టుకున్నారు. ఇది రాగానే పీఎంకేఎస్‌వై కింద కేంద్ర సహాయం కోసం దరఖాస్తు చేసుకోనున్నారు.

ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి రూ.1119 కోట్ల ప్రాజెక్టు

కంది, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా ఎద్దుమైలారంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి రూ.1,119 కోట్ల విలువైన భారీ వర్క్ ఆర్డర్ లభించింది. భారత సైన్యంలోని పదాతి దళాలు వినియోగించే బీఎంపీ-2 వాహనాల ఓవర్‌హాలింగ్ పనులకు సంబంధించిన కాంట్రాక్టు దక్కింది. ఏడాదికి 100 బీఎంపీ-2 వాహనాలకు ఎద్దుమైలారం పరిశ్రమలో ఓవర్‌హాలింగ్ చేయనున్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర రక్షణ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని పరిశ్రమ ఉద్యోగులు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో పరిశ్రమ గత వైభవం సంతరించుకుంటుందని ఏవీఎన్ఎల్ (ఆర్మ్‌డ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్) సీఎండీ సంజయ్ ద్వివేది తెలిపారు. కాగా, పరిశ్రమకు ఈ ప్రాజెక్టు లభించడంపై బీఎంఎస్ (భారతీయ మజ్దూర్ సంఘ్) నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ సీనియర్ నేత నర్సింహారెడ్డి సహకారం వల్ల కేంద్ర రక్షణ శాఖ నుంచి వర్క్ ఆర్డర్ మంజూరైందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపీ రఘునందన్‌రావును కలిసిన బీఎంఎస్ నాయకులు, పరిశ్రమ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ఎయిర్ టూర్ ప్యాకేజీలు

పంజాగుట్ట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) హైదరాబాద్ నుంచి వివిధ పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక ఎయిర్ టూర్ ప్యాకేజీ సేవలు అందిస్తోంది. వాటికి సంబంధించిన పోస్టర్‌ను ఐఆర్‌సీటీసీ అసిస్టెంట్ మేనేజర్ పీవీ వెంకటేశ్ గురువారం ఆవిష్కరించి ప్యాకేజీల వివరాలు వెల్లడించారు. వివరాలకు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో గానీ.. 9701360701, 9281030726 ఫోన్ నెంబర్లకు గానీ సంప్రదించాలని సూచించారు.

సర్కారు వైద్యానికి భయపడిన గర్భిణి

» ధైర్యం చెప్పిన వైద్య సిబ్బంది

» రిమ్స్‌లో మగబిడ్డకు జన్మనిచ్చిన మహిళ

ఆదిలాబాద్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో పురుడు పోసుకునేందుకు భయపడిన గర్భిణికి సర్కారు వైద్య సిబ్బంది ధైర్యం కల్పించారు. ప్రభుత్వ సేవలు సురక్షితమని, అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని నమ్మకం కల్పించడంతో చివరకు సర్కారు దవాఖానలో వైద్యానికి అంగీకరించింది. ఆస్పత్రికి తరలించిన గంటలోపే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆదిలాబాద్ దహిగూడ గ్రామానికి చెందిన ఆత్రం భీంబాయి అనే మహిళను ప్రసవం కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించేందుకు అంకోలి పీహెచ్‌సీ సిబ్బంది గ్రామానికి వెళ్లారు. తన కోసం వైద్య సిబ్బంది వస్తున్నారన్న భయంతో సమీపంలో ఉన్న పత్తిచేనులో మహిళ దాక్కుంది. గంట సేపు వెతకగా పత్తి చేనులో తన కుమారుడితో పాటు ఉన్న మహిళను వైద్య సిబ్బంది గుర్తించారు. కౌన్సెలింగ్ తర్వాత ఆస్పత్రికి వచ్చేందుకు ఆమె ఒప్పుకొంది. ఆమెను జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా, సాధారణ ప్రసవం అయింది. ప్రస్తుతం తల్లి, బిడ్డల ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపారు.

967 డిగ్రీ కళాశాలల్లో 2.41 లక్షల సీట్లు

» నేటి నుంచి 'దోస్త్' స్పాట్ అడ్మిషన్లు

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన దోస్త్ స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. సంబంధిత వివరాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి గురువారం వెల్లడించారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం 967 డిగ్రీ కళాశాలల్లో 2,41,936 సీట్లు ఉన్నాయన్నారు. శుక్రవారం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, యునివర్సిటీ కళాశాలలు, గురుకులాల్లో కోర్సుల వారీగా ఖాళీగా ఉన్న సీట్ల వివరాలను ఆయా కళాశాలల నోటీసు బోర్డులపై ప్రకటిస్తామని తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల్లో ప్రవేశాల ప్రక్రియ ఉంటుందన్నారు. ఇంటర్ అర్హత కలిగిన విద్యార్థులు నేరుగా కళాశాల ప్రిన్సిపాళ్లను కలిసి ధ్రువీకరణ పత్రాలు చూపించి ప్రవేశాలు పొందవచ్చన్నారు. ప్రవేశాల్లో స్థానిక విద్యార్థులకు తొలి ప్రాధాన్యం ఇస్తామని, వారు లేని పక్షంలోనే స్థానికేతరులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు.

కుప్పకూలిన ఆదిలాబాద్ కలెక్టరేట్ పైకప్పు

(మొదటిపేజీ తరువాయి)

కుప్పకూలడంతో అధికారులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సాయంత్రం సమయంలో ఘటన జరగడంతో ప్రజలెవరూ లేక పోవడంతో భారీ ప్రమాదం తప్పినట్లయింది. అదే సమయంలో కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహిస్తున్నప్పుడు స్లాబ్ కూలడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. స్లాబ్ నెమ్మదిగా కూలుతుండటంతో యంత్రాంగం ప్రాణాలరచేత పట్టుకుని ప్రత్యామ్నాయ మార్గం ద్వారా బయట పడ్డారు. ఈ ఘటనలో ప్రాణాపాయం తప్పడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పాత కలెక్టరేట్ శిథిలావస్థకు చేరుకోవడంతో న్యూ హౌజింగ్ బోర్డు పరిధిలో రెండేళ్ల క్రితం ప్రారంభించిన నూతన కలెక్టరేట్ భవన పనులు కొనసాగుతున్నాయి. కనుక కొత్త కలెక్టరేట్ భవన నిర్మాణం వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాన్ని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



ఆర్ఆర్ రైలుకు 6 వేల ఎకరాలు

(మొదటిపేజీ తరువాయి)

కోసం 937 ఎకరాలు.. ఇలా మొత్తం 6 వేల ఎకరాల భూమి అవసరం అవుతుందని తెలిపారు. కాగా రీజినల్ రింగు రైలు అలైన్‌మెంటు మారుతోందని, రీజినల్ రింగు రోడ్డుకు పక్కనే రాబోతుందని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. 'ఆర్ ఆర్ఆర్ పక్కనే రైలు' శీర్షికన జులై 21న ఒక కథనాన్ని ప్రచురించింది.

ఆ 45 మీటర్ల భూమి సర్దుబాటు ఎలా?

రింగు రోడ్డు పక్కనే రైలు నిర్మాణానికి అవసరమైన 45 మీటర్ల భూమి విషయమే సందిగ్ధంగా మారింది. రింగు రోడ్డు ఉత్తరభాగం నిర్మాణానికి అవసరమై భూమిలో దాదాపు భూ సేకరణ చివరి దశకు చేరింది. దక్షిణభాగంలో ఇంకా భూ సేకరణ ప్రారంభంకాలేదు. కాబట్టి ఈ భాగంలో రో డ్డు, రైలు మార్గాలకు అవసరమైన మేరకు భూమిని సేకరించుకునే అవకాశం ఉంది. ఇప్పుడు ఉత్తరభాగం వైపు రైలు మార్గానికి అవసరమైన భూ మిని ఎలా సర్దుబాటు చేయాలనేదానిపైనే ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ మార్గంలో రోడ్డు కోసం ఇప్పటికే 100 మీటర్ల వెడల్పుతో భూమిని సేకరించారు, మళ్లీ ఇప్పుడు దీనికి అదనంగా 45మీటర్లను సేకరించేందుకు ఉన్న అవకాశాలు, ఏర్పాట్లపై సమాలోచనలు చేస్తోంది.

హైస్పీడ్ రైళ్లు..

హైదరాబాద్ మీదుగా చెన్నై, బెంగళూరు వరకు వేర్వేరుగా రెండు హై స్పీడ్ రైల్ కారిడార్లను నిర్మించాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో.. ఆ వివరాలను కూడా అధికారులు గురువారం సీఎం రేవంత్‌కు తెలిపారు. ఆ రైళ్లు గంటకు 350 కి.మీ వేగంతో నడిచేలా ట్రాక్ నిర్మిస్తామని.. 320 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడుస్తాయని తెలిపారు. హైదరాబాద్-బెంగళూరు కారిడార్ మొత్తం పొడవు 576 కిలోమీటర్లు కాగా.. అందులో 218 కిలోమీటర్లు తెలంగాణ పరిధిలో ఉంటాయని, మొత్తం మూడు స్టేషన్లు వస్తాయని, దాదాపు 705 హెక్టార్ల భూమి అవసరమని, ఈ కారిడార్ నిర్మాణానికి రూ.1.75 లక్షల కోట్లను వెచ్చించనున్నామని రైల్వే అధికారులు వెల్లడించారు. అలాగే హైదరాబాద్-చెన్నై మార్గం మొత్తం పొడవు 744 కిలోమీటర్లు కాగా తెలంగాణ పరిధిలో 236 కిలోమీటర్లు ఉంటాయని.. మొత్తం 5 స్టేషన్లు వస్తాయని, దీనికోసం 790 హెక్టార్ల భూమి అవసరమని, ఈ కారిడార్ నిర్మాణానికి సుమారు రూ.2.24లక్షల కోట్ల వరకు ఖర్చవుతుందని తెలిపారు. ఈ రెండు కారిడార్లనూ కేంద్రమే నిర్మించనుంది. అయితే ఈ రెండింటి అలైన్‌మెంట్ల విషయంలో సీఎం రేవంత్ కీలక సూచనలు చేసినట్టు సమాచారం. హైదరాబాద్-బెంగళూరు మార్గాన్ని శంషాబాద్, మహబూబ్‌నగర్, శ్రీశైలం మీదుగా తీసుకెళ్తే శ్రీశైలానికి రైల్వే మార్గం ఏర్పడుతుందని..



తద్వారా తెలంగాణ నుంచి అక్కడికి వెళ్లే భక్తులకు ఉపయుక్తంగా ఉంటుందని సూచించినట్టు తెలిసింది. అలాగే హైదరాబాద్-చెన్నై కారిడార్ అలైన్‌మెంట్‌ను శంషాబాద్-బాటసింగారం-నార్కట్‌పల్లి-సూర్యాపేట-ఖమ్మం-అమరావతి-గుంటూరు మీదుగా కేంద్ర రైల్వే అధికారులు రూపొందించారు. అయితే ఇప్పటికే నార్కట్‌పల్లి, ఖమ్మం, విజయవాడ వైపు రైలు మార్గాలు ఉన్నందున హైదరాబాద్-అమరావతి మధ్యన ప్రతిపాదిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రోడ్డుకు సమాంతరంగా నిర్మిస్తే చాలావరకూ కొత్త ప్రాంతాలకు రైలు కనెక్టివిటీ ఏర్పడుతుందని, తద్వారా కొత్తగా వ్యాపార లావాదేవీలకు అవకాశం ఉంటుందని సీఎం అభిప్రాయపడినట్టు సమాచారం. పైగా ఈ మార్గాన్ని బందరు పోర్టు వరకు నిర్మించడం వలన తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న డ్రై పోర్టుకు రైలు కనెక్టివిటీ ఏర్పడుతుందని వెల్లడించినట్టు తెలిసింది. సీఎం సూచనలను పరిశీలిస్తామని రైల్వే అధికారులు చెప్పినట్టు సమాచారం.

రాష్ట్రంలో మరికొన్ని ప్రాజెక్టుల వివరాలు..

కేంద్రం నుంచి తెలంగాణకు మంజూరైన కొన్ని రైల్వే లైన్ల వివరాలను కూడా అధికారులు సమీక్షలో సీఎంకు తెలిపారు. అవేంటంటే..

- వికారాబాద్-కృష్ణా మార్గం.. 130 కిలోమీటర్లు.. నిర్మాణ ఖర్చు రూ.2,784.11 కోట్లు. ఈ రూట్‌లో పరిగి, కొడంగల్, టేకల్‌కోడే, మాటూర్, బాలంపేట, అన్నాసాగర్, నారాయణపేట, మక్తల్‌లో స్టేషన్లు రానున్నాయి.
- డోర్నకల్- గద్వాల మార్గం.. 296 కిలోమీటర్లు. నిర్మాణ ఖర్చు రూ.5,920 కోట్లు.
- డోర్నకల్-మిర్యాలగూడ రూట్ 97.45 కిలోమీటర్లు కాగా.. నిర్మాణ వ్యయం రూ.2,184 కోట్లు.
- కల్వకుర్తి- మాచర్ల రూట్.. 126 కిలోమీటర్లు. నిర్మాణ వ్యయం రూ.2,520 కోట్లు.

..అలాగే అమృత్ భారత్ పథకం కింద దేశవ్యాప్తంగా చేపట్టిన రైల్వే స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా రాష్ట్రంలో రూ.2,760 కోట్లతో 40 స్టేషన్లను అభివృద్ధి చేయనున్నామని, ఇప్పటికే బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్ల పనులు పూర్తయ్యాయని రైల్వే శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. సికింద్రాబాద్, హైదరాబాద్ స్టేషన్ల కోసమే దాదాపు రూ.1,042 కోట్లను, లింగంపల్లి, కాచిగూడ స్టేషన్ల కోసం 802.88 కోట్లను, మిగిలిన 36 స్టేషన్ల కోసం 915.27 కోట్లను వెచ్చించనున్నట్టు తెలిపారు.

కొద్ది రోజులు నిదానంగా ఉండు అన్నీ సర్దుకుంటాయి

» ఎమ్మెల్సీ కవితకు తల్లి శోభ సూచన

» కూతురి ఇంటికి వెళ్లిన కేసీఆర్ సతీమణి

» అల్లుడి బర్త్‌డే కార్యక్రమానికి హాజరు

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సతీమణి శోభ.. ఎమ్మెల్సీ కవిత నివాసానికి వెళ్లారు. బుధవారం రాత్రి జరిగిన అల్లుడు అనిల్ పుట్టిన రోజు కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా శోభ.. కవితకు ప్రత్యేకంగా కొన్ని సూచనలు చేసినట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. కొద్ది రోజులు నిదానంగా ఉండాలని, అన్నీ సర్దుకుంటాయని చెప్పినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, సంతోశ్ అవినీతి అనకొండలని.. వారి వల్లే కేసీఆర్‌కు అవినీతి మరక అంటిందని పది రోజుల క్రితం కవిత చేసిన ఆరోపణలు సంచలనం సృష్టించాయి. పర్యవసానంగా ఆమె పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన సంగతి తెలిసిందే. కల్వకుంట్ల కుటుంబంలో తీవ్ర విభేదాలు తలెత్తాయని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరిగింది. తదనంతరం కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్ పలుమార్లు భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో కవిత నివాసానికి ఆమె తల్లి వెళ్లడం ఆసక్తిని రేపింది.

5న మనవడి బర్త్‌డేకు అమ్మమ్మ దూరం..

ఈ నెల 5న జరిగిన కవిత కుమారుడి బర్త్ డే కార్యక్రమానికి శోభ హాజరుకాలేదని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. 'కవిత కుమారుడి బర్త్‌డే సందర్భంగా ఇంట్లో సత్యనారాయణ స్వామి వ్రతం చేసుకుంటారు. ఈ కార్యక్రమానికి శోభతో పాటు కుటుంబసభ్యులంతా హాజరవుతారు. అయితే ఈసారి అలా జరగలేదు. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొంటూ ఈ నెల 2న కవితను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో, తన కుమారుడి బర్త్‌డే కార్యక్రమానికి రావాలని కవిత ఆహ్వానించినా.. ఆమె తల్లి రాలేదు. అయితే, కొత్త బట్టలు, పూజా సామగ్రి పంపించారు' అని పార్టీ వర్గాలు తెలిపాయి.

భవిష్యత్తులో భారత్- ఆఫ్రికా వ్యవసాయ బంధం బలోపేతం

» దేశానికి విత్తన హబ్‌గా తెలంగాణ

» ఇండియా- ఆఫ్రికా సీడ్ సమ్మిట్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో భారత్- ఆఫ్రికా దేశాల మధ్య వ్యవసాయ రంగ సంబంధాలు మరింత బలోపేతమవుతాయని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన 'ఇండియా- ఆఫ్రికా సీడ్ సమ్మిట్- 2025'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వాణిజ్యపరమైన అంశాలే కాకుండా విత్తన దౌత్యం ద్వారా విశ్వాసాన్ని పెంపొందించుకునేందుకు, శాస్త్ర పరిజ్ఞానాన్ని పంచుకునేందుకు, సుస్థిర వ్యవసాయం సమష్టిగా కలిసి పనిచేయటానికి ఈ వేదిక దోహద పడుతుందని అన్నారు. తెలంగాణ నుంచి 20కి పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నామని, కఠినమైన నాణ్యత ప్రమాణాలు పాటించటంతో తెలంగాణ విత్తనాలకు గ్లోబల్ గుర్తింపు లభించిందని తుమ్మల తెలిపారు. ఆఫ్రికా విత్తన మార్కెట్ విలువ 3.99 బిలియన్ డాలర్లుగా ఉన్నదని, భారత్- ఆఫ్రికా భాగస్వామ్యంతో పరిశోధకులు, రైతులు, విత్తనసంస్థలు లాభపడే అవకాశం ఉంటుందని అన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల కాల్ సెంటర్

» లబ్ధిదారుల ఫిర్యాదుల స్వీకరణకు టోల్‌ఫ్రీ నెంబర్ 1800 599 5991

» ప్రారంభించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల సందేహాలు, సమస్యల పరిష్కారం కోసం గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. 1800 599 5991 టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కాల్‌సెంటర్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం కాల్ సెంటర్‌కు వచ్చిన ఫోన్ చేసిన వారితో మాట్లాడారు. వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్‌కు చెందిన లబ్ధిదారు తన ఇల్లు పునాది వరకు పూర్తయినా బిల్లు రాలేదని తెలపగా వివరాలు పరిశీలించి.. వచ్చే సోమవారం నాటికి రూ.లక్ష ఖాతాలో జమవుతాయని చెప్పారు. మరో వ్యక్తి ఫోన్ చేసి హైదరాబాద్‌లో ఇళ్లు ఎప్పుడు ఇస్తారని అడగ్గా.. నివాస స్థలాల కొరత వల్ల ఆలస్యమైందని, త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ తప్పకుండా ఇళ్లు అందిస్తామని మంత్రి సమాధానమిచ్చారు. ఫోన్ కాల్స్ అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కాల్ సెంటర్ పని చేస్తుందని తెలిపారు. సాంకేతిక సమస్యలు, అవినీతి ఆరోపణలపై ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కొత్త ప్రాజెక్టుల అలైన్‌మెంట్లు

» విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్టుల అనుసంధానం ఉండాలి

» దక్షిణ మధ్య రైల్వే అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ సూచనలు



రైల్వే ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు అవసరాలు, పారిశ్రామిక కారిడార్లు, పర్యాటక కేంద్రాలను దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలను అందిస్తూ, ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే విధంగా రైల్వే నూతన ప్రాజెక్టుల అలైన్‌మెంట్లు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆ శాఖ అధికారులకు సూచించారు. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీని ఆధునిక విధానంలో అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులతోపాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సీఎం గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని.. అందుకు అవసరమైన నిధులను సమకూర్చటంతో పాటు భూసేకరణకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి హాజరైన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవతో.. నూతనంగా ప్రతిపాదించిన ప్రాజెక్టులపై సీఎం ప్రత్యేకంగా చర్చించారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్ కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉందని గుర్తు చేశారు. కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. దీనిపై ఇప్పటికే 300 కిలోమీటర్ల అలైన్మెంట్ ప్రతిపాదనలను సైతం రాష్ట్ర ప్రభుత్వం తయారుచేసిందన్నారు. ప్రతిపాదనలకు అనుగుణంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని.. రైల్వే విభాగం పరిశీలనలో ఉన్న అలైన్‌మెంట్‌తో పాటు రాష్ట్రప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్‌మెంట్‌లను పరిశీలించి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. హైవే వెంట రైలు మార్గం ఉండాలని, హైవేకు ఇరువైపులా 1.5 కిలోమీటర్ల దూరం వరకూ పారిశ్రామిక కారిడార్‌ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయని చెప్పారు. కొత్తగా అభివృద్ధి చేస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగుళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలన్నారు. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగు రైలు భవిష్యత్‌లో రవాణా అవసరాలకు కీలకమవుతుందని... ట్రిపుల్ ఆర్ వెంట రింగు రైలు ఏర్పాటుతో రాజధాని స్వరూపం మారిపోతుందని పేర్కొన్నారు. వికారాబాద్- కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని.. గద్వాల-డోర్నకల్ రైల్వే లైన్ పనుల డీపీఆర్ పూర్తి చేసి వేగంగా చేపట్టాలని కోరారు. భూపాలపల్లి నుంచి వరంగల్‌కు కొత్త మార్గాన్ని పరిశీలించాలని సూచించారు. కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌తో పాటు వరంగల్ అభివృద్ధి అయ్యేలా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలని రైల్వే అధికారులకు సీఎం సూచించారు.

లాకర్ తాళాల కోసం చిత్ర హింసలు పెట్టి..

» చెప్పకపోవడంతో కుక్కర్‌తో కొట్టి.. అయినా ఆగ్రహం తగ్గక గొంతుకోసి..

» రేణు అగర్వాల్ హత్యఘటనలో విస్తుపోయే అంశాలు వెలుగులోకి

» హత్య చేసినది ఇంట్లో పనికి కుదిరినవారే..

హైదరాబాద్ సిటీ/ కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆ ఇద్దరూ ఇంట్లో పనివాళ్లు.. బంగారం, నగదు దోచుకోవాలని ప్రణాళిక వేశారు.. ఒంటరిగా ఉన్న యజమాని భార్యను కాళ్లు, చేతులు కట్టేశారు.. లాకర్ తాళం ఎక్కడుందని అడిగారు.. చెప్పకపోవడంతో ఆమెను చిత్రహింసలు పెట్టారు.. ప్రెషర్ కుక్కర్‌తో తలపై మోదారు.. అప్పటికీ నోరు విప్పకపోవడంతో ఆగ్రహంతో గొంతుకోసి పరారయ్యారు. కూకట్‌పల్లిలో జరిగిన రేణు అగర్వాల్ (50) దారుణహత్య కేసులో విస్తుపోయే అంశాలివి. ఆమెను హత్య చేసింది ఇంట్లో పనికి చేరిన హర్ష, రోషన్‌లేనని పోలీసులు నిర్ధారించారు. హత్య తర్వాత వారు యజమాని స్కూటీపైనే హఫీజ్‌పేట రైల్వేస్టేషన్‌కు వెళ్లి, అక్కడ స్కూటీని వదిలేసి రైల్లో పారిపోయినట్టు తేల్చారు.

పక్కాగా ప్లాన్ వేసుకుని..

పశ్చిమబెంగాల్‌కు చెందిన రాకేశ్ అగర్వాల్, రేణు అగర్వాల్ దంపతులు కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఉంటున్నారు. రాకేశ్ తన సోదరుడితో కలిసి ఫతేనగర్‌లో స్టీల్ హోల్‌సేల్ వ్యాపారం నడిపిస్తున్నారు. రేణు అగర్వాల్ ఇటీవల అనారోగ్యానికి గురవడంతో సర్జరీ జరిగినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఆమెకు సహాయంగా ఉండేందుకు కోల్‌కతాకు చెందిన శంకర్ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా.. ఇంట్లో కేర్ టేకర్, వంట మనిషిగా హర్ష అనే యువకుడిని 11 రోజుల క్రితం పనిలో పెట్టుకున్నారు. అదే భవనంలోని మరో అంతస్తులో రాకేశ్ అగర్వాల్ సోదరుడు ఉంటున్నారు. ఆయన ఇంట్లో 9నెలలుగా రోషన్ అనే పనిచేస్తున్నాడు. హర్ష, రోషన్ ఇద్దరూ జార్ఖండ్‌లోని ఒకే ప్రాంతానికి చెందిన స్నేహితులు. అయితే రాకేశ్ అగర్వాల్ స్టీల్ హోల్‌సేల్ వ్యాపారం చేస్తుండటంతో.. వారి ఇంట్లో నగదు, బంగారం ఎక్కువగా ఉంటుందని, అవి దోచుకుందామని హర్ష, రోషన్ ప్లాన్ వేసుకున్నారు. బుధవారం మధ్యాహ్నం రేణు అగర్వాల్ ఒంటరిగా ఉన్న సమయంలో తమ పథకాన్ని అమలు చేశారు. రేణు అగర్వాల్‌ను కట్టేసి.. లాకర్ తాళాలు ఇవ్వాలని, డబ్బు, బంగారం ఎక్కడున్నాయో చెప్పాలని చిత్రహింసలు పెట్టారు. ఆమె చెప్పకపోవడంతో హత్య చేశారు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు గొలుసు, కొంత నగదు తీసుకుని పారిపోయారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. కోల్‌కతాకు చెందిన శంకర్ ఏజెన్సీని సంప్రదించి, నిందితుల వివరాలు సేకరించారు. వారిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను పంపారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ అగర్వాల్ కుటుంబాల వద్ద వెయ్యి మంది పైగా పనివాళ్లు, కేర్ టేకర్లు, వంటవాళ్లు, డ్రైవర్లు ఈ ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్నట్టు తెలిసింది.



రేణు అగర్వాల్ (ఫైల్)

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.


SAMSUNG
Galaxy Z Fold7
Got a question? Go live. Get answers.
12:00
100
Google Gemini Live
What should be the grip to in-swing this ball?
For the in-swing, keep the seam angled towards leg slip and fine leg.
AI Button
Experience now!
Press it. Try it.
Google Gemini